# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

మార్చి 2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18 సంచిక: 3


సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు


ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040-27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| సంపదలతల్లి శ్రీమహాలక్ష్మిదేవి | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| యామునేయం నమామితం | 22 |
| మీ ప్రశ్న మా సమాధానం | 25 |
| కమనీయం-రమణీయం- మహనీయం | |
| ఆమలక ఏకాదశీ వైశిష్ట్యమ్ | 26 |
| ఉగాది పర్వదినం | 29 |
| ప్రదక్షిణ | 32 |
| తిరుప్పావై | 36 |
| రామాయణ రత్నాకరం | 42 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 46 |
| ముకుందమాల | 52 |
| శ్రీకృష్ణ తత్వం | 57 |
| తిరుమల సర్వస్వం | 59 |
| మహాశివుడి యతీశ్వరావతారము | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# నిర్ణయం మనదే

సృష్టిలో జచరిగే ప్రతి సంఘటనకు కర్త, కర్మ, క్రియ శ్రీమన్నారాయణుడే కారకుడు. సృష్టిలో అణువణువు, కణ కణము, ప్రతి ప్రాణి, చెట్టు, చేమ, ప్రతి మనిషి సర్వములో ఆయనున్నారు. ఆయన ఉంటేనే ఆ ప్రాణికి ఉనికి ఉంటుంది. ఆయన వెళ్ళిపోయినప్పుడు ప్రాణి శవమైపోతుంది. సంఘములో కొందరు నోబుల్ ప్రైజ్ పొందిన మేధావులు, మరికొందరు దుర్మార్గులు కలిసి జీవిస్తున్నారు. మరి వీరిలో భగవంతుడు కొందరితో మంచిపని, మరి కొందరితో చెడుపని ఎందుకు చేయిస్తున్నారు? కొందరు క్షణికావేశపరులైతే, మరికొంతమంది శాంతచిత్తులుగా ఉంటారు. ప్రతి పనికీ స్వామివారి శక్తే కారణము అయినప్పుడు ఈ తారతమ్య భేదములు ఎందుకు? భగవంతునికి అందరూ సమానులే అయినప్పుడు ఈ తారతమ్య భేదము, పక్షపాతము చూపినట్టు మనకు కనిపిస్తుంది. కాని అది నిజము కాదు, భగవంతునికి ప్రతి జీవుడు ఎంతో ఇష్టం. మనం జ్ఞానవంతులుగా అగుటకని మనకోసం వారు ఎన్నో అవతారములనెత్తి, ఎంతో కష్టపడుచున్నారు. నిజానికి భగవంతునికి అవసరం లేకున్నా మన ఉన్నతి కోసం ఆయన ఈ పని చేస్తున్నారు. ప్రతి అవతారానికి ఒక చరిత్ర చొప్పన ఎన్నో చరిత్రలు మనకందించి వాటిద్వారా సిద్ధి పొందమని చెప్పచున్నారు. భగవద్గీత, శ్రీమహాభారతము, భాగవతం, రామాయణం పురాణాలు ఈ కోవకు చెందినవే. ఇది మన ఉన్నతి కొరకు భావితరాలకు భగవంతుడు అందించిన గ్రంథాలు, ప్రతి దానిలో మన ప్రవర్తన, జీవించు నియమావళి, మంచిచెడ్డలు, ధర్మాధర్మములు చక్కగా వివరించారు. వీటిని చదివి ఆచరించుట మన కర్తవ్యం. అంతేకాని ప్రతి మనిషిలో భగవంతుడు ఉంటాడు కావున అందరూ ఒకేలా ప్రవర్తించాలి అని అనడం పొరపాటు. భగవంతుడు భక్తప్రియుడు, మన ఆసక్తిననుసరించి ప్రవర్తించేవాడు. మనము చెడును కోరుకుంటే మనచే చెడునే చేయిస్తాడు. మంచిని కోరుకుంటే మంచిని చేయిస్తాడు. కోరుకున్నది చేయుటకు కావలసిన శక్తి మాత్రం భగవంతునిదే. భగవంతుడు మనిషికి కొన్ని జ్ఞానేంద్రియాలు ఇచ్చాడు. వాటి సహాయంతో మంచి చెడులను విశ్లేషించి నిర్ణయము తీసుకొను బాధ్యత మనది. చిన్నపిల్లవాడు ఒక వస్తువు కావలెనని మంకు పట్టు పడితే మనకు ఇష్టం లేనప్పటికీ వాడి తృప్తి కోసం ఎట్లైతే ఆ వస్తువును కొనిపెడతామో, అలా మన తృప్తి కోసం మన ప్రేరణతో చెడ్డ పనులు చేయుటకు సహకరిస్తారు. ఇలా కొన్ని చెడ్డపనులు చేశాక మోహం నశించి వాడు పరివర్తన చెందగలడు. ఇలాంటి పరివర్తన కోసం భగవంతుడు వేయి కళ్ళతో ఎదురు చూస్తుంటాడట. కాని అదే మనిషి సద్బుద్ధి కలిగి మంచి పనులు చేయ నిర్ణయించినప్పడు, భగవంతుడు ప్రసన్నుడై ఆశీర్వదిస్తూ మరో నాలుగు అడుగులు వేసి మనలను ఆదుకుంటారు. కాబట్టి ప్రతి మనిషిలో భగవంతుని అంశ ఉన్నప్పటికీ దానిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయం మన స్వంత నిర్ణయము లేదా మన పూర్వజన్మ సుకృతమును బట్టి వస్తుందంటారు. మన కర్మానుసారమే జన్మ లభిస్తుంది. భగవంతుడు మన కర్మలకు సాక్షీభూతుడు మాత్రమే. నిష్పక్షంగా మన కర్మలను ఆచరించే విధంగా చేస్తాడు. కాని మన సుకృతము బాగా లేకపోయినప్పటికీ, ఎవరైతే సదా శ్రీవేంకటేశ్వరుని స్మరణ చేస్తూ ఉంటారో వారిని స్వామి సర్వదా రక్షిస్తుంటారు. భక్తులు తరించాలంటే స్వామివారికి శరణాగతి చేసి సదా ఆయన నామస్మరణ చేస్తూ ఉండుట ఒక్కటే మార్గము. ఈ రకంగా జీవించే మానవుని దుష్కృతాలను కూడా స్వామివారు సుకృతాలుగా మార్చి మనలను రక్షించగలరు.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

# చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన
ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________


మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com


చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

శ్లో ॥ అవనీతనయా కమనీయకరం
రజనీకర చారు ముఖాంబురుహమ్
రజనీచర రాజ తమోమిహిరం
మహనీయ మహం రఘురామ మయే

తాత్పర్యం – సీతతో పాణిగ్రహణమునకు (వివాహమునకు) తగినవాడు, చంద్రుని కంటె సుందరమైన తామరపూవు వంటి ముఖము కలవాడు, రాక్షసరాజయిన రావణాసురుడు అను చీకటికి సూర్యుని వంటివాడు, మహనీయుడు, రఘువంశమున జన్మించిన శ్రీరాముడగు వేంకటేశా! నిన్ను శరణు కోరు (పొందు) చున్నాను.

శ్లో ॥ సుముఖం సుహృదం సులభం సుఖదమ్
స్వనుజం చ సుఖాయ మమోఘ శరమ్
అపహాయ రఘూద్వహ మన్యమహం
న కథంచన కంచన జాతు భజే

తాత్పర్యం – సుందరమైన ముఖము కలవాడవు, మంచి హృదయము కలవాడవు, సులభముగా ఆశ్రయింప దగినవాడవు, సుఖమును కలిగించువాడవు, మంచి తమ్ముడు – మంచి భార్య కలవాడవు, వ్యర్థములు కాని బాణములు కలవాడవు, రఘువంశ తిలకుడవు అగు నిన్ను విడిచిపెట్టి వేరొక దైవమును సేవింపను.

# ముక్తిమార్గము



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

## శుద్ధ వసంతం

కడలుడిపి నీరాడఁ – గాఁ దలఁచు వారలకు
కడలేని మనసునకుఁ గడమ యెక్కడిది? || పల్లవి ||

1. దాహమణఁగిప వెనక – తత్త్వ మెరిఁగెద నన్న
దాహమేలణఁగు తా – తత్త్వమే మెరుఁగు?
దేహంబు గలయన్ని – దినములకునుఁ బదార్థ
మోహమే ఉడుగు దా – ముదమేల కలుగు?|| కడ ||

2. ముందరెరిగిన వెనక – మొదలు మరచెద నన్న
ముందరే మెరుఁగుఁ దా – మొదలేల మరచు?
అందముగఁ దిరువేంక – టాద్రీశు మన్ననల
కందు వెరిఁగిన మేలు – కలనైన లేదు
|| కడ ||





భావము – సముద్రములో అలలు నిలిపి పిమ్మట స్నానము చేయదలంచు వారికిని, తుదలేని కోరికలకు నెలవైన మనస్సునకును వేఱు సుగతి లేనేలేదు. లౌకిక భోగములపై కోరికలు నశించిన పిమ్మట పరతత్త్వ స్వరూపమును తెలిసికొందునన్నచో కోరిక లెట్లు నశించును? కోరికలు నశింపక పరతత్త్వమును జీవుడెట్లెరుంగగలడు? శరీరమున్నంత కాలము (శరీరముపై అభిమానమున్నంత కాలము) జీవులకు భౌతిక వస్తువులపై ఆశ నశింపదు. ఆశ నశింపక ఆత్మానందము సిద్ధింపదు. ఇకముందు భగవత్స్వరూపము నెరింగి ఆ పిమ్మటనే ఇంతదనుక అనుభవములో నున్న సంసార సుఖమును విస్మరింతునన్నచో, తాను భగవంతుని ఇక మీదట ఎట్లెరుంగగలడు? అలవాటు పడిన సంసార మూలమైన ప్రకృతిని ఆ తరువాత నెట్లు మరువగలడు? కరుణానిధియగు శ్రీవేంకటేశ్వరుని క్షమాగుణ స్వరూపమును గ్రహింపగల శ్రేయోదాయకమైన భక్తి కలలో కూడా జీవునకు లేదు. ఇక మాయామోహము నుండి విడివడి భగవత్స్వరూపము నెరుంగు యోగ్యత వాని కెక్కడిది? అని భావము.

# సంపదలతల్లి శ్రీమహాలక్ష్మీదేవి

– చిల్లర సీతారామారావు

"వందే లక్ష్మీం పరమశివమయీం శుద్ధ జాంబూ నదాభాం
తేజోరూపాం కనకవసనాం స్వర్ణభూషోజ్జ్వలాంగీం
బీజాంపూరం కనక కలశం హేమ పద్మం దధానా
మాద్యం శక్తిం సకల జననీం విష్ణువామాంకస్థాం"

మిక్కిలి మంగళస్వరూపిణి, బంగారు వంటి మేను గలది, కాంతిరూపిణి, జరీచీర తాల్చునది, బంగారు నగలచే మెరయునది, మాదీఫలము, బంగారుపాత్ర, బంగరు తామర తాల్చునది, వెన్నుని ఎడమ తొడపై కూర్చుండునది, జగముల తల్లి, ఆదిశక్తియగు శ్రీమహాలక్ష్మికి వందనం.



ఫాల్గుణ మాసము మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసము అని మహాభాగవతము తెలియచేయుచున్నది. ఇది తెలుగు మాసములలో చివరి మాసము. పూర్ణమి తిథి రోజున చంద్రుడు పూర్వఫల్గుణి నక్షత్ర సమీపమున గాని, ఉత్తరఫల్గుణి నక్షత్ర సమీపమున గాని సంచరించుచుండుట చేత ఈ మాసమునకు ఫాల్గుణమాసము అని పేరు వచ్చినది. ఫాల్గణ శుద్ధపూర్ణిమ నాడు. శ్రీమహాలక్ష్మీదేవి పాలకడలి నుండి ఉద్భవించింది. ఆరోజు సంపదలతల్లి శ్రీమహాలక్ష్మిని ఆరాధిస్తే లక్ష్మీదేవి అనుగ్రహం ప్రాప్తిస్తుంది. లక్ష్మీదేవికి ప్రియమైన వ్రతము కోజాగరీ వ్రతము. ఈ వ్రతమును ఆచరించుట వలన దారిద్ర్యము తొలగిపోవడమే కాకుండా సమస్త సంపదలు చేకూరుతాయని పురాణోక్తి. ఆ రోజున భగవత్పాద శ్రీ శంకరాచార్య విరచిత కనకధారా స్తోత్రమును పఠించి లక్ష్మీదేవి అనుగ్రహమును పొందాలి.

సకల సంపదలకు అధిష్ఠాన దేవత లక్ష్మీదేవి. లక్ష్మీదేవి సద్గుణరాశి. ఇంద్రియ నిగ్రహం, శాంతం, సౌశీల్యం వంటి సద్గుణాలకు సర్వమంగళ ఆమె. లోభము, మోహము, కామము, క్రోధము, మదము, మాత్సర్యము మొదలైన దుర్గుణాలు లేని దేవత లక్ష్మీదేవి. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అనేది పెద్దల మాట. భక్తి శ్రద్ధలతో తనను అర్చించేవారికి అష్టైశ్వర్యాలు, ఆనందాలు, అన్నవస్త్రాలు మొదలైన వాటిని ప్రసాదిస్తుంది. దేశానికైనా, రాష్ట్రానికైనా, వ్యక్తికైనా సంపదయే శక్తి స్రోతస్సు. అలాంటి ధనసంపదకు అధిష్ఠాత్రి లక్ష్మీదేవి. ధనము అంటే డబ్బు ఒక్కటే కాదు. ఆమె యొక్క దివ్య స్వరూపాలలో అదొకటి. న్యాయార్జితమైన సంపద, ధైర్యం, శౌర్యం, విద్య, వివేకం, ఉత్సాహం, కాంతి, సౌందర్యం, శుచి, శుభ్రత మున్నగునవి లక్ష్మీదేవి స్వరూపాలు. హిందూ దేవతలలో అత్యధికంగా పూజలందుకునే తల్లి లక్ష్మీదేవి. సర్వప్రాణుల పరిపుష్టికి సహకరించే విశ్వజనని.

శ్రీకృష్ణపరమాత్మ వామ భుజము నుండి మహాలక్ష్మి, దక్షిణ భుజము నుండి రాధ జన్మించారు. శ్రీకృష్ణుడు ద్వివిధ రూపములు దాల్చినాడు. ద్విభుజుడిగా రాధను స్వీకరించి గోలోకమున నివసించసాగాడు. చతుర్భుజుడిగా మహాలక్ష్మిని స్వీకరించి వైకుంఠమునకు వెళ్ళాడు. యోగశక్తి సంపన్నురాలైన లక్ష్మీదేవి అనేక అవతారములు ధరించింది. ఆమె అంశమే స్వర్గమున స్వర్గలక్ష్మి, పాతాళమున నాగలక్ష్మి, రాష్ట్రమున రాజ్యలక్ష్మి, పతి గృహమున గృహలక్ష్మియై విరాజిల్లినది. ఆమెయే భృగుమహర్షి తనయగా, క్షీరోదమున సింధు కన్యగా ఆవిర్భవించింది. బ్రహ్మాది దేవతలు, ముల్లోకవాసులు లక్ష్మీదేవిని ఆరాధించి, ఆమె అనుగ్రహము వలన శుభములను పొందారు.

భృగు మహర్షి, ఖ్యాతి దంపతులకు అత్యంత సౌందర్యవతియైన కూతురు జన్మించింది. ఆమె శుభలక్షణములు గలిగి యుండుట వలన ఆమెకు 'లక్ష్మి' అను నామకరణము గావించారు ఆ దంపతులు. క్రమ క్రమంగా పెరుగుతున్న లక్ష్మీది నారాయణుడి గుణగణములను విని, ఆయన యందు ప్రేమను పెంచుకోసాగింది. నారాయణుని పతిగా కోరి సముద్ర తీరమున ఘోర తపము చేయసాగింది. ఆమె తపమును గురించి తెలుసుకొని ఇంద్రుడు లక్ష్మీదేవిని పరీక్షిద్దామని నారాయణ రూపధారియై ఆమె దగ్గరకు వచ్చాడు. వరమును కోరుకొమ్మని పలికినాడు. లక్ష్మీదేవి నారాయణ రూపధారిని విశ్వరూపమును ప్రదర్శించమని అడిగింది. ఇంద్రుడు సిగ్గుపడి వెళ్ళిపోయాడు. నారాయణుడు లక్ష్మీదేవి దగ్గరకు వచ్చి వరమును కోరుకొమ్మని పలికాడు. లక్ష్మీదేవి కోరిక ప్రకారము విష్ణుమూర్తి తన విశ్వరూపమును ప్రదర్శించాడు. లక్ష్మీదేవి కోరిక ప్రకారము విష్ణుమూర్తి ఆమెను తన భార్యగా స్వీకరించాడు. లక్ష్మీదేవి క్షీరసాగరమున జన్మించిన గాథ ఇలా ఉంది.

స్వర్గాధిపతియైన దేవేంద్రుడు మధుపాన ప్రమత్తుడై, కామాసక్తుడై, రంభతో ఏకాంతముగా మహారణ్యమున విహరించసాగాడు. వైకుంఠము నుండి కైలాసమునకు పోతూ ఉన్న దూర్వాస మహర్షిని ఇంద్రుడు చూశాడు. చూడగానే ఎదురువెళ్ళి భక్తి ప్రపత్తులతో నమస్కరించాడు. ప్రసన్నుడైన దూర్వాసుడు ఇంద్రుడిని ఆశీర్వదించి విష్ణుమూర్తి ద్వారా బహూకరించబడిన పారిజాతమును కానుకగా ఇచ్చాడు. జరా మృత్యు హరము, శోక వినాశకము, మోక్ష కారకము అయిన పారిజాత మాలను స్వీకరించి, ఇంద్రుడు మదోన్మత్తుడై ఆ మాలను తన ఏనుగు ఐరావతము పైకి విసిరాడు. పారిజాత పుష్పాల స్పర్శతో ఆ ఏనుగు రూప, గుణ, తేజస్సు, వయస్సులతో విష్ణుతుల్యమై ఇంద్రుడిని విడిచి అరణ్యము లోనికి వెళ్ళిపోయింది. ఎంత ప్రయత్నించిననూ ఇంద్రుడు ఏనుగును ఆపలేకపోయాడు.

తాను ఇచ్చిన మాలను నిర్లక్ష్యం చేసిన ఇంద్రుడి మీద అంతులేని ఆగ్రహం కలిగింది దూర్వాసునికి. ఇంద్రుడికి శాపమునిస్తూ ఇలా అన్నాడు. "ఐశ్వర్య మదమున కన్ను మిన్ను కానకుండా నన్ను అవమానిస్తావా? విష్ణువు ప్రసాదించిన పారిజాతమాలను ప్రసాద రూపముగా నీకు ఇస్తే, దానిని ఏనుగు మీదకు విసిరేస్తావా? విష్ణు ప్రసాదమును అందుకొనిన తరువాత కళ్ళకు అద్దుకొని తినాలి. పుష్పము అయితే చెవిలో పెట్టుకోవాలి. అలా చేయకపోతే బ్రహ్మ హత్యా పాతకము చుట్టుకుంటుంది. అంతేకాదు అతనికి దరిద్రము చుట్టుకుంటుంది. బుద్ధి నశించిపోతుంది. సంపద శత్రువుల పరమవుతుంది. రాజ్యము పరుల వశమవుతుంది. ప్రసాదమును భక్తి శ్రద్ధలతో స్వీకరించినవాడు తన పితరులను ఉద్ధరించినవాడు అవుతాడు. జీవన్ముక్తుడవుతాడు. నీవు విష్ణుప్రసాదమును అవమానించావు. కనుక నీ (లక్ష్మి) సంపద నిన్ను వీడిపోవుగాక" అన్నాడు. ముని శాపమును విన్న ఇంద్రుడు ఆయన పాదముల మీద పడి "మునీంద్రా! మీరు నా అహంకారమునకు తగిన శాపమునే ఇచ్చారు. అపహృతమైన సంపత్తిని యాచించను. నాకు జ్ఞానమును ఉపదేశించండి" అన్నాడు.

శ్లో ॥ "ఐశ్వర్యం విపదాం బీజం జ్ఞాన ప్రచ్ఛన్న కారణమ్
ముక్తిమార్గ కుఠారశ్చ భక్తేశ్చ వ్యవధాయకమ్"

ఐశ్వర్యము – ఆపదలకు బీజ తుల్యము. జ్ఞానమును అపహరించు పిశాచము. ముక్తి మార్గమును ఛేదించుటకు దారము. భక్తికి అవరోధము. ఇంద్రుడి వినయపూర్వక పలుకులకు ప్రసన్నుడై దూర్వాసుడు జ్ఞానోపదేశము గావించాడు. పిదప ఇంద్రుడు తన రాజ్యమునకు వెళ్ళిపోయాడు. అప్పటికే అమరావతి రాజ్యము శత్రువుల వశమయింది. చింతాక్రాంతుడైన ఇంద్రుడు దేవతల గురువు బృహస్పతి దగ్గరకు పోయి నమస్కరించి జరిగిన వృత్తాంతమును వివరించాడు. "సురేంద్రా! విచారించకు.

విచారించుట జ్ఞానహీనుని లక్షణము. నీతిని తెలిసినవాడు, ఆపద సమయమున ధైర్యమును వీడడు. కలిమి లేములు, సుఖదుఃఖములు శాశ్వతము కావు. జీవి పూర్వజన్మమున తాను ఒనరించిన శుభా శుభ కర్మ ఫలములను అనుభవింపవలసి వచ్చును. నారాయణుడిని సేవింపుము. పోయిన సంపదలు తిరిగి ప్రాప్తించగలవు అని బోధించాడు బృహస్పతి. తదనంతరం బృహస్పతితో కలిసి బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు. బ్రహ్మ, బృహస్పతి, ఇంద్రులతో కలిసి విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళి ప్రార్థించారు. విష్ణుమూర్తి సముద్రమును మథించమని సలహా ఇచ్చాడు.

మంధర పర్వతమును కవ్వముగా, వాసుకి అనే సర్పరాజును త్రాడుగా చేసుకొని దేవదానవులు సముద్రమును మథించసాగారు. ముందుగా హాలాహలం బయటికి వచ్చింది. దానికి భయపడి సర్వులూ ఏకమై శివుడిని ప్రార్థించారు. కరుణించిన శివుడు దానిని కబళముగా మార్చి మింగాడు. ఆనాటి నుండి శివుడికి నీలకంఠుడు, నీలగ్రీవుడు అనే పేర్లు కలిగాయి. మంధరగిరి పర్వతము సముద్రములో మునిగిపోగా శ్రీహరి కూర్మముగా మారి ఆ గిరిని పైకెత్తాడు. మరల దేవ దానవులు సముద్రమును మథించసాగారు. క్రమముగా ఉచ్చైశ్రవము, కామధేనువు, కల్పవృక్షము, ఐరావతము, లక్ష్మి, చంద్రుడు, అమృతము, ధన్వంతరి మున్నగునవి ఉద్భవించినాయి. కామధేనువును మహర్షులు, ఉచ్చైశ్రవమును బలిచక్రవర్తి, ఐరావతమును ఇంద్రుడు తీసుకున్నారు. కల్పవృక్షము ఇంద్రుని నందనవనమునకు చేరింది. చంద్రుడు బ్రహ్మ అనుమతితో నిజ స్థానమునకు చేరుకున్నాడు. సముద్రమునుండి ఉద్భవించిన లక్ష్మీదేవికి సముద్రుడు పట్టు వస్త్రములను, వరుణుడు వైజయంతి మాలను, విశ్వకర్మ మణికేయూరాదులను, సరస్వతీదేవి తారాహారాన్ని, బ్రహ్మదేవుడు తామరపూవును, నాగదేవతలు కుండలములను, దేవవనితలు మణిమయ పీఠమును, భూదేవి నవ పల్లవములను, మేఘుడు వీణా శంఖ ధ్వనులను, గోవులు పంచగవ్యాలను సమర్పించాయి. ఆ సమయమున గంధర్వులు గానం చేశారు. అప్సరసలు నృత్యములు చేశారు. పండితులు వేదసూక్తములను పఠించారు. దిగ్గజములు పుణ్యావహ జల కలశములను తొండములతో ఎత్తి అభిషేకించాయి. సముద్రుడు తన కూతురికి, తన భర్తను తానే ఎంచుకునే అవకాశమునిచ్చాడు.

లక్ష్మీదేవి కలువదండను చేతపట్టుకుని తగిన వరుని కోసం దేవ దానవులందరినీ చూసుకుంటూ మెల్లగా నడవసాగింది. శ్రీహరిని చూడగానే ఆమెలో పలు ఆలోచనలు చోటు చేసుకున్నాయి. శ్రీహరి ఐశ్వర్యవంతుడు. పరమ దయాళువు, నిలకడ కలిగినవాడు, ఆడి తప్పడు, అలసత్వము లేదు. సాధు రక్షకుడు. ఇన్ని సద్గుణములు కలిగిన శ్రీహరియే నాకు తగిన భర్త అని ఆలోచించి చేతిలోని కలువమాలను విష్ణుమూర్తి మెడలో వేసింది. శ్రీహరి లక్ష్మీదేవిని



ప్రేమతో తన వక్ష స్థలమున నిలుపుకున్నాడు. ఆ సమయమున శంఖ, మృదంగ, వేణు ధ్వనులు మ్రోగాయి. సముద్రుడు తన అల్లుడైన శ్రీహరికి కౌస్తుభమాణిక్యమును సమర్పించాడు. దేవేంద్రుడు తిరిగి తన అమరావతికి అధిపతి అయ్యాడు.

లక్ష్మీదేవిని అదృష్టానికి, శుభానికి సూచికగా భావిస్తారు. ఆ చల్లనితల్లి అనుగ్రహించాలని, ఆమె నామస్మరణ నిత్యమూ ఉండాలని తమ పిల్లలకు లక్ష్మి పేరు పెడుతుంటారు. ఇంట్లో లక్ష్మీదేవి నిలకడగా ఉండాలంటే పరిశుభ్రతను పాటించాలి. స్వచ్ఛత, పవిత్రత ఉన్నచోటే లక్ష్మీదేవి నివసిస్తుంది. దేవతారాధన, శుచి, శుభ్రత, వేదవిహిత ధర్మపాలన జరుగు చోటు, మాతాపితరులను పూజించబడే ఇల్లు, శుభ్రపరచిన ముంగిలి, ద్వారం, గోవులు, ధనము, ధాన్యము ఇవన్నీ అమ్మ రూపాలే. అమ్మ నివాస స్థానములే. ధనాశ లేని యోగులకు వారి యోగశక్తే లక్ష్మీదేవి. బుద్ధి, ధృతి, నీతి, శ్రద్ధ, ఓర్పు, శాంతి, సమ్మతి ఈ ఏడుగురు దేవతలు లక్ష్మీదేవికి సన్నిహితులు. గురుభక్తి కలవారు, దేవపూజ, పితృపూజ చేసెడివారు, పగలు నిద్రించనివారు, సత్యమునే పలుకువారు, దానగుణం కలిగినవారు, పరధనమును, పరసతిని కోరనివారు, శుచి శుభ్రత కలిగినవారు, అతిథి సేవాపరులు మున్నగు వారి ఇంట లక్ష్మీదేవి నివసిస్తుంది. ధనమునకు, ధాన్యమునకు, పుస్తకమునకు, పెద్దలకు కాళ్ళు తగిలితే ఆగ్రహం కలుగుతుంది లక్ష్మీదేవికి.

త్రిలోక సంచారియైన నారదుడు ఒకసారి ఇంద్రుడిని కలిసి సంభాషిస్తున్న తరుణంలో ఒక స్త్రీ వారి దగ్గరకు వచ్చింది. ఇంద్రుడు ఆమెను నీవు ఎవరు అని అడిగాడు. అప్పుడు ఆ స్త్రీ ఇలా జవాబిచ్చింది. 'దేవేంద్రా! నాకు శ్రీ అని, లక్ష్మి అని, ఐశ్వర్యము అని పేర్లు ఉన్నాయి. ఇప్పటి దాకా నేను రాక్షసుల వద్ద ఉన్నాను. ఆ రాక్షసులు పితృదేవతలకు మంత్రములు చెబుతూ హవిర్భాగములిచ్చుట చేత, శ్రద్ధ, ధైర్యము, స్మృతి మున్నగు

మహాబుద్ధులు కలిగి యుండుట చేత, వారిని మెచ్చుకొని వారి దగ్గర ఉన్నాను. ఇప్పుడు వారి దగ్గర ఉండుటకు ఇష్టము లేక నీ దగ్గరకు వచ్చాను అని పలికింది. వారి దగ్గర ఉండటం నీకు ఎందుకు ఇష్టము లేదు? అని ప్రశ్నించాడు దేవేంద్రుడు. సమాధానమిస్తూ లక్ష్మీదేవి ఇలా పలికింది. రాక్షసులు శ్రేష్ఠ గుణములను వీడి గర్విష్ఠులు కావడం చేత వారిని విడిచాను. నీవు ధర్మపథమును అనుసరిస్తున్నావు కనుక నీ దగ్గరకు వచ్చాను. బుద్ధి, ధైర్యము, నీతి, శ్రద్ధ, మనోనిగ్రహము, ఓర్పు, శాంతము అను ఏడు గుణములు కలవారు వేదశాస్త్రములందు అధికులు అని చెప్పబడింది. ఈ ఏడు గుణములు ఏడు దేవతలు అని నుడివిరి. ఈ ఏడు దేవతలుండుచోటనే నేనుండెదను. రాక్షసుల యందు ఈ ఏడు గుణములు లేక క్రూర మనస్సు కలిగి యుండుట చేత నేను రాక్షసులను విడిచితిని. దేవతలు మంచి గుణములు కలిగినవారని తోచినందున ఇక్కడికి వచ్చాను' అన్న లక్ష్మీదేవి జవాబుకు నారదుడు, దేవేంద్రుడు సంతోషించారు.

శ్రీ అనేది లక్ష్మీదేవికి అసాధారణమైన పేరు. జ్ఞాన, ధన, ఐశ్వర్యాలతో దేదీప్యమానంగా వెలిగే లక్ష్మీదేవికి వేదము 'శ్రీ' అను సంజ్ఞను ఇచ్చింది. ఋగ్వేదము ప్రకారం శ్రీ గుణవాచకము. కాలక్రమేణా ఈ వాచకమునకు ఒక రూపం ఇవ్వబడింది. కొంత కాలము తర్వాత శుభలక్షణ పూర్ణమైన లక్షణాలన్నీ శ్రీ మరియు లక్ష్మి రెండూ ఏకమై శ్రీసూక్త రచనా కాలం నాటికి పూర్ణ దేవతా స్వరూపం లభించింది.

శ్రీసూక్తము లక్ష్మీదేవికి సంబంధించిన వేదమంత్రము. శ్రీసూక్తము లక్ష్మీదేవి స్తుతి. ప్రార్థన. జగద్గురువు శ్రీ శంకరాచార్యులవారు శ్రీసూక్తమును ప్రశంసిస్తూ శ్రీసూక్తము లక్ష్మీదేవి ప్రాణము అని, శ్రీయంత్రము ఆమె శరీరము అని వర్ణించారు. శ్రీసూక్త పారాయణము వలన లక్ష్మీదేవి అనుగ్రహం ప్రాప్తిస్తుంది. లక్ష్మీదేవికి చపల, చంచల అను పేర్లు కూడా ఉన్నాయి. లక్ష్మి కమలవాసిని. సరస్సులో తామర పువ్వులోనూ, ఇరుప్రక్కలా ఏనుగులతోనూ ఉంటుంది. తామరకొలనులో లక్ష్మీదేవి నిలకడగా ఉండదు. నీటి ప్రవాహానికి కదులుతూ అటూ ఇటూ ఊగుతూ ఉంటుంది. తాను నిలకడ లేని దానిని అని చెప్పడమే లక్ష్మీదేవి తామరకొలనులో, తామరపువ్వులో ఉండటంలోని పరమార్థం. ఇరుప్రక్కలా గల ఏనుగులకు అర్థము ఏమనగా శ్రీమహాలక్ష్మి ధనబలము, గజబలము అంతటిది అని అర్థము చేసుకొమ్మని పరమార్థము. ఏనుగులను రాజపూజితమైన గౌరవ ప్రతిష్ఠలకు, శుభాలకు, కార్యసిద్ధికి ప్రతీకలుగా పేర్కొంటారు. తామరపువ్వులో కూర్చుని ఇరుప్రక్కలా ఏనుగులతో ఉన్న లక్ష్మీదేవి అదృష్టమును, శుభములను కలిగిస్తుంది.

లక్ష్మీదేవిని గురు శుక్రవారాలలో ప్రత్యేకంగా పూజిస్తారు. శుక్రవారం రోజున లక్ష్మీదేవి సహస్రనామాలు చదివి ఉపవాసముంటారు. లక్ష్మీదేవి పూజల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఎక్కువ. ఇల్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే, ఆ ఇంటికి లక్ష్మీదేవి ఆకర్షితురాలవుతుందన్నది నమ్మకము. ఇంటిముందు వాకిట్లో గోమయముతో కళ్ళాపి జల్లి ముగ్గుపిండితో ముగ్గులు వేస్తారు. ముగ్గులు లక్ష్మీదేవిని ఆహ్వానించే దారులు. ముగ్గుపిండిలో ఉండే కాల్షియం క్రిమికీటకాదులను నాశనం చేస్తుంది. అందువలన రోగాలు దరిచేరవు. గడపలన్నంటికీ పసుపు కుంకుమ పెట్టి, ఇంటి లోగిళ్ళను ముగ్గులతో అలంకరించి, గుమ్మానికి తోరణాలు కట్టి లక్ష్మీదేవిని ఆకర్షించే అలంకరణలు చేస్తారు.

లక్ష్మీదేవి అనుగ్రహం కోసం అష్టలక్ష్ములను పూజిస్తారు. ఆదిలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, విజయలక్ష్మి, సంతానలక్ష్మి అనునవి అష్టలక్ష్ముల స్వరూపాలు. లక్ష్మీదేవిని షోడశోపచారములతో పూజిస్తారు. లక్ష్మీదేవి అర్చనలో ఉచ్చరించే పరమ శుద్ధ మంత్రాలు, శ్రీసూక్తం ఇవి అథర్వణ వేదములోని మంత్రాలు. ఋగ్వేదంలో కూడా దర్శనమిస్తాయి. ప్రతిదినం భక్తిశ్రద్ధలతో ఈ మంత్రాలను చదువుతూ అగ్నిలో ఆజ్యం వ్రేల్చి హారతులు ఇస్తే లక్ష్మీదేవి అనుగ్రహం సత్వరం కలుగుతుంది. తనను మనసారా పూజించేవారి ఇళ్ళలో అష్టైశ్వర్యాలు, సుఖసౌఖ్యాలు, అన్నవస్త్రాలు మున్నగునవి ప్రసాదిస్తుంది.

లక్ష్మీదేవి మానవులకు మంచి ఉపదేశమును ఇచ్చింది.

శ్లో ॥ "ధనమస్తీతి వాణిజ్యం కించిదస్తీతి కర్షణమ్
సేవాన కించిదస్తీతి భిక్షా నైవచ నైవచ"

మానవులారా! ధనము పుష్కలముగా ఉంటే వ్యాపారము చేయండి. ధనము స్వల్పముగా ఉంటే వ్యవసాయము చేయండి. ధనము లేకుంటే సేవ (ఉద్యోగము) చేయండి. కాని ఎప్పుడూ యాచన చేయకండి. 'ఉద్యోగినం పురుష సింహముపైతిలక్ష్మీః' అనగా ఉద్యోగ పరాయణుడైన వ్యక్తి దగ్గరే లక్ష్మి స్థిరముగా ఉంటుంది. వ్యాపారమైనా, వ్యవసాయమైనా లక్ష్మీదేవి అనుగ్రహమును వాంఛించువారు సత్ప్రవర్తన కలిగి, నియమబద్ధమైన జీవితమును గడపాలి. తమను తాము అదుపులో ఉంచుకోవాలి. దైవభక్తి కలిగి, మితవ్యయం, దానగుణం, పాపభీతి మున్నగువాటిని పాటించాలి. సంపద వలన మూడు రకాల మదములు కలుగుతాయి. అవి ధనమదము, విద్యామదము, కులమదము. ఈ మూడు మదములకు దూరముగా ఉండాలి.

మహాలక్ష్మీదేవి కరుణా కటాక్ష వీక్షణాలు, ఆ తల్లి అనుగ్రహం సదా సర్వదా శాశ్వతంగా కలగాలని ఆ తల్లిని వేడుకుందాము.

శ్లో ॥ "శుద్ధలక్ష్మి ర్మోక్షలక్ష్మి ర్జయలక్ష్మి సరస్వతీ
శ్రీర్లక్ష్మి ర్వరలక్ష్మి శ్చప్రసన్నా మమ సర్వదా"

శ్రీలక్ష్మియే శుద్ధ లక్ష్మి. ఆమెయే మోక్షలక్ష్మి. జయలక్ష్మియు ఆమెయే. ఆమెయే సరస్వతి. వరలక్ష్మి కూడా. అట్టి మహాలక్ష్మి సర్వదా నా యెడ ప్రసన్నురాలై యుండు గాక.



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు


**24వ భాగము**

## తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 24 వ భాగపు లీలల ప్రచురణ. (జులై 2009 నుండి మార్చి 2011).



నా మొదటి అమెరికా యాత్రలోని మిగిలిన అనుభూతులను తెలుపుచున్నాను.

### స్వామివారి కల నిజమగుట

తేది 12-07-2009 నాడు శ్రీమాన్ చక్రధర్ రెడ్డి అని మా సురేఖ నాల్గవ అన్న వెంబడి ఫిలడెల్ఫియా వెళ్ళాము. అక్కడి నుండి తేది 13-07-2009 నాడు నయాగరా వాటర్ ఫాల్స్ చూచుటకు వెళ్ళాము. మధ్యాహ్నం చేరుకున్నాము. ఆ నయాగరా ఫాల్స్ ను చూచి చాల ఆనందించాము. శ్రీమాన్ చక్రధర్ రెడ్డి మమ్ములను కారులో ఇక్కడకు తీసుకొచ్చి, చూపించాడు. ఒక పడవలో అందరము కలిసి ఈ వాటర్ ఫాల్స్ మధ్యకు వెళ్ళాము. నవ్వుచూ చాల ఆనందించాము. ఆ నీటి చినుకులు మాపై పడుచుండడం వలన పైగా వర్షము రావడము వలన ఒకరి వెనుక ఒకరము నవ్వుచు పరుగెత్తుచు ఆనందించాము. ఈ వాటర్ ఫాల్స్ చూచాక తిరిగి సిటీకి వెళ్ళి హోటల్ రూం తీసుకుని మా లగేజి, పాస్ పోర్టు పుస్తకములు అందులో పెట్టి తిరిగి సాయంత్రము మళ్ళీ ఈ వాటర్ ఫాల్స్ చూచుటకు కారులో వస్తున్నాము. కాని కొద్ది పొరపాటున దారి తప్పి ఈ వాటర్ ఫాల్స్ కు వచ్చే దారి బదులు పక్కనే ఉన్న కెనడాకు వెళ్ళే దారిలోని అమెరికా బార్డర్ లోనికి వెళ్ళాము. వెంటనే తప్పును గుర్తించాము. అయ్యో... తప్పు చేశాము. అవతల రోడ్డుపై వెళ్ళాల్సింది ఇక్కడికి వచ్చాము అని అనుకున్నాము. నేను వెనకకు త్రిప్పమన్నాను. కాని చక్రాధర్ ఇది తప్పు... అలా చేయరాదన్నాడు. ఆయన కారును ప్రక్కన ఆపి అక్కడి అమెరికా పోలీసులను కలిసి విషయము చెప్పాడు. వారు ఫరవాలేదు, కాని మీరు ఇక్కడ రివర్సు చేయలేరు, ముందుకు కెనడా బోర్డర్ కు పోయి లూప్ చేసి రండన్నారు. మావద్ద ప్రస్తుతము పాస్

పుస్తకములు లేవన్నా... ఫరవాలేదన్నారు. మేము అలాగే చేశాము. కెనడాకు వెళ్ళాము. కాని అక్కడి పోలీసులు వారి ఆఫీసుకు తీసుకెళ్ళి వివరాలు సేకరించి 30 నిమిషాలలో తిరిగి పంపారు, మేము తిరిగి అమెరికా బార్డరుకు వచ్చాము (ఈ రెండింటి మధ్య దూరము ఒక 200 గజాలు మాత్రమే). అప్పుడు ఇద్దరు అమెరికా పోలీసులు మమ్ములను ప్రశ్నించారు. చిత్రం ఏమిటంటే ఇది ఇంతకుముందు గేటు కాదు, ప్రక్క గేటు కొత్తవారు. మేము జరిగింది చెప్పాము. ఇంతలో అందులోని ఒకరు వారి మనుష్యులకు ఫోన్ చేశారు. వెంటనే పదిమంది పోలీసులు వచ్చారు. మమ్ములను బలవంతాన లోనికి తీసుకెళ్ళారు. ప్రశ్నించారు. చివరికి రాత్రి 11 గంటల వరకు విచారించి, మా ఫింగర్ ప్రింట్స్ తీసుకుని పంపించారు. సరిగ్గా స్వామివారు కలలో చూపినట్లు జరిగింది. ఇలా స్వామివారి కల నిజమైంది.

## త్రివిక్రమున్ని దర్శించుట

భారతదేశం కంటె అమెరికా ఎన్నో రెట్లు అందంగ ఆకర్షణీయంగ ఉంటుందనుటలో సందేహం లేదు. కాని నేను అమెరికా వెళ్ళిన తరువాత అక్కడి ఏ ఒక్క వ్యామోహానికి స్వామివారు గురికానివ్వలేదు. ఏదేని అత్యంత ఆహ్లాదకరమైనది, మనసు రంజింపచేయు విషయాలను చూచినప్పుడు నా మనస్సులో స్వామివారు ప్రవేశించి నేను మాత్రమే చూచు ప్రత్యేక లీలలను చూపేవారు, అక్కడి గొప్పతనాన్ని అంగీకరించనివ్వలేదు. ఇదే కాలములో స్వామి సేవకు దూరమైన కారణం చేత తపించి పోయాను, అక్కడి అందచందాలను ఆస్వాదించలేదు. ఇప్పుడు... ఇలాంటి మరో గొప్ప సంఘటన జరిగింది. ఒకరకంగ నేను అమెరికా వచ్చింది ఇందుకేనా... అనే అనుమానం కలిగింది. భవిష్యత్తులో నీవు దీనిని సాధించాలనే భావన కూడ నా మనస్సులో మారుమ్రోగింది. ఆ లీల ఈ విధంగా ఉంది.

తేది 21-07-2009 నాడు మేము అమెరికాలోని న్యూయార్కు నగరములో ఉన్నాము. నిన్న కూడ ఈ నగరములోని ఎన్నో వింతలను ఎత్తైన కట్టడములను చూచాము. కాని ఈరోజు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని చూచుటకు వెళ్ళాము. పడవలో కొంతదూరం ప్రయాణించి ఈ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని చేరుకున్నాము. మార్గమధ్యమున మాతోపాటు వచ్చిన యాత్రికులు ఈ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని ఎంతో పొగిడారు, తమ దేశానికి గొప్పదని గర్వపడ్డారు. కాని దీనిని దూరం నుండి చూడగనే నా మనస్సులో ఏవో తెలియని భావాలు నిండిపోయాయి. ప్రపంచములో అందరికంటే ఎత్తైనవాడు నా ప్రభు శ్రీవేంకటేశ్వరుడే, వీరినే నేను విశ్వంలో గొప్పవాడిగ చూడదలచాను. కాని ఆ దేశస్థుల మాటలను నమ్మలేదు. వెంటనే నా కళ్ళలో త్రివిక్రముడు కనిపించి ఈ క్రింది ప్రత్యేక లీలను చూపాడు.



నాకు కనబడిన త్రివిక్రముడు

లీల : శ్రీవేంకటేశ్వరుడు త్రివిక్రముడుగ అత్యంత భారీ ఎత్తున కంచిలోని ఆకాశ పెరుమాల్ మాదిరిగ నల్లని ఆకారంతో భ యం క ర ము గ కనబడ్డారు. తన రెండు చేతులను చాపుచు, తన కుడికాలును దూరంగా చాపాడు. ఆ పాదమును బ్రహ్మ తన కమండలములోని నీటిచే కడుగుతున్నాడు. త్రివిక్రముడు తన ఎడమ కాలుపై నిలుచున్నాడు. మహా ఎత్తైన వాడు, ఆకాశమునకు అంటుచున్నట్లున్నాడు. ఎలాగైన నేను ఈ స్టాచ్యూ ఫ్ లిబర్టీ కంటె ఎత్తైన త్రివిక్రముని విగ్రహమును ఇండియాలో ఏర్పాటు చేయాలనిపించింది. నా స్వామివారినే గొప్ప అని ప్రపంచములోని అందరూ కీర్తించేటట్లు చేయాలనిపించింది. నేను అప్పుడు పేరుకు అక్కడ ఉన్నానే కాని నా మనస్సంతా త్రివిక్రమునిచే నిండిపోయింది. నాకు ఎక్కడ చూచినా ఆయనే కనబడ్డాడు. నా మనస్సులో ముద్రించుకుపోయాడు. ఆయన గంభీరము నన్ను ముగ్ధున్ని చేసింది. ఏమి చేయాలో తెలియలేదు. ఎందుకైన మంచిదని ఆ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ ఫొటోస్ ను మరియు దానిని ఎలా తయారు చేశారు అనే విషయమును క్షుణ్ణంగ గమనించాను. దీని నిర్మాణానికి సంబంధించిన ఒక పుస్తకమును కొన్నాను. ఆ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ మొత్తం స్టీల్ స్ట్రక్చర్ తో తయారు చేసి పైనుండి 2.5 మి.మీ మందము కలిగిన రాగి రేకులతో మలచారు. లోనుండి ఒక లిఫ్టును కూడ అమర్చారు. నేను ఈ నిర్మాణానికి సం బంధించిన చాల విషయాలు సేకరించాను. తరువాత ఈ ప్రాంతము వదిలి వెళ్ళిపోయాము. కాని మూడు రోజుల వరకు రాత్రి పగలు నాకు ఆ త్రివిక్రముడే కనబడసాగారు. నేను ఏది చూచినా, ఏది చేసినా స్వామివారే కళ్ళలో మెదిలారు. నా మనస్సంతా నిండిపోయాడు. అసలు రాత్రుళ్ళు నిద్ర రావడం లేదు. మొత్తం త్రివిక్రమున్నే చూస్తున్నాను. నా కర్తవ్యము గుర్తుకొస్తున్నది. నన్ను స్వామివారు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ కంటే ఎత్తైన వాడిగ నిర్మించుమని ఆజ్ఞ ఇచ్చారా...? తెలియదు. కాని బాధతో నిండియున్నాను. తయారుచేసే విధానం దానిని చూచి కొంతవరకు తెలుసుకున్నాను. తరువాత మూడు నాలుగు రోజులకు ప్రపంచములో ఎత్తైన విగ్రహములు ఏవని చూచాను. అప్పుడు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ 17వ స్థానములో 147 అడుగుల ఎత్తు ఉన్నది. అంటే నేను 150 అడుగుల త్రివిక్రమున్ని చేయాలనిపించింది. ప్రపంచములో 445 అడుగుల బుద్ధుని

విగ్రహము ఎత్తైనదిగ ఉన్నది. నా స్వామిని దీనికంటె కూడ ఎత్తైనదిగ చేయాలనిపించింది.

ఈ విగ్రహము ముందు కొద్ది దూరములో శ్రీవేంకటేశ్వరుడే త్రివిక్రముడు అని తెలిపేందుకు, తిరుమల మోడల్ ఆలయాన్ని నిర్మించాలనే భావన కలిగింది. ఈ మొత్తంను ముందునుండి చూస్తే, మొదట శ్రీవేంకటేశ్వరుని ఆలయం కనబడుతుంది. దీని వెనుక భారీ స్థాయి త్రివిక్రముడు నిలుచునట్లు కనబడుతుంది. భక్తులు చూచుటకు వీలుగ గుడికి త్రివిక్రముడికి మధ్యన కొంత స్థలము ఉండవలెననిపించింది. కాని దీనిని ఎక్కడ నిర్మించాలి? ఏ ప్రాంతము సరిపోతుంది? అని ఆలోచించాను. గుట్టల ప్రాంతమైతే బాగుండుననిపించింది. త్రివిక్రముడు తన కుడిపాదమును ఎత్తినప్పుడు ఆ కాలు కొద్ది దూరంలో ఉన్న మరొ చిన్న గుట్టపై వరకు వెళ్ళాలి. అక్కడ బ్రహ్మ ఈ కాలును కడుగుచుండాలి. ఇక ఇంత పెద్ద భారీ సైజు గల త్రివిక్రముడిని ఏవిధంగ స్ట్రక్చరల్ సపోర్టు ఇవ్వాలని రకరకాలుగ వ్రాసుకున్నాను. ఈవిధంగ దీనిని ఎలా చేయాలని ఆలోచిస్తూ ఉన్నాను. ఇండియా వచ్చాక కూడ ఈ ఆలోచన నన్ను వదలలేదు.

అసలు చెప్పాలంటే నేను అమెరికా పోవుటకు దాదాపు 45 రోజుల ముందు నుండి నా మనస్సులో త్రివిక్రముడు మెదులుట ప్రారంభించాడు. కాని నేను పట్టించుకోలేదు. దీనికి ఒకరోజు ముందు అంటే తేది 20-07-2009 నాడు కూడ న్యూయార్కులోని సముద్రములో పడవ ప్రయాణం చేశాము. అప్పుడు ఈ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ ముందు నుండి పోయాము. మా బావమరిది శ్రీమాన్ చక్రధర్ రెడ్డి ఈ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ గురించి భారీగ, అమెరికాకు గర్వకారణంగ చెప్పాడు. అప్పుడు కూడ నా మనస్సు అంగీకరించలేదు మరియు నేను కూడ నా ప్రభువు త్రివిక్రముడిని ఈ విధముగ ప్రపంచములోని అందరు చూచేవిధంగ చేయాలనిపించింది. వెంటనే ఆ సముద్రములో కొద్ది దూరములో త్రివిక్రముడి కాలు, తుంటి నుండి పాదము వరకు ఏటవాలుగ కనబడ్డది. ఆకాశాన్నంటె ఎత్తున్న ఆ కాలు సముద్రపు నీటిని తాకుచు, మేము ఎలా పడవలో ప్రయాణించామో అది కూడ మాతో పాటు ప్రయాణించింది. పరవశించిపోయాను. ఇంతటి భారీ సైజులో త్రివిక్రముడిని నిర్మించాలని దానిని ప్రపంచములోని ప్రజలు చూచి ఆనందించాలని, దాన్ని చూచి నేను గర్వపడాలనిపించింది. కాని తేది 21-07-2009 నాడు ఈ స్టాచ్యూ వద్దకు వచ్చినప్పుడు నా మనస్సు మనస్సులో లేకపోయింది. ఈ మోడల్ గ కట్టాలనే ఒక భావన ఏర్పడింది. ఒక పాఠము చెప్పినట్లు అనిపించింది. ఈ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని ఆధారంగ చేసుకొని, ఏవిధంగ కట్టారో చూచి, లోటుపాట్లు సరిచేసి నేను కట్టుబోవు విగ్రహాన్ని కట్టుమని బోధించినట్లనిపించింది. ఇది నా బాధ్యతగ గుర్తుపెట్టుకొమ్మనట్లు భావించాను. నేను ఈ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వద్ద ఒక 4-5 గంటల సమయము, కేవలం దీనిని ఎలా తయారు చేయాలి, ఏ పదార్థాలను వాడారు, పెడస్టల్ ఎంత ఎత్తు, ఎన్ని మెట్లున్నవి, జీవితకాలము ఎంత, రక్షణ వ్యవస్థ మొదలగు కోణాలలో పరిశీలించాను. ఈ మొత్తము ట్రిప్పు నాకు ఒక పాఠము చెప్పుటకు, జ్ఞానబోధ చేయుటకన్నట్లు సాగింది. నా స్వామిని దీనిని సాధించుటకు కావలసిన శక్తిని ఇవ్వమని వేడుకున్నాను.

## అమ్మవారి అనుగ్రహం

ఇంతవరకు అమెరికాలో నేను స్వామివారి లీలలనే చూచాను. ఇప్పుడు అమ్మవారు కూడ ఒక లీలను చూపి మాతృప్రేమను నింపారు. అమెరికా వెళ్ళిన తరువాత అక్కడి వింతలు, వినోదాలు ఎన్నో చూచినప్పటికి నేను తృప్తి చెందలేదు. స్వామివారిని చూడాలని వారి సేవను తిరిగి పొందాలని ఆరాటపడ్డాను, స్వామికోసం తపించిపోయాను. బహుశా నా ఈ మానసిక క్షోభను గ్రహించిన మహాలక్ష్మీ మాత ఈవిధంగ అనుగ్రహించారు.

**తేది 26-07-2009 కల :** ఈ కలలో నేను మా ఊరిలో ఉన్న చిన్నమ్మ వరుసయ్యే 'ఎంకమ్మ' అనే వ్యక్తిని చూచాను. ఈమె ఊరిలో మా పాలోళ్ళు, చిన్నమ్మ అవుతుంది. పైగ మా తల్లి గారికి చెల్లెలవుతుంది. చిన్నప్పుడు నా ఆలన పాలన చూచిన వ్యక్తి. ఈమె ప్రస్తుతము తన వయస్సు కంటె 20 సం॥లు చిన్నదానిగ అదే ముఖచ్ఛాయలో కనబడ్డది. అమెరికాలోని ఒక పెద్ద స్కూలు, అందులోని చిన్న పిల్లలను ఆడించుటకు ఆయ లాగ అక్కడ ఉన్నది. చూచుటకు కనీసం ఒక సం॥ము ముందే అమెరికా వచ్చినట్లు ఆమె ముఖచ్ఛాయలు కనబడ్డవి. ఆమె శరీరచ్ఛాయ, రంగు, వేషధారణ, అమెరికాలో నివాసమునట్లే ఉన్నది. ఆమె నన్ను చూచి నాతో మాట్లాడింది. ఎప్పుడొచ్చావూ...? ఎక్కడున్నావూ... అని అడిగింది. నేను ఏదో చెప్పాను. నన్ను తన బిడ్డ లాగ పుత్ర వాత్సల్యముతో చూచింది. తన వద్ద దాదాపు 15-20 మంది చిన్నపిల్లలు ఉన్నారు. వారిని చూచుకుంటుంది. తరువాత కల చెదిరింది.

ఈ విధంగ శ్రీమహాలక్ష్మి అమ్మవారు కనబడి పుత్ర వాత్సల్యాన్ని చూపెట్టారు.

మేము ఇమ్మిగ్రేషన్ (గ్రీన్ కార్డు) వీసా పైన అమెరికా పోయాము. కొద్ది రోజులలనే గ్రీన్ కార్డు వస్తదని నమ్మి 45 రోజులకు రిటర్న్ టికెట్ బుక్ చేసుకున్నాము. అనుకున్నట్లే అందరికి గ్రీన్ కార్డు వచ్చింది కాని నాకు మాత్రం రాలేదు. అందుకని మావాళ్ళు తేది 08-08-2009 నాడు ఇండియాకు తిరిగి వచ్చారు, కాని నేను మాత్రం మరో 15 రోజులు అమెరికాలోనే ఉండవలసి వచ్చింది.

## పరిస్థితులను పోల్చుట

ఒక సందర్భములో ఇండియాలోని పరిస్థితులను, ఇక్కడి మనుష్యుల స్థితిగతులను అమెరికా వారితో పోల్చుచు లీలను చూపెట్టారు. ఆ లీల ఈవిధంగ ఉంది.

**తేది 06-08-2009 కల :** ఈ కలలో నేను ఒకరితో ఇలా మాట్లాడుచున్నాను. ''ఇండియాలోని వారు చాల బీదతనముతో, బాధాకరమైన పరిస్థితులలో ఉందురు. కొంచెము దుమ్ముతో కూడిన వాతావరణము ఉండును. మనము అక్కడ ఉన్నప్పుడు ఆ పరిస్థితి అర్థం కాదు. కాని అమెరికాలోనికి వచ్చిన తరువాత బాగ అర్థమవుతాయి'' అని నేను అమెరికాలో ఒకరితో చెప్పుచున్నాను. కల చెదిరింది.


ఇదే రోజు రాత్రి టీవీలో నేను ఒక ప్రోగ్రామును చూచాను. అప్పుడు నేను డల్లాస్ నగరంలో మా బావమరిది శ్రీమాన్ చక్రధర్ రెడ్డి ఇంట్లో ఉన్నాను. ఆ ప్రోగ్రాములో ఇండియాలోని విశేషములను చూచాను. నిజంగా నేను కలలో ఒకాయనతో చెప్పినట్లుగా అదే పరిస్థితులు, అదే వాతావరణంతో అంటే దుమ్ముతో కూడిన బీదతనముతో, బాధాకరమైన పరిస్థితులతో చూపించారు. అప్పుడు నా కల గుర్తుకొచ్చింది.

అమెరికా కంటె ఇండియాలో దుమ్ము, బీదతనము ఉన్నప్పటికి నాకు ఇండియా జీవితమే బాగ నచ్చింది. ముఖ్యంగా ఇక్కడ స్వామి ప్రభావము జీవులను ధన్యులను చేయగలదని భావించాను. గ్రీన్ కార్డు వచ్చింది కాబట్టి తలచుకుంటె అమెరికాలో స్థిరనివాసం ఏర్పరచుకోవచ్చు, కాని అలా చేయలేదు.

## ఆత్మీయ భక్తుడుగ చెప్పుట

గత పది సం॥ల నుండి తిరుమల శ్రీవేంకటేశ్వరుని దివ్యమైన అనుగ్రహాలను ఎన్నో పొందాను. ఈ అనుగ్రహాలను పరిశీలించినట్లైతే, నేను స్వామివారికై ఎంత తపించిపోవుదునో, దానికి అనుగుణంగ, అదే స్థాయిలో అనుగ్రహిస్తారు. ఇప్పుడు నేను స్వామి సేవను, ముఖ్యంగ రథయాత్రను జప సమర్పణ సేవను వదిలి వచ్చాను. కాబట్టి చాల దుఃఖించాను. స్వామివారికై తపించిపోయాను. ఎంత ప్రయత్నించినప్పటికి స్వామివారిని చూడలేకపోయాను. ఒకానొక సందర్భంలో స్వామివారిని చూడనందులకు, ఈ పరిస్థితులకు కారణం స్వామివారేనని భావించి ఆయనపై చిరుకోపంతో దుఃఖించాను. దీనినంతటిని గమనించిన స్వామివారు నన్ను పరమానందభరితుణ్ణి చేశాడు. నన్ను తన ''ఆత్మీయ భక్తుడని'' కొనియాడాడు. నేను చేసే సేవలను, సభలను మెచ్చుకున్నాడు. మొత్తం మీద నన్ను తనవాడుగా మరోసారి పేర్కొనుట నన్ను ఆనందంలో ముంచింది. ఆ లీల ఈ విధంగ ఉంది.

నేను ఇండియాలో స్వామివారి సేవను వదిలి తేది 28-06-2009 నాడు అమెరికా వెళ్ళాను. వెళ్ళేటప్పుడు స్వామి సేవకు ఆటంకము కలుగకుండునట్లు రెండు మాసములకు సరిపడు అరేంజిమెంట్సు చేసి వెళ్ళాను. స్వామివారిని అనుమతించుమని ప్రార్థించాను. కాని అనుమతించినట్లు అనిపించలేదు. మీరు సృష్టించిన లోకమును చూడాలనే కోరికతో అమెరికాకు పోవుచున్నానని చెప్పి వెళ్ళాను. కాని అమెరికాకు పోయాక నా స్వామికి దూరమయ్యానని బాధపడ్డాను. తప్పు క్షమించమని, స్వామివారిని కనబడమని పలుమార్లు వేడుకున్నాను. కాని స్వామినుండి ఏలాంటి జవాబు రాలేదు. తేది 14-08-2009 నాడు గోకులాష్టమి పండుగ ఉన్నది. ప్రతి గోకులాష్టమికి నేను హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర నిర్వహించి, తిరుపతిలో 7 కోట్ల జప సమర్పణ చేసేవారిమి. ఈ రథయాత్రలో స్వామివారిని ఎన్నో ప్రాంతాలకు తీసుకువెళ్ళుట, ఎన్నో సభలను, సమావేశాలను ఏర్పాటు చేయుట, అందులో భజనలను, పాటలను, కోలాటం లాంటి ఆటలను ఏర్పాటు చేసి భక్తులతో పాటు స్వామివారిని కూడ ఆనందింప చేస్తుండేవారిమి. మొత్తం ఈ కార్యక్రమం ఎంతో ఆనందంగా జరుగుతుంది. కాని ఈ సం॥ము మా అమ్మ చనిపోవుట వలన జప సమర్పణ ఆపి అమెరికా వచ్చాము. అమెరికా వెళ్ళానే కాని నా మనసంతా స్వామిపైననే ఉన్నది. ఇక్కడి వాతావరణం వేరు ఇండియాది వేరు. నేను ఇక్కడికి వచ్చి ఇప్పటికి 40 రోజులైతుంది. ఈ కాలంలో కేవలం రెండుసార్లే ఆలయంకు వెళ్ళి స్వామిని దర్శించుకున్నాను. వచ్చే గోకులాష్టమికి స్వామిసేవకు, స్వామికి దూరమైతున్నానని బాధ కలిగింది. ఎన్నోసార్లు స్వామిని క్షమించమని కనబడుమని వేడుకున్నాను. కాని అలా జరుగలేదు. ఎలాగైన వచ్చే గోకులాష్టమికి కనీసం స్వామివారి గుడికి తప్పక వెళ్ళాలనిపించింది. కాని వెళ్ళలేను. నా వద్ద కారు లేదు, డ్రైవింగ్ రాదు. అప్పుడు నేను డల్లాస్ నగరంలో చక్రధర్ రెడ్డి ఇంట్లో ఉన్నాను. మా చక్రధర్ ను ఆలయానికి తీసుకుపొమ్మని ఎన్నోసార్లు అడిగాను. ఆయన సరే అనుచు కాలయాపన చేశాడు. రేపు మాపు అన్నాడు. రోజు ఏదో పనివల్ల వాయిదా వేశాడు. ఇలా ఒక నాలుగు రోజులు గడిచింది. చివరికి తేది 10-08-2009 నాడు తీసుకువెళుతానన్నాడు. ఆ సాయంత్రం నేను తయారైనప్పటికి తనకు పని ఉన్నదని మానుకున్నాడు. నాకు చాల బాధ కలిగింది. నా స్వామి నాకు దూరమయ్యాడని భావించాను. ఆయనకు నాపై ప్రేమ లేదనుకున్నాను. నన్ను దండిస్తున్నాడనుకున్నాను. హే వేంకటేశ్వరా! అని బాధపడ్డాను. శ్రీ ఆంజనేయున్ని స్మరించాను. నన్ను రక్షించమని వేడుకుని, నా స్వామివద్దకు తీసుక పొమ్మన్నాను. మొత్తం మీద స్వామివారే నాకు తన దర్శన భాగ్యాన్ని ఇవ్వటం లేదని భావించి ఆయనపై చిరుకోపంతో ఆ రాత్రి పడుకున్నాను. శక్తిహీనున్ని చివరికి మీరే




నన్ను తన ఆత్మీయ భక్తుడు గా చెప్పుట

రక్ష అని నిద్రపోయాను. తెల్లవారు జామున వచ్చిందీ అద్భుతమైన కల.

**తేది 11-08-2009 కల :** ఈ కలలో నేను ఒక సభను చూచాను. అది శ్రీమన్నారాయణున్ని కొలుచు సభ. రాబోవు ఒకానొక ఉత్సవమును నిర్వహించుటకు గాను సేవకులకు విధి విధానాలను తెలుపుటకని బహుశా ఈ సభ ఏర్పాటు చేయబడ్డది. ఆ సభలో శ్రీశ్రీశ్రీ చిన్నజీయరు స్వామివారిని చూచాను. వారు తిరునామంతో చేతిలో త్రిదండంతో చక్కని వస్త్రధారణతో ఆ సభకు వచ్చారు. ఆయన చుట్టు చాలమంది శిష్యులు ఉన్నారు. సభలో చాలమంది భక్తులు కూర్చున్నారు. ఇంతలో వేదిక వద్దనున్న స్వామివారు తన ఒక శిష్యున్ని పిలిచారు. ఆయనతో ఇలా చెప్పారు. ''నాకు ఆత్మీయుడైన ఒక భక్తుడు రావటం లేదు, కనబడుట లేదు, ఆయనకు నాపై కోపమొచ్చింది'' అని నవ్వుచు అన్నాడు. మరియు ''ఆయన చక్కగా సభలను నిర్వహిస్తాడు, పాటలను పాడిస్తాడు, కాని ఇప్పుడు నాపై కోపముతో ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఎక్కడున్నాడో తెలియదు నీవు ఆయనను ఎక్కడున్న వెతికి నా వద్దకు తీసుక రమ్మని'' ఆదేశించాడు. రేపు జరిగే సభకు ఎట్లైన తీసుకరమ్మని ఆదేశించాడు. కల చెదిరింది.

ఈ కలను పొందగానే నాకు స్వామివారిపై ప్రేమ మరింత పెరిగింది. నన్నుతనఆత్మీయభక్తుడన్నందులకుమురిసిపోయాను. స్వామివారు ప్రసాదించిన ఆణిముత్యాలలో ఇది ఒకటిగా భావించుకున్నాను. నాకోసం ఆయన చూస్తున్నాడనిపించింది. చూద్దాం... ఈరోజు ఏమైతుందో అని అనుకున్నాను. కాని తెల్లవారు అంటే తేది 12-08-2009 నాడు సాయంత్రం నేను అడుగక ముందే మా చక్రధర్ నన్ను హరేరామ హరేకృష్ణ మఠంకు తీసుకపోయాడు. నేను ఆ మఠంలోనికి వెళ్ళగనే... నా స్వామివారి ఇంటికి వెళ్ళినంత ఆనందించాను. మేము లోనికి వెళ్ళినప్పుడు శ్రీకృష్ణునికి పరదా అడ్డం వేసి నివేదన చేస్తున్నారు. కాబట్టి ఆయనకు ఒక దండం పెట్టి ప్రక్క హాలుకు వెళ్ళాను. ఆ సమయాన జై గోవింద అనే అక్కడి ఒక భక్తురాలు తిరునామం ధరించి నాకు ఎదురుగ వస్తున్నది. ఆమెతో నేను ఇండియా నుండి వచ్చానని చెప్పాను. ఇక్కడ రెండు రోజులు ఉండుటకు వీలైతుందా? అని అడిగాను. నేను ప్రస్తుతమున్న స్థలము నుండి ఇక్కడకు రావడం కష్టంగ ఉన్నదని చెప్పాను. నేను ఆమెతో మాట్లాడుచున్నప్పుడు నేను నా స్వామి సేవను మిస్సవుచున్నానని బోరున ఏడ్చాను. దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. దీనిని చూచిన గోవిందగారు నన్ను ఊరడించారు. మీరు ఇక్కడ రేపు గోకులాష్టమి నాడు పాల్గొనవచ్చునని అన్నారు. తన ఇంటికి ఆహ్వానించారు, ఈ దృశ్యమును అక్కడి ఇద్దరు ముగ్గురు భక్తులు చూచారు. వారు నన్ను స్వామివారి మహాభక్తునిగ పరిగణించి గౌరవమిచ్చారు. నిజానికి నాకు ఇక్కడికి వచ్చినందుకు మహా ఆనందముతో ఆనంద బాష్పాలు రాలాయి. వీటిని తట్టుకోలేక బోరున విలపించాను. ఇంతలో అప్పుడే వచ్చిన మా చక్రధర్ రెడ్డి దీనిని చూచి బాధపడ్డాడు.

తరువాత తేది 14-08-2009 నాడు ఉదయం 7 గంIIలకే నన్ను హరే రామ హరే కృష్ణ మఠంలో దింపాడు. నేను ఆ రోజంతా మందిరములోనే భజనలతో, పాటలతో, భక్తుల కోలాహలము మధ్యన స్వామి చెంతన గడిపాను. చివరికి రాత్రి 10 గంటలకు ప్రసాదము సేవించి ఇంటికి పోయాను. ఈ విధంగా స్వామివారు నన్ను తన దగ్గరికి రప్పించుకున్నారు. గోకులాష్టమి నాడు నేను అమెరికాలో ఉన్నప్పటికి స్వామి సభలకు ఆయన వద్దకు వెళ్ళాను. ఇది శ్రీవేంకటేశ్వరుని అపార కృపా విశేషం చేతనే సాధ్యపడింది.

## రథయాత్ర లాంటి స్వామివారి సభలలో అన్న సంతర్పణలను ఏర్పాటు చేయమనుట

అమెరికాలో మరో ముఖ్య విషయాన్ని స్వామివారు చెప్పారు. మేము ప్రతి సంవత్సరం రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని హబ్సిగూడ లోని మా ఇంటిలో ఎంతో ఘనంగ నిర్వహిస్తాము. పూజలు, క్రతువు సమర్పించుట, అన్నమయ్య కీర్తనలు, పెద్దల ప్రవచనములు ఇలా ఎన్నో విషయాలు ఉండుట వలన చాలమంది భక్తులు వస్తుంటారు. ఇది సాయంత్రం 6 నుండి 10 వరకు జరుగుతుంది. కాని చివరికి మేము భక్తులకు




మా ఫంక్షన్ కొరకు మర్యాదగా పిలువమని, అన్నసంతర్పణ చేయుమని చెప్పుట

కేవలం కొద్దిపాటి ప్రసాదమును పెట్టి పంపేవారిమి. వారికి కడుపునిండా భోజనము పెట్టాలన్న ఆలోచన మాకు ఇంతవరకు రాలేదు. ఇప్పుడు స్వామివారు ఈ కార్యక్రమములో భక్తులకు కడుపునిండా భోజనాలను ఏర్పాటు చేయమని చెప్పారు. ఆ లీల ఈవిధంగ ఉంది.

నేను ఇండియాకు తిరిగి వచ్చుటకు తేది 19-08-2009 నాటికి టికెట్ బుక్ చేసుకున్నాను. మా తల్లికి సంవత్సరీకము, స్వామివారికి రథయాత్ర మరియు జపసమర్పణ కార్యక్రమములు ఉన్నవి కాబట్టి తొందరగ ఇండియాకు రావలెనని భావించాను. ఈసారి కార్తీక మాసంలో జపసమర్పణ చేయాలని అనుకున్నాము. మరియు ఈసారి నుండి రథయాత్ర ప్రారంభోత్సవ సభలో అన్న సంతర్పణలను కూడ చేయాలని నిర్ణయించుకున్నాము. ఈ సంవత్సరము రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమములో స్వామివారి కళ్యాణమును కూడ చేయాలని భావించాను. ఇదే విషయాన్ని స్వామివారు నాకు కలలో ఆదేశించారు.

తేది 17-08-2009 కల : మా ఇల్లు కొండలలో గుట్టలలో ఉన్నదట. తిరుమల ఆలయాన్ని టీవీలో చూపునప్పుడు ముందు మొత్తం కొండలను చూపుతారు. ఆ కొండల మధ్యన శ్రీవారి ఆలయాన్ని చూపుతారు. అలాంటి కొండలనే నేను ఈ కలలో దర్శించాను. ఎన్నో కొండలు, దాదాపు ఒక 20 వరకు గుట్టలు గుట్టలుగ ఉన్నవి. ఆ గుట్టలలో ఒక గుట్ట నుండి వేరే గుట్టకు పోవుటకు పిల్లదారులు ఉన్నవి. మా ఇల్లు ఆ గుట్టలలో ఒక గుట్టపైన ఉన్నదట. మా ఇంటిలో స్వామివారి ఉత్సవమొకటి జరుగునట. దీనికై నాకు తెలిసిన వారిని ఆహ్వానించాను. ఆ సభకు గాయకులు, అతిథులు తెల్లని వస్త్రములు, పూజా దుస్తులు ధరించి వస్తారట. ముందు ఎక్స్ ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు వచ్చారు. వీరు తెల్లని ధోవతి లాల్చి ధరించి వచ్చారు. నేను ఆయనకు నమస్కరించాను, తరువాత ఆయన నాతో ఏదో మాట్లాడారు. ఈయన ఈ పూజకు సంబంధించిన విషయాలనే మాట్లాడారు. ఈ సభకు భక్తులు ఎవ్వరూ మా ఇంటికి రావడం లేదు. ఇంతలో తెల్లని ధోతి, లాల్చి ధరించి తెలిసిన ఒక వ్యక్తి దూరంగ ఉన్న గుట్టపైన కనబడ్డాడు. ఆయన నిజానికి మా పూజకి బయలుదేరాడు. కాని నేరుగ మా ఇంటికి రాకుండా అక్కడక్కడ మసలుచున్నాడు. పిల్లదారులలో తిరుగుచున్నాడు. నేను ఆయనను చూడగనే... ఓ... వేంకటస్వామి... అని గొంతెత్తి గట్టిగ ఆయనకు వినిపించే విధంగ పిలిచాను. ఇటు రా... ఇటు రా... అని గట్టిగ పిలిచాను. ఆయన నా మాటలకు వచ్చెదను... ఆహారమును సమకూర్చుకుని వచ్చెదనన్నాడు. ఆయన ఆ

పూటకు ఆహారమును సమకూర్చుకొనుటలో ఉన్నాడు. దీనిని చూచిన శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు చూచావా... మీరు అందరిని ఆదరణతో, మర్యాదగ పిలవాలి. వారు మీ వద్దకు రావడము లేదు, భోజనము ఏర్పాట్లు చేయాలి... అని అన్నారు. నేను అలాగే అని అన్నాను. కల చెదిరింది.

ఈ కలలో మా ఇంటికి ఎవ్వరూ రావడం లేదు కాబట్టి ఈ విధముగ స్వామివారి సభలు జరుగునప్పుడు భక్తులను మర్యాదగ పిలువమని, వచ్చిన వారికి భోజనాలను ఏర్పాటు చేయమని ఆజ్ఞాపించారు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. స్వామివారు సూచించినట్లు ఈ సం॥ము నుండి ప్రతి రథయాత్రకు భోజనాలను ఏర్పాటు చేశాము.

ఇక తెల్లబట్టలు వేసుకుని కొండలలో తిరిగిన వ్యక్తి ఎవ్వరో కాదు... సాక్షాత్ టి.టి.డి క్రొత్త ఈ.ఓ శ్రీమాన్ ఐ.వి.ఆర్. కృష్ణారావు గారు. వీరు ఈమధ్యనే ఈ.ఓగా వచ్చారు.

నాకు, నా భార్యకు, ఇద్దరు పుత్రులకు అమెరికాలో గ్రీన్ కార్డు వచ్చింది. దీనిని కాపాడుకొనుటకు మేము ఇప్పటినుండి ప్రతి సం॥ము అమెరికాకు వెళ్ళాల్సిన అవసరము ఏర్పడ్డది. ఇంతటితో నా మొదటి అమెరికా యాత్రలో నేను పొందిన అనుభూతులు పూర్తైనవి.

## అనుభూతులు నానిపోయాయి

మా ఆఫీస్ వి.ఎస్.టి రోడ్, విద్యానగర్, నాగమయ్యకుంట మేన్ రోడ్డులో ఉండేది. సం॥ 2007 మరియు సం॥ 2009 ప్రాంతములో వచ్చిన వరదలకు మూసీనది పొంగిన కారణంగా మా ఆఫీసు మూడు రోజులు నీటిలో మునిగిపోయింది. ఫలితంగ అనుభూతులు నానిపోయాయి. ఉన్నవాటిని జాగ్రత్తగ భద్రపరచుకున్నాను. జిరాక్స్ తీసి ఇంటిలో కూడ ఒక కాపీని పెట్టుకున్నాను.

## అనుభూతుల పుస్తకములు లభించలేదు

తేది 18-08-2009 నుండి తేది 24-03-2011 వరకు పొందిన అనుభూతులను వ్రాసిన మూడవ పుస్తకములో కొంత భాగము మరియు పూర్తి నాల్గవ పుస్తకము లభించలేదు. కాని ఆ సమయంలో జరిగిన ఎనిమిది లీలలు గుర్తున్నవి. వాటిని విపులంగ తెలుపలేకపోయినా క్లుప్తంగ సారాంశము తెలుపుచున్నాను.

నేను అమెరికా నుండి రాగానే మా అమ్మకు సంవత్సరీకమును పూర్తిచేశాను. ఆ తరువాత ఏడవ జప సమర్పణకై ఏర్పాట్లు చేశాను. తిరుపతికి వెళ్ళి ఈ.ఓ శ్రీమాన్ కృష్ణారావు గారిని జప సమర్పణకు ఆహ్వానించాను. తిరుపతిలో 7వ జపసమర్పణ నిమిత్తమని శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారిని తిరుపతికి ఆహ్వానించగ వారు ఒప్పుకున్నారు. ఇక హైదరాబాద్ లో రథయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగ శ్రీవేంకటేశ్వర కళ్యాణంను శ్రీశ్రీశ్రీ అహోబిల జీయరు స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించాము. స్వామివారు సూచించినట్లు అన్న సంతర్పణ చేశాము.

## 'నమో వేంకటేశాయ' రథం లాగ ఆదిశేషుని దర్శించుట

ప్రతి సం॥ జప సమర్పణకు టి.టి.డి ఈ.ఓ గారి నుండి అనుమతి కోరుతాము. ప్రతి పర్యాయము ఇది గోకులాష్టమి నాడు చేస్తాము కావున టిటిడి డైరీ ఫారం వారు, వారి గోకులాష్టమి కార్యక్రమాలలో దీనిని కూడ కలిపి అనుమతిని పొందుతారు. ఈసారి గోకులాష్టమి నాడు చేయలేదు కాబట్టి ఈ అనుమతి ఎప్పుడు లభిస్తుందో యని బెంగ పెట్టుకున్నాను. దీనికై స్వామివారిని అత్యంత ఆత్రుతతో పలుమార్లు ప్రార్థించాను. చివరికి అనుమతి లభించిందని రథయాత్ర మొదలు పెట్టండని స్వామివారు ఒక ప్రత్యేక లీలను ఈవిధంగ చూపారు.

నమో వేంకటేశాయ రథాన్ని మేము ఆదిశేషునితో పోల్చుతాము. ఈ కలలో ఆదిశేషుడు తన విశ్వరూపాన్ని చూపెట్టినట్లు చూపాడు. ఈ లీలను చూచి తరించాల్సిందే తప్ప వర్ణించలేను. అద్భుతమైన లీల. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం లాంటిది.

కల : ఈ కలలో దాదాపు ఒక పది పెద్దసైజు నాగుపాములను చూచాను. ప్రతి పాము దాదాపు ఒక అడుగు లావు కలిగి 50 అడుగుల పొడవు ఉంటుంది. అన్ని పాములు దాదాపు 10 అడుగుల వాటి పొట్ట భాగము అతుక్కొని ఉన్నాయి. ఇక 20 అడుగుల వాటి తల భాగము మరియు 20 అడుగుల తోక భాగము స్వతంత్రంగ ఉన్నాయి. అంటే అవి ఇతర పాములతో సంబంధం లేకుండ స్వతంత్రంగ తోకను, తలను ఆడించగలవు. పొట్ట భాగము మాత్రము ఒకటే. మరోరకంగ చెప్పాలంటే ఒకే పొట్ట కలిగి 10 తలలతో, 10 తోకలతో ఆ పాము ఉన్నది. ఒక్కొక్క పాము ఎంత బలమైనదంటే ఒక వ్యక్తిని చుట్టుకొని అతి సులభంగ పైకి ఎత్తగలదు. ఈ పాములు రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. ఒక సందర్భంలో అన్ని పాములు కలిసి బంతిలాగ చుట్టుకపోయాయి. ఏది తల, ఏది తోక గుర్తించడం కష్టం అనే విధంగ మారిపోయాయి. ఆ పాముల బంతి చుట్టు తోకలు, తలలు కనబడుతున్నాయి. ఇంతలో నాలుగు ప్రక్కల నుండి నాలుగు పాములు బయటకు వచ్చి, నలుగురు జీయరు స్వాములను చుట్టుకొని వారిని పైకి లేపాయి. ఇదే సమయంలో మరో పాము పైకి లేచి గొడుగు లాగ పడగ విప్పి ఈ బంతికి నీడనిచ్చినట్లు పట్టింది. ఇదే సమయంలో వాటి తోక ఆధారంగ



నమోవేంకటేశాయ రథంలాగ ఆదిశేషున్ని దర్శించుట

ఈ మొత్తం బంతి భూమికంటే ఆరేడు అడుగులు పైకి లేచింది. అంటే అతుక్కున్నవాటి పొట్ట భాగం భూమినుండి ఆరేడడుగుల పైకి లేచింది. ఆ పొట్టకు నాలుగువైపుల నలుగురు జీయరు స్వాములు త్రిదండం పట్టుకుని ఉన్నారు. ఒక పాము ఛత్రిలాగ పడగను పట్టింది. ఇంతే కల.

అంటే నమో వేంకటేశాయ రథమును ఆదిశేషునితో పోల్చుచు, దీనికి అనుమతి లభించిందని సూచించాడు ఈ జీయరు స్వాములు. రథానికి నాలుగు వైపుల ఉన్న శ్రీవేంకటేశ్వరునికి ప్రతీకలు. పైన పడగ గొడుగుకు ప్రతీక అని భావించాను. ఈ దృశ్యం చూచి తరించాల్సిందే తప్ప వర్ణించుట సాధ్యం కాదు.

7వ పర్యాయంగ 7 కోట్ల జపాన్ని తేది 01-11-2009 నాడు తిరుపతిలో స్వామివారి పాదాలకు సమర్పించాము. మరియు తేది 02-11-2009 నాడు డైరీఫాంలో శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జప హోమాదులు నిర్వహించి స్వామివారికి సమర్పించాము. మరియు 8వ పర్యాయంగ 7 కోట్ల జపమునకు శ్రీకారం చుట్టాము.

## 'భజగోవిందం' సేవ లభించుట

నేను సం॥ 2000 నుండి 2009 వరకు ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినములలో తప్పక స్వామివారి అనుగ్రహాన్ని పొందుచున్నాను. ఈ విధంగ ఎందుకు జరుగుచున్నదని విశ్లేషించుకున్నప్పటికి దీని ఆంతర్యం తెలుసుకోలేదు. బహుశా ఈ రెండు రోజులలో ఏదో ఒకటి చేయమని స్వామివారి అభిమతం అయి ఉండవచ్చునని మాత్రం ఒకసారి అనుకున్నాను. శ్రీమాన్ కె.వి.రమణాచారి గారు టి.టి.డి ఈ.ఓగా సం॥ 2007 నుండి 2009 వరకు కొనసాగారు. వారు ఈ.ఓ గా ఉన్నప్పుడు భజగోవిందం అనే ఒక భక్తి పాటల కార్యక్రమమును, స్వామిని స్మరించుటకు వీలుగ తిరుమలలో ప్రారంభించారు. వారు ఈ.ఓగా ఉన్నప్పుడు ఒకరోజు నాకు ఫోన్ చేసి నన్ను ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినములలో హైదరాబాద్ లో తప్పక 'భజగోవిందం' కార్యక్రమమును నిర్వహించుమని చెప్పారు. ఈ.ఓ ఆదేశంను నేను సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుని ఆదేశంగ భావిస్తాను కాబట్టి ఒప్పుకున్నాను. ఈ విధంగ భజగోవిందం కార్యక్రమము స్వామివారి ఆజ్ఞచే మరో సేవగ లభించింది.

సం॥ 2000 నుండి తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన లీలల ద్వార ఎన్నో రకాల శిక్షణ ఇచ్చాడు. ఈ శిక్షణ ప్రభావముతో స్వామివారు ఆశించినట్లు నాలో కొంత మార్పు వచ్చిందని ఈ క్రింది లీలల ద్వార తెలుస్తుంది. వీటిని నేను ఆగస్టు 2009 నుండి మార్చి 2011 మధ్యన పొందాను.

## స్వామివారిని దర్శించుట

ఒక సందర్భములో నేను మా స్వగ్రామం చిన్నగుండవెల్లికి పోయాను. అక్కడ రెండు రోజులున్నాను. ఒక రోజు ఏదో పని నిమిత్తం సిద్దిపేటకు నా మిత్రుడు శేఖరముతో కలిసి పోయాము. అక్కడ ఏదో మాటల సందర్భములో నేను సంపూర్ణంగ శ్రీవేంకటేశ్వరునికి సమర్పించబడ్డానని లౌకికమైన అన్ని విషయ వాసనలను త్యజించానని, ఏలాంటి తప్పు చేయనని అన్నాను. అంతే... దీనికి స్వామి వారు పరవశించిపోయారు. ఆ రాత్రి తన దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదించారు, పరవశించిపోయాను.

కల : ఈ కలలో ఊరిలోని శేఖరము ఇల్లు కనబడ్డది. వారి ఇంటి ముందు ఒక చేదబావి ఉంటుంది. నేను ఈ కలలో ఈ చేదబావిలో నీరు చేదుకొని స్నానం చేశాను. ఆ తరువాత ఈ చేదబావి ప్రక్కన నిలబడి వారి గుమ్మం నుండి ఇంటిలోనికి చూచాను. వీరి గుమ్మాలన్నీ వరుసగా ఉండుట వలన కిచెన్ వెనుక గోడ కనబడును. కాని ఈ సమయంలో నేను తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని ఆ కిచెన్ లో నాకు ఎదురుగ, తిరుమలలోని మహా లఘు దర్శనము లాగ స్వామివారు కనబడ్డారు. మరియు

తిరుమల ఆలయంలో చూచిన అనుభూతిని పొందాను. ఇంతే కల. అంటే నేను స్వామివారి గురించి లౌకిక విషయాలను త్యజించి వారికి అంకితమయ్యాను అనే మాట స్వామివారిని సంతోషపరచిందని అర్థం.

## భక్తుల ఇంటికి భోజనానికి పంపుట

ఒక సందర్భంలో మా రథయాత్ర గుంటూరు ప్రాంతము గుండా తిరుపతి వెళ్ళింది. ఇక్కడ ఒక చిత్రం జరిగింది. గుంటూరులో ఒక భక్తురాలు భాగవతులకు భోజనము పెట్టాలని భావించిందట. అందుకు డైరెక్టుగా శ్రీవేంకటేశ్వరుడినే ప్రార్థించి తన కోరికను విన్నవించిందట. తన ఇంటికి భాగవతులను పంపమని, వారికి భోజనము పెట్టి తన కోరికను తీర్చుకొందునని ప్రార్థించిందట. అప్పుడు శ్రీవేంకటేశ్వరుడు కొంతమంది వ్యక్తులను ఆమె కలలో చూపించి వీరికి భోజనము పెట్టుమని చెప్పాడట. చాల రోజులు గడిచింది, కాని ఆ వ్యక్తులు వీరింటికి రాలేదు, ఈమె కోరిక తీరలేదు. చివరికి ఒక సందర్భములో మా రథయాత్రను వారి ప్రాంతములో చూచింది. మేము స్వామి భక్తులమని నమ్మి ఆ రాత్రి వారి ఇంటికి భోజనానికి వారి భర్త ద్వారా ఆహ్వానించింది. మేము రథయాత్రను రాత్రి 9.30 గంటలకు వారింటివద్ద ముగించిన తరువాత భోజనము చేశాము. అప్పుడు ఆమె నన్ను చూచి తను కలలో చూచింది నన్నేనని పోల్చుకొని పొంగిపోయింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆమె ఆనందానికి హద్దులు లేవు.

ఈ లీలను విశ్లేషిద్దాం : ఒక భక్తురాలు స్వామివారిని, స్వామి మెచ్చిన భాగవతులను తన ఇంటికి భోజనానికి పంపమంది. స్వామివారు మమ్మలను పంపాడు. అంటే మేము శ్రీవేంకటేశ్వరుడు రెకమెండ్ చేయు స్థాయి కలిగిన స్థితిలో ఉన్నమన్నట్లే కదా! మరో ప్రక్క మాకు భోజనము పెట్టిన ప్రతి భక్తున్ని స్వామివారు కరుణించినట్లుగ అర్థం చేసుకున్నాను. పై రెండు లీలల ద్వార మాలో కొంతలో కొంతైన స్వామివారు ఆశించే విధంగ మార్పు జరిగిందని భావించాము.

ఈ రెండు లీలలు నాలో మార్పు జరిగిందని సూచిస్తే మరో లీల మాత్రం అసలు ఏమాత్రం మార్పు జరగలేదని అనిపించింది. ఆ లీల ఈ విధంగ ఉంది.

## కత్తిని మెడపై పెట్టిన స్వామివారు

గతంలో నన్ను శ్రీవేంకటేశం మాసపత్రిక ఒక దానిని ప్రారంభించమని చెప్పారు. అతి కష్టం మీద, స్వామివారు అత్యంత కఠినంగ చెప్తే కాని దీనిని ఏప్రిల్ 2007 నుండి ప్రారంభించాము. నాలాంటి తెలుగు సరిగా రాని వ్యక్తి స్వామివారి పత్రిక నడుపుట కష్టమైన పని. మొదట్లో దీనికి చక్కని ఆదరణ లభించినప్పటికి తరువాత కాలంలో తగ్గిపోయింది. ఆర్టికల్స్ కూడ అంతంతనే వచ్చాయి. దీనిని చూచి ఒకరకమైన విరక్తి భావానికి లోనైనాను. అసలు ఈ పత్రికను స్థాపించి ఏమి సాధించానని నాలో నేను తర్కించుకున్నాను. ఇంత కష్టపడ్డా తగిన లాభము లేదనిపించింది. అందుకని ఈ పత్రికను మానేద్దామనుకున్నాను. ఈ విషయాన్ని స్వామివారితో విన్నవించాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వర, శ్రీవేంకటేశం మాసపత్రిక వలన ఎవ్వరికీ లాభం లేదు. భక్తులు ఎక్కువగ చదువుట లేరు కాబట్టి వచ్చే నెల నుండి మానేస్తున్నానని చెప్పాను. అంతే... స్వామివారు మహా కోపోద్రిక్తులైనారు, కత్తిని మెడపై పెట్టి చేస్తావా? చస్తావా? అన్నారు. వణికిపోయాను. ఆ లీల ఈవిధంగ ఉంది. శ్రీవేంకటేశం మాసపత్రిక మానేయుచున్నందుకు బాధతోనే ఈ రాత్రి పడుకున్నాము.


కల : ఈ కలలో నా భార్య సురేఖ అదిరిపడుచు నిద్రనుండి లేచి నేను తనను మోసం చేశానని అరిచింది. ఇంత మోసమా...? అని గట్టిగా అరుస్తూ... కొబ్బరి బొండాలను నరికే ఒక పెద్ద కత్తిని తీసుకొని తనకు తాను తన మెడను నరుక్కొనుటకు ఆ కత్తిని తన మెడపై వేగంగ తీసుకొచ్చి నర్కుంటుంది. వెంటనే భయముతో ఉలిక్కిపడి నిద్రనుంచి లేచాను. కల చెదిరింది. ఈ కలలో సురేఖ తాను ధరించిన బట్టలనే ధరించి ఉన్నది. దీనితో నేను భయపడిపోయాను. వెంటనే తప్పైంది క్షమించమని శ్రీవేంకటేశ్వరుణ్ణి పదే పదే వేడుకున్నాను. మాసపత్రికను కొనసాగిస్తానని నిర్ణయించాను.

ఈవిధంగ తిరుమల శ్రీవేంకటేశ్వరుడు కత్తిని మెడపై పెట్టి తాను చెప్పినట్లు చేస్తావా... చస్తావా...? అన్నాడు.

## లీలల ప్రచురణను ఆపుమనుట

శ్రీవేంకటేశం మాసపత్రిక ప్రారంభించుటకు స్వామివారు చూపిన లీలలను ఏప్రిల్ 2009 నుండి 'శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం' అనే టైటిల్ తో పత్రికలో ప్రచురించాము. నిజానికి స్వామివారు తన లీలల అసలు రహస్యాన్ని ఏప్రిల్ 2022 లో మాత్రమే చెప్పారు. అంతకు ముందు ఏదో సాధించుటకు లీలలను ప్రసాదిస్తున్నారని గ్రహించాను కాని అసలు లక్ష్యం తెలియదు. పైగ నాకు సరైన యోగ్యత లేనందున కొన్ని లీలలను తప్పుగ అర్థం చేసుకున్నాను. అందుకని లీలలను ప్రచురించుటకు ఇప్పుడే సమయము రాలేదు ఆపుమని రెండు లీలల ద్వార తెలిపారు. ఇందులో ఒకటి నాకు మరోటి సురేఖకు వచ్చింది. నేను పొందిన లీల.

కల : ఈ కలలో నేను నా అనుభూతులను వ్రాస్తున్నాను. కాని దాని అర్థం సరిగా తెలియకనో... లేక సరిగా కుదురకనో... తెలియదు కాని వ్రాస్తున్నాను చించేస్తున్నాను, ఇలా చాల పేపర్లను




**లీలల ప్రచురణను ఆపుమనుట**

చించేశాను. ఇంతే కల.

**ఇక సురేఖ కల.**

కల : ఈ కలలో సురేఖ మా ఇంటిలో దాదాపు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతాన హాలులో కూర్చుండి కూరగాయల తొడిమలను తీస్తున్నదట. ఇంతలో మా పెద్ద కుమారుడు చి॥ వేదాంత్ చక్కని శ్రీచూర్ణంను నామంగ ధరించి కాలేజి నుండి ఇంటికి రుసరుసమని కోపంగ వచ్చాడట. వచ్చి రావడంతోనే సురేఖతో ఇలా అన్నాడట. ''డాడి అన్నీ లీలలను ప్రచురిస్తున్నడు అందరూ ఏమేమో అనుకుంటున్నారు. ఇప్పుడే ప్రచురించాలా? వద్దని చెప్పు'' అని సురేఖతో అన్నాడట. సురేఖకు కూడ ప్రచురించుటకు ఇంకా సమయము రాలేదు, సమయం వచ్చినప్పుడు ప్రచురించవచ్చు, ఇప్పుడు మాత్రం వద్దనే భావం ఏర్పడిందట. అందుకే మేము వీటిని మార్చి 2010 నెలతో ఆపివేశాము. ఏప్రిల్ 2009 నుండి మార్చి 2010 వరకు సంవత్సరం కాలం ప్రచురించాము.

## హరినామ క్షేత్రం రూపం దాల్చుట

ఇదే కాలంలో శ్రీవేంకటేశ్వరుడు మరో అద్భుతమైన లీలను ప్రసాదిస్తూ హరినామ క్షేత్రం గురించి నా మనస్సులో పూర్తి రూపం దాల్చేలా చేశాడు. ఈ కాలంలో స్వామివారి పాదస్పర్శ ప్రభావం నాపై అధికంగ ఉండుట వలన ఎక్కడ చూచిన స్వామివారే కనపడసాగారు, మరింత స్వామి సేవ చేయాలనే ఆరాటం అధికంగా ఉన్న రోజులు. ఆ లీల ఈవిధంగ ఉంది.

అది రథయాత్ర సమయం. మేము హైదరాబాద్ నుండి తిరుపతికి పోవు దారిలో గుంటూరు వెళ్ళాము. అక్కడ 1947 సం॥లో ఏర్పాటు చేసిన రామనామ క్షేత్రమనే ఒక క్షేత్రమున్నది. దీనిలో ఆ క్షేత్రం ఏర్పాటు చేసిన నుండి ఇప్పటివరకు అఖండ రామనామ కీర్తన వివిధ భక్త బృందాలచే నిరంతరము జరుగుతుంది. ఆ క్షేత్రం వారు మాకు ఒక రాత్రి ఉండుటకు వసతి కల్పించారు. ఆ రోజు సాయంత్రం దాదాపు 4.30 గంటల ప్రాంతమున అక్కడికి చేరుకున్నాము. నేను ఆ ప్రాంగణములో అడుగుపెట్టిన వెంటనే రామనామ కీర్తనలను విన్నాను. నా శరీరం పులకరించింది. అప్పటికే గత 22 రోజుల నుండి రథయాత్ర చేస్తు స్వామి లీలలలో గడుపుచున్న నేను ఈ అఖండ కీర్తనలను విని పరవశించిపోయాను. రథం నుండి క్రిందికి దిగుటతోనే ఆ క్షేత్రం ఏర్పాటు చేసిన వ్యక్తికి సాష్టాంగ దండప్రణామము చేశాను. వెనువెంటనే నా స్వామివారికి మరో సాష్టాంగ ప్రణామము చేస్తూ ''ప్రభూ శ్రీవేంకటేశ్వర నాకు ఈ సేవను ప్రసాదించుము''ని దీనంగ వేడుకున్నాను. నా కళ్ళ నుండి నీరు రాలుతుండగ అత్యంత భక్తిపూర్వకంగ వేడుకున్నాను. మరియు తిరుమల ఆలయ ప్రతిరూపమును గర్భాలయం నుండి గరుడాల్వార్ వరకు యథాతథము, ఆ తరువాత వెండివాకిలి వరకు కావలసిన మార్పులతో నిర్మించి, వివిధ భక్త బృందాలచే అఖండ హరినామ స్మరణ చేయాలనే బలమైన కోరికకు అనుగుణంగా దానిని ప్రసాదించుమని వేడుకున్నాను. నా కారణంగా స్వామివారు తరతరాలుగ స్మరింపబడాలనే కోరిక కలిగింది. ఈ క్షేత్రం పేరు 'హరినామ క్షేత్రం' అని పెట్టాలని అప్పుడే ఒక హృదయాంతర భావం ఏర్పడింది. ఆ క్షణము నా శరీరం కంపించింది, రోమాంచితుడనైనాను. కళ్ళవెంట నీరు కారుచుండ పరవశించిపోయాను. ఈవిధంగ మొదటిసారి హరినామ క్షేత్ర సంపూర్ణ భావన నా మనస్సులో ఏర్పడింది. మరియు తప్పక స్వామివారు కరుణించుదురనే భావం కూడ ఏర్పడ్డది. ఆ రోజు ఈ రామనామ క్షేత్రంలో వివిధ భక్త బృందాలు ఏవిధంగ రాత్రుళ్ళు భజనలను కొనసాగించారో బహు చక్కగ చూచాము.

ఇలా నేను స్వామివారి పాదస్పర్శ ప్రభావముతో ఉన్నప్పుడు, ఒకసారి భక్తులు తరించుటకు నిరంతరము స్వామి పాదాలను అర్చించునట్లు చేయమన్నారు. మరోసారి హరినామ క్షేత్ర రూపం చూపెట్టి, నిరంతరము వివిధ భక్తబృందాలచే నామస్మరణ చేయించమని దృఢ సంకల్పాన్ని కలిగించాడు. త్రివిక్రముడుగ శ్రీవేంకటేశ్వరుడు ఈ విశ్వంలో పెద్దవాడని, ఇతని కంటె భక్తులను అనుగ్రహించువారు లేరని చెప్పారు.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 8వ పర్యాయంగ జప సమర్పణ కూడ జరిగింది. తేది 31-08-2010 నాడు పాదాల మండపములో స్వామివారి పాదాలకు సమర్పించాము. మరియు తేది 01-09-2010 గోకులాష్టమి నాడు జప హోమాదులు నిర్వహించి శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపములో సమర్పించాము. అప్పటి ఈ.ఓ శ్రీమాన్ ఐ.వి.ఆర్.కృష్ణారావు గారు 8వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని సమర్పించి, 9వ పర్యాయంగ 7 కోట్ల జపాన్ని ప్రారంభించారు.

## పీఠం ఆఫీసును మార్చుట

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆఫీసు ఇ.నెం.1-9-1113/30, వి.ఎస్.టి.రోడ్, విద్యానగర్, హైదరాబాద్ లో సం॥ 2002 నుండి 2010 వరకు ఉండేది. ఇది మా ఇంటినుండి అడ్డదారిలో కారులో ప్రయాణిస్తే పదైదు నిముషాలే పడుతుంది. అది మా సొంత బిల్డింగు. కాని సం॥ 2010 లో మేము అక్కడ ఆఫీసును నడుపలేని పరిస్థితులు ఏర్పడ్డవి. స్వామివారు ఈ ఆఫీసును మార్చుమని సూచిస్తున్నట్లు స్పష్టంగ పరిస్థితులు ఏర్పడ్డవి. ఫలితంగ దాన్ని అమ్మి మా ఇంటికి మరింత దగ్గరలో హబ్సిగూడ వీధి నెం.1 లో ఇం.నెం.1-1-53 అనే ఇల్లును కొని అక్కడ కొత్త బంగ్లాను కట్టుకున్నాము. ఇది మేన్ రోడుకు కాకుండ 200 అడుగులు లోనికి ఉంటుంది. ఇది మా ఇంటినుండి నడిచి వస్తే పది ని॥లు పడుతుంది. ఈ ఆఫీసు భక్తుల కంటే నాకే ఎక్కువ సౌకర్యవంతంగ ఉన్నది. ఇలా ఎందుకు చేశాడో ఆలోచించినప్పటికీ సమాధానం లభించలేదు.

ఇప్పటివరకు 8 పర్యాయాలు జప సమర్పణ, 7 పర్యాయాలు రథయాత్ర నిర్వహించాము. ముంగిట హైదరాబాద్ నుండి తిరుపతి వరకు 25 రోజులు రథయాత్ర చేసిన తరువాత ఈ రథయాత్ర వలన అందరికంటే నేనే ఎక్కువ లాభపడినట్లు భావించేవాడిని. స్వామి సేవలో ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా అలసిపోవాలనే నా కోరికను తీర్చుకునే వాడిని. ఆసమయంలో నా సర్వదాస్తిని లాక్కెళ్ళుచున్నారని తెలిసినా... చలించని శరణాగత స్థితి కలిగేది. క్రమంగ కొన్ని రోజుల తరువాత మామూలుగ మారేవాన్ని. మొత్తం మీద ఈ రథయాత్ర నాకే ఎక్కువ లాభించినట్లు ఎన్నోసార్లు భావించాను.

ఆ తరువాతి కాలములో త్రివిక్రముడి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు తీవ్రంగ ప్రయత్నించాను. కావలసిన శక్తిని ప్రసాదించమని స్వామివారిని ఎన్నోసార్లు వేడుకున్నాను. 2010 జప సమర్పణ తరువాత బహుశా స్వామి దర్శనార్థమై తిరుమల ఆలయంలో ఉన్నప్పుడు అప్పటి టిటిడి పెద్ద జీయరు స్వామివారిని కలిశాను. వారు భారీ విగ్రహము ఏర్పాటు చేయరాదని, సాంప్రదాయ బద్ధంగానే నిర్మించమని ఆదేశించారు. దీనితో వెనుకకు తగ్గాను. ఇంతటితో 4వ పుస్తకములో నాకు గుర్తున్నవాటిని తెలిపాను. వచ్చే భాగం నుండి 5వ పుస్తకములోనివి తెలుపుదును.

**నా దశ:** నా స్వామివారిని త్రివిక్రముడుగ ప్రపంచములో ఎత్తైన వాడిగ చేయాలనే తలంపు కలిగింది. అమ్మవారి అనుగ్రహం పొందాను. స్వామివారు నన్ను తన ఆత్మీయ భక్తుడని చెప్పాడు. భక్తుల ఇంటికి భోజనాలకి పంపారు. శ్రీవేంకటేశం మాసపత్రికను కొనసాగించమన్నారు. హరినామ క్షేత్ర సేవను ప్రసాదించమని స్వామివారిని వేడుకున్నాను. పీఠం ఆఫీసు మా


తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము



స్వామివారి 700 దివ్యలీలలు

మొదటి సంపుటము

తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.

12 భాగాలు కల

పుస్తకము ధర : 250/-

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)

ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.

ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)

website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్


ఇంటి దగ్గరకు మార్చబడ్డది.

**భాగవత ఆశీర్వాదము:** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

ఈ స్వామివారి లీలల ప్రచురణలో ఇంతవరకు 24 భాగాలను ప్రచురించాము. ఈ అనుభూతులు చదివిన పాఠకుల నుండి తగిన సూచనలను, అభిప్రాయములను ఆశిస్తున్నాము. ఈ క్రింద తెలిపిన చిరునామాకు మీ అమూల్యమైన సందేశాన్ని పంప మనవి.


**శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇంటి నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,

హైదరాబాద్-500 007. ఫోన్: 040-27175050,


సెల్ నెం : 93482 12354

Mail Id: srivenkatesham@gmail.com

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). **9348212354** నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి
పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# యామునేయం నమామితం

- డా|| కూర్మాచలం శంకరస్వామి

**"శుచౌ మాస్యుత్తరాషాఢా జాతం యామున దేశికం**
**శ్రీరామ మిశ్ర పాదాబ్జ చఞ్చరీక మహం భజే**
**యత్పదామ్భోరుహ ధ్యాన విధ్వస్తా శేష కల్మషః**
**వస్తుతా ముపయాతోహం యామునేయం నమామితం"**

భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్నది శ్రీరంగ క్షేత్రము. అక్కడ శ్రీమహావిష్ణువే శ్రీరంగేశుడుగా కొలువై ఉన్న ప్రదేశం. అది వైష్ణవ సిద్ధాంతము వెల్లివిరిసిన పుణ్యక్షేత్రము. పన్నిద్దరాళ్వారులు నడయాడిన దివ్యమైన నేలయది. జీవితంలో ఒకసారి యైనను సందర్శించాలని ప్రతి వైష్ణవ భక్తుడు కలలు కనే పుణ్యక్షేత్రమది. భూమండలానికే మణిపూసలా వర్ధిల్లుతున్న శ్రీరంగక్షేత్రం మోక్షధామంగా భాసిల్లుతున్నది. అలాంటి దివ్యప్రదేశంలో పుట్టి పెరిగి వైష్ణవ సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన ఆచార్యులలో శ్రీ యామునాచార్యులు ఒకరు.

శ్రీమన్నాథమునుల కుమారులగు ఈశ్వర మునులు, అతని భార్య శ్రీరంగనాయకితో వీరనారాయణ పురంలో కాపురముండేవారు. కలిలో ధాతృనామ వత్సరం, కర్కట మాసం, తిథి పూర్ణిమ యందు శుక్రవారము, ఉత్తరాషాఢ నక్షత్రమున శ్రీమన్నారాయణుని సింహాసనము అంశతో ఒక పుత్రుడుదయించెను. ఈ విషయము తెలుసుకున్న శ్రీరామమిశ్రులు అనే ఒక పండితుడు శ్రీరంగము నుండి వీరనారాయణ పురమునకు విచ్చేసి ఆ బాలుని గాంచి పన్నెండవ దినమున యథావిధిగా జాతక కర్మలు చేయించి యామునాచార్యులను నామకరణము చేశారు. తరువాత తండ్రియైన ఈశ్వరమునులు ఆయా కాలములందు శాస్త్రవిధిగా అన్నప్రాశన చేలోపనయనాదుల నెల్ల గావించి నాల్గు వేదముల నభ్యసింప చేసిరి. సూక్ష్మబుద్ధి యగు యామునులు ఒక్కమారు వినినంతనే సకలములు గ్రహించుచు జట, వర్ణ, క్రమాదులతో గూడినవేదములను,వేదాంగములనుబాల్యముననేపూర్తిచేశారు. తరువాత వీరి తండ్రిగారు వీరిని శాస్త్ర పండితులుగా చేయదలచి మహాభాష్య భట్టుల వద్ద సర్వశాస్త్రములు చదివించారు.

**"అతడు చిరుతనాడే యాచార్య కులమున**
**వేడ్క వేదశాస్త్ర విద్య లభ్య**
**సించుచుండ నపుడు చెలువ పాండ్య**
**నృపతి పూర్వవంశుండే యొకండు"**

పాండ్యరాజుకు శైవ మతము అంటే వల్లమాలిన ప్రేమ. విష్ణుస్తవములు చెవియందు పెట్టక, విష్ణు విగ్రహములకు నమస్కరించక, విష్ణుమందిరాలలో జరిగే ఉత్సవాలను పరిహసించుచు శివుడే పరబ్రహ్మమని భావించేవాడు. వైదిక కర్మలను మాని జంగాలను సేవించేవాడు. శైవాచారములనే ఆచరించేవాడు. తాను లింగధారణ చేసి, శైవ మతాన్ని అవలంబించిన బ్రాహ్మణులకు ముత్యాల హారములను బహుమతి ఇచ్చేవాడు.

కాలంలో చోళభూపతి పురోహితుడు దుర్మదుడై రాజ్యములోని పండితులెల్లరిని ఓడించి ప్రతి సంవత్సరము కప్పమును కట్టించుకునేవాడు. యామునాచార్యులైన గురువులైన శ్రీ మహాభట్టారకుడు ఆ సుంకమును చెల్లించలేకపోవడంతో అతనిని నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న యామునాచార్యులు మిక్కిలి కోపించి నిరంకుశులైన రాజదూతలను బెదిరించి ఒక శ్లోకమును వ్రాసి పంపారు. ''మేము కేవలము కవులము మాత్రమే కాదు, కేవలము మంత్ర తంత్ర వేత్తలమే కాదు, కాని ప్రతివాదులనెడి ఏనుగుల గర్వము నిర్మూలింప సమర్థులము'' అనే అర్థముతో ఒక పత్రమును పంపెను. రాజపురోహితుడు ఆ పత్రములోని శ్లోకము చదివి కలతచెందిన మనసు కలవాడై ఆ విషయము రాజునకు తెల్పి ''రాజా! మహాభాష్య భట్టరు శిష్యుడు పండ్రెండు సంవత్సరాల బాలుని పిలిపించి తమరి ఆజ్ఞను అతిక్రమించిన ఆ బాలుని శిక్షింపుము''ని కోరగా పండిత ప్రియుడైన ఆ రాజు ఆ బాలుని రాజసభకు తోడ్కొని రమ్మని దూతలను పంపించాడు. బుద్ధిమంతుడైన యామునాచార్యులు అనాదరణతో కూడిన ఆ ఆహ్వానాన్ని లెక్క చేయకపోవడంతో విషయం గ్రహించిన రాజు మహావైభవంతో పల్లకిని పంపగా యామునాచార్యులు దాని నధిరోహించి రాజసభలోని పండిత గోష్ఠిలో పాల్గొన్నారు. అంతట రాజపురోహితుడు ఆ బాల యామునను చూచి నీవేం చదివితివని అడుగగా ''పర్వతపుత్రి యగు పార్వతి యొక్క చిగురులవంటి పాదములనుండుటచే ధన్యమగు ప్రదేశము గల హిమవత్పర్వతము మొదలు రావణునిచే చెరపట్టబడిన సీతాదేవి ముఖపద్మమును వికసింపచేయుటకై నిర్మింపబడిన సేతువు వరకును, సూర్యచంద్రాదులను, ఉదయాస్తమయాలను, తనకు శిరోభూషణముగా ధరించెడి ఉదయగిరి మొదలు అస్తగిరి వరకు పూర్వోత్తర మీమాంసా శాస్త్రములలో నాలాగా కృషి చేసినవారు ఎవరైనా మొనగాడు ఎవడైనా ఉన్నచో వెతికి తెమ్ము'' అని అర్థము వచ్చే రీతిలో ఒక శ్లోకమును ఆశువుగా చెప్పారు యామునాచార్యులు. అంతట

దుర్బుద్ధి గల ఆ వృద్ధ పురోహితుడు బాలునితో శాస్త్రవాదము చేయాలని కోరెను. అంతట యామున మునులు రాజుతో ఇలా అన్నారు. పండితుల మధ్య వాదనలకు సిద్ధమని తెలుపగా రాజు కూడా అంగీకరించి రాజ్యంలోని పండితులందరినీ ఈ గోష్ఠికి రావాలని ఆదేశించారు.

ఆ రోజు రాత్రి అంతఃపురంలో ఏకాంత సమయాన రాజు మరియు అతని భార్యయు సంగీత వాదములలో ఎవరు జయింతురు అనే విషయమున ఒక వివాదము జరిగింది. పాండ్యరాజు పురోహితుడే జయిస్తాడని వాదించగా అతని పట్టమహిషి విష్ణుభక్తి పరురాలు. అనేక ఏకాదశి వ్రతాలు చేసిన పుణ్యస్త్రీ కావడం వలన బాలుడగు యామునులే జయిస్తాడని వాదించెను. పురోహితుడు జయించిన పక్షంలో బాలుడైన యామునులను వేటకుక్కలకు ఆహారంగా వేస్తానని ప్రతిజ్ఞ చేయగా, బాలుడు జయించినచో అర్ధరాజ్యమిస్తానని ప్రతిజ్ఞ చేసింది.

**"అస్మన్మతస్థుడోడిన**
**భస్మము రుద్రాక్షములును బాసి యితనిచే**
**విస్మయముగ దప్తపుము ర**
**ఘుస్మర చక్రాంకితుడ గాగలవాడన్"**

ఇపుడు జరగబోయెడి వాదములో నాకభిమతస్థుడైన పురోహితుడు ఓడిపోయినచో విభూతి, రుద్రాక్షలను పరిత్యజించి నేనీ బ్రహ్మచారి చేత చక్రాంకితుడనయ్యి వైష్ణవ మతాన్ని స్వీకరిస్తానని రాజు శపథం చేయగా

**"ఉవిధ నీదు విద్వాంసు డోడెనేని**
**నీకు నీతనికే నన్న పూనికయ యన్న**
**నొప్పితిమి దేవరానతి దప్పకున్న**
**జాలు మఱి పంచభూతము ల్సాక్షి కాగ"**

ఓ వనితామణీ! ఈ పండితుడోడెనా, నీవును, యామునులును నేను చెప్పినట్లే శైవదీక్ష వహింపవలసి యుండుననగా విని ఆ రాజు భార్య "స్వామీ! మీ ఆజ్ఞకు మేము అంగీకరిస్తున్నాము. మీరు కూడా మీ మాటకు కట్టుబడి ఉండాలని పలికెను. అట్లు ఆ ఇరువురు (రాజు, రాజు భార్య)లు నిర్ణయించుకున్న శపథములని విని, యామునాచార్యుడపుడు తాను ధరించియున్న కృష్ణాజినము పెళపెళ లాడగా బాలాంశ దండమునందు బంధింపబడిన గోచి చలించునట్లు సగము విడవబడ్డ యాసనము గలవాడై చేతులు జోడించి విన్నవించెద నాకర్ణింపుమని రాజును గూర్చి పలికెను.

**"దేవా! యిట్లని యానతి**
**యీవలదే గడుపు గూటికిటరానాడ**
**బ్దేవాబ్రోవ భిక్షా**
**జీవిక వర్ణికిని విధి సృజించెనే గాదే!"**

ఓ రాజా! నీవీలాగున సెలవీయవలదు. నేను కడుపు కూటి నిమిత్తమై వివాదము చేసెదనని చెప్పివచ్చినవాడను కాను. నేనెవ్వరిని రక్షింపవలసి యున్నది. బ్రహ్మచారికి బ్రహ్మ భిక్షావృత్తిని మున్నే సృజియించి ఉండలేదా? యని యామునులు పలికెను. సర్వాంతర్యామియైన ఏ దేవుడు నన్నిట్లు వాదము సేయమని ప్రేరేపించెనో అట్టి భగవంతుడే బొంకినపుడు నేనేమి సేయంగలవాడను? నాకు తెలిసియున్న నాలుగు యుక్తులు చెప్పెద. దానిపై ఎలాగైనను యోగ్యమే యని పలికెను.

**"పంతమైనను గానిమ్ము పార్థివేంద్ర**
**యుక్తులను నిగ్రహస్థానమొదవెనేని**
**యమ్ముదెచ్చిన విద్వాంసుడనగ వలవ**
**దెట్లు గావింపవలయు నట్లట్ల సేయు"**

ఓ రాజా! నేను ప్రతివాది యుక్తులకు ఓడితేని మీరు ఆనతిచ్చినట్టి ప్రతిజ్ఞనైనను జరిగింపుడు. అమ్మగారు పిలిపించిన విద్వాంసుడని మన్నింపక మీకు నచ్చినట్లు చేయుమని పలికెను. అంతట ఆ వాదులలో ఒక ప్రౌఢవాదికి అభిముఖుండై అతడు చెప్పిన యుక్తులను ముందు అనువాదము చేసి ఉపక్రమించి పిమ్మట ఆ యుక్తులకు అన్ని దూషణములను తాను త్వరపడక సభ్యులు మెచ్చునటుల సమాధానాలు ఇచ్చి

**"ఆ యెడను నొక్క పలుకెదు**
**రైయుండెదు నిస్సలమున నాయెను విన నో**
**హో యిది నిక్కము నృప నా**
**రాయణుడె పరంబు కొల్వుమతని నటంచున్"**

ఇట్లు ఆ బాల యామునులు సిద్ధాంతము చేసిన సమయాన ఎదురుగా ఉన్న రావిమాను నుండి "ఓ రాజా! ఈ బ్రహ్మచారి చెప్పినదంతయు నిజము. శ్రీమన్నారాయణుడే పరబ్రహ్మమగుట జేత ఆ దేవుని సేవింపుము" అని ఒక శబ్దము వినవచ్చెను.

అప్పుడు అలాంటి అద్భుతములైన వాక్యములు విన్న తరువాత చేయునది ఏమీ లేక ఆ సభ యందున్న పాషండులగు దుర్వాదులు ఖిన్నులై లేచిపోయారు. రాజు యామునాచార్యుల గొప్పతనాన్ని మహోన్నతమైన పండిత ప్రకర్షణను మెచ్చి, సంతసించి ఆ బాల యామునులకు దండవత్ప్రణామముల నాచరించి శ్రీవిష్ణుదేవునియందు భక్తిభావన జనించుట వలన కృతార్థుండై తన రాజ్యము మేనల్లునికి బట్టము కట్టినట్టి సంప్రదాయము కలది యగుట వలన అతనికి తన ముద్దు చెలియలినిచ్చి వివాహమొనరించి ఆ వివాహ కాలమున ధారాపూర్వముగా తన రాజ్యమున అర్ధరాజ్యమిచ్చి యువరాజుగా నియమించి రాజు మోక్షసాధన కొరకు వానప్రస్థాశ్రమము స్వీకరించాడు.

అంతకుముందు జరిగిన శాస్త్రవాదములలో ఒక ఆసక్తికర చర్చ జరిగింది. రాజపురోహితుడు బాలుడైన యామునులను చూచి "నీవు బాలుడవగుటచే ముందుగా శాస్త్ర వాదమునకు తగవు లౌకిక వాదమగు ఏవేని మూడు మాటలు చెప్పుము.

వాటికి నేను ఆరు తప్పులు పట్టెదను. లేనియెడల నువ్వు నేను చెప్పే ఆరు మాటలకు మూడు తప్పులను పట్టుము. జయించినవారు ఓడినవారి శిరస్సును తన్నవచ్చును అని పలికెను. అప్పుడు బాల యామునులు పురోహితుని చూచి "1. నిన్ను కన్నతల్లి గొడ్రాలు కాదు. ఈ రాజు ధర్మాత్ముడు. 3. ఈ రాజు భార్య పతివ్రత. ఈ మూడు మాటలకు కాదని సమాధానము చెప్పుమనగా పురోహితుడు సిగ్గుపడి నిరుత్తరుడయ్యెను. అది గమనించిన ఆ సభలోని పండితులు ఈ మూడు వాక్యాలకు సమాధానము నీవే చెప్పుమని యామునులను కోరగా ఆతడిట్లు సమాధానము చెప్పెను.


1. పండితులెల్లరను అవమానించిన ఈ పండితోత్తముడైన పురోహితుడు లోక కంటకుడు. ఇతని కన్నతల్లి బిడ్డలు లేనిదే అనబడును. ఏకపుత్రుని కనుట చేత కదళి వంధ్య యగుటచే ఈ పురోహితుని తల్లి గొడ్రాలుగానే పిలువబడుతుంది.

2. పండితులను అవమానించెడి ఈతనిని పురోహితునిగా అంగీకరించిన ఈ రాజు ధర్మాత్ముడు కాదు, అధర్మపరుడే.

3. ఏకాంతమున నేని భర్తతో వాదించుటచే ఈ రాజు భార్య పతివ్రత కాదని శాస్త్ర సమ్మతముగా నిరూపించెను.

ఈ విధముగా యామునాచార్యులు యుక్తి యుక్తముగా, శాస్త్ర నిరూపణ చేయగా పండితులెల్లరూ బాగు బాగని ఎంతగానో మెచ్చుకున్నారు. ఒప్పందము ప్రకారం గెలిచినవారు వాదములో ఓడినవారి తల తన్నవలసి ఉంటుంది. కాని ఇక్కడ ఓడినవారు రాజపురోహితుడు, మరియు వయసులో పెద్దవాడు, పైగా బ్రాహ్మణుడు కాబట్టి గౌరవపూర్వకంగా అతణ్ణి వదిలేశాడు యామునులు. కాని పండితుల నుండి శుల్కము తీసుకొను విధానము మానుకొమ్మని హితవు పలుకగా రాజు మరియు రాజసభలోని పండితులు యామునాచార్యులను ఎంతగానో కీర్తించారు. తెరచాటు నుండి ఈ విషయాలు విన్న రాజు భార్య పరుగున వచ్చి యామున బాలుని ఎత్తుకొని 'ఎన్నె అళవారే' "నన్ను రక్షించవచ్చినవాడా" అని అంతఃపురములోనికి వెళ్ళిపోయింది. నాటినుండి యామునాచార్యులకు ఆళవన్దార్ అనెడి నామము ప్రసిద్ధమైనది. రాజు కూడా సంతసించి అతనికి అర్ధరాజ్యమును ఇచ్చెను. యుక్తవయస్కుడు కాగానే అతనికి వివాహం చేసి రాజ్యపాలనను అప్పగించారు. పర రంగాచార్యులు, తొట్టినంబి అనెడి ఇరువురు పుత్ర సంతతి పొందారు యామునార్యులు.

శ్రీరామ మిశ్రులు అనే శ్రీమన్నాథ మునుల శిష్యుడు యామునాచార్యుల చరిత్రను విని మిక్కిలి సంతోషించి వారిని చూచు వేడుకతో యామునాచార్యులు పాలిస్తున్న పాండ్య రాజ్యానికి వెళ్ళారు. అక్కడ యామునులు తన పూర్వవృత్తిని మాని ఐశ్వర్య భోగాలతో తులతూగుతూ అంతఃపురంలోనే ఉండడం చేత శ్రీరామ మిశ్రులకు రాజైన యామునాచార్యుల దర్శన భాగ్యము కలగలేదు. అప్పుడు శ్రీరామ మిశ్రులు ఒక ఉపాయాన్ని ఆలోచించి తనను అడ్డుకున్న ద్వారపాలకుల వైపు కాకుండా వంట వైష్ణవులవైపు చేరి అతనిని మచ్చిక చేసుకుని యామునాచార్యులకు ఇష్టమైన కూరను తెలుసుకుని ప్రతిదినము నాయల్కర శాకము (ఉసిరియాకు కూర) తెచ్చి ఆ వంటలవానికి ఇచ్చుచుండెను. వంటలవాడు కూడా ఆ కూరను రుచికరముగా వండి రాజుకు ఆహారముగా పెట్టుచుండెను. రాజు ఆ కూరను ఇష్టంగా ఆరగించుచుండెను. కాని కూరను తెచ్చినవారిని ఏమాత్రం పట్టించుకోలేదు. ఇట్లు ఆరు మాసాలు కష్టపడినా యామునాచార్యులు గుర్తించకపోవడంతో శ్రీరామ మిశ్రులు మిక్కిలి విచారించి ఆకుకూరను తెచ్చుట నాలుగు రోజులు మానుకొనగా ఐదవ రోజు యామునాచార్యులు వంట వైష్ణవుని పిలిచి కారణం అడగగా, అప్పుడా వంటలవాడు "అయ్యా! ఒక వృద్ధ వైష్ణవుడు రోజూ ఈ కూరను తెచ్చేవాడు. దానిని వండి తమరికి పెట్టేవాడిని. మధ్యలో నాలుగు రోజులు మానుకుని మళ్ళీ



ఈరోజే తెచ్చాడు అనగా రాజు "అతనిని చూడాలని కోరగా, మరునాడు శ్రీరామ మిశ్రులను రాజుకు పరిచయం చేశాడు వంటల వైష్ణవ స్వామి.

యామునాచార్యులు శ్రీరామ మిశ్రులకు నమస్కరించి ఉచితాసనము మీద కూర్చుండబెట్టి తనకిష్టమైన కూరను తెచ్చుటకు కారణము తెలుపుమని కోరెను. అప్పుడు శ్రీరామ మిశ్రులు "ఓ రాజా! మీ తాతలు దాచి పెట్టిన నిధి యున్నది. అది మీకు అప్పగించేంతవరకు మీ దగ్గరికి రావడానికి ద్వారపాలకుల

అనుమతిని ఇవ్వమని కోరగా రాజు అంగీకరించాడు. ఆనాటి నుండి శ్రీరామ మిశ్రులు ప్రతిదినము యామునాచార్యుల వద్దకు వచ్చి భగవద్గీతను పదునెనిమిది అధ్యాయాల సారం వివరించగా చివరి శ్లోకమునకు వచ్చుసరికి యామునాచార్యులకు సర్వేశ్వరుని యందు ఆసక్తి పెరిగెను. అంతేకాక యోగసామ్రాజ్యము మరచి సామ్రాజ్య భోగాల మాయల్లో చిక్కిన యామునాచార్యులు తన పూర్వ బ్రాహ్మణత్వము భక్తి ప్రపత్తులపై ఆసక్తి కలిగింది. ఈ విషయాన్ని గ్రహించిన శ్రీరామ మిశ్రులు అతనిని శ్రీరంగము తీసుకుని వెళ్ళి అక్కడ ఆలయంలో కొలువై యున్న శ్రీరంగనాథుని చూపించి ఇదియే మీ తాతగారు నీకు ఇవ్వమన్న నిధి యని చూపించగా, ఆ స్వామిని దర్శించుకున్న యామునాచార్యులు ఆనంద బాష్పాలు రాల్చి తాను ఇంతవరకు ఏమి పోగొట్టుకున్నాడో అర్థం చేసుకుని ఎంతగానో బాధపడి ఆ స్వామిని అత్యంత ప్రీతిపాత్రంగా సేవించాడు. భక్తికి ప్రతికూల పరిస్థితులైన సంసార సౌఖ్యాలను త్యజించి, సన్యాసం స్వీకరించి శ్రీరామ మిశ్రుల నుండి అనేక రహస్యాలను తెలుసుకొని సిద్ధాంత కర్తలయ్యారు యామునాచార్యులు.

శ్రీరామ మిశ్రుల సూచన మేరకు యామునాచార్యులు పుండరీకాక్షుల వద్ద అష్టాంగ యోగ రహస్యాలు కూడా అభ్యసించారు. గురువుగారి ఆజ్ఞ మేరకు యామునాచార్యులు ఆచార్యులకు బ్రహ్మమేధ సంస్కారములను భక్తిశ్రద్ధలతో చేశారు. తిరువనంతపురంలోని అనంత పద్మనాభుని దర్శించి ఆయనను మనసారా సేవించి తిరిగి శ్రీరంగం వచ్చి ఆచార్య పీఠాధిపత్యం వహించి వైష్ణవ తత్త్వాన్ని ఎంతగానో వృద్ధిపరచి అనేకమంది శిష్యులను పొందారు.వీరితరువాతిస్థానంలోభగవద్రామానుజులు ఆ సాంప్రదాయాన్ని కొనసాగించారు.

చిన్నతనము నుండే వేద వేదాంగాల యందు పట్టు పొంది మహా మహా పండితులను వాదములలో ఓడించి మధ్యలో ప్రభువై రాజభోగాలకు దాసుడై తన బ్రాహ్మణ ధర్మాన్ని మరచిపోయి శ్రీరామమిశ్రులచే తన పూర్వజ్ఞానాన్ని పొంది శ్రీరంగనాథుని సేవలో ఆచారత్వము స్వీకరించి ఎంతోమంది శిష్యులకు మార్గదర్శిగా నిలిచిన పరమాచార్యులు యామునాచార్యులు. అందుకే భక్తకోటి తెలుపుతున్నారు యామునేయం నమామితం అని శ్లాఘిస్తున్నారు.

★★★

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. ధర్మం – సనాతన ధర్మం వీటి గురించి వివరించండి?**

**- ఉషారాణి - గీతాసమితి, ఉప్పల్**

జవాబు – సంస్కృత భాషలో ధృ అనే ధాతువు నుండి ధర్మం అనే పదం పుట్టింది. ధృ (ధారణ) అంటే ధరించేది లేదా భరించేది అని అర్థం. సంరక్షించేది అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. ఇక సనాతనం అంటే ఎప్పటికీ ఎలాంటి మార్పుకూ లోనవకుండా ఒకే రీతిగా స్థిరంగా ఉండేది అని అర్థం. క్లుప్తంగా చెప్పాలంటే ఇహ పర సౌఖ్యాలు మనిషికి దేనివల్ల లభిస్తాయో అది ధర్మం. ఏ దేశంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా, వేద విరుద్ధం కాకుండా పరంపరగా మానవులు అనుసరిస్తూ వస్తున్న సదాచారాన్ని ధర్మం అని అంటారు. లోకానికి రక్షణ కలిగించేది అనగా మనం ఆచరిస్తే, మనల్ని రక్షించేదే ధర్మం. "సనాతనస్య ధర్మ ఇతి సనాతన ధర్మః". సనాతనుడైన పరమాత్మ ఆద్యంతాలు లేనివాడు కాబట్టి సనాతన ధర్మం కూడా ఆద్యంతాలు లేనిది, ప్రాచీనమైనది అని తెలుసుకోవాలి. శాశ్వతంగా ఉండేదే సనాతన ధర్మం.

**2. భగవాన్ శ్రీ విఖనస మహర్షి గురించి, ఆయన వైభవం గురించి తెలియచేస్తారా?**

**- బి.హెచ్.వెంకటేశ్వరరావు, హైదరాబాద్**

జవాబు – శ్రీ విఖనస మహర్షి ప్రాతః స్మరణీయుడు, కారణజన్ముడు. తిరుమలలో వైఖానస ఆగమం ప్రకారమే అర్చన, ఆరాధనలు జరుపుతారు. శ్రీ విఖన మహర్షి సగుణోపాసన, నిర్గుణోపాసన అని రెండు విధములుగా విభజించారు. గృహ దేవతార్చనను స్వార్థ పూజగాను, దేవాలయ అర్చన పూజ పరార్థ పూజ అని స్పష్టం చేశారు. ఇక నిర్గుణోపాసనలో జప, హోమ, తప, యోగాదులు ఉంటాయని, వాటిద్వారా భగవత్ కృప పొందవచ్చునని తెలిపారు. భగవాన్ శ్రీకృష్ణులవారి వలెనే శ్రీ విఖనసులు "సర్వ వ్యాపీ నారాయణః" అని చెప్పారు. భగవానుడు అందించిన విషయ సమాహారాన్ని చిన్న చిన్న సూత్రాలతో, గంభీరమైన భావాలతో వివరించిన మహానుభావులు. ఆయన మనకందించిన శ్రీ వైఖానస కల్పసూత్రంతో మన జన్మ సాఫల్యమౌతుంది. భగవద్గీత వెన్న అయితే, ఇది రుచికరమయిన నెయ్యి వంటిదని, అందరికీ అందుబాటులో ఉన్న పరమాత్మకు మనల్ని దగ్గరగా చేర్చే గొప్ప సాధనమని పెద్దలు చెప్తారు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు.**
**భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

# కమనీయం - రమణీయం - మహనీయం

# ఆమలక ఏకాదశీ వైశిష్ట్యమ్

– చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో ॥ "అజం వరేణ్యం వర పద్మనాభం**
**నారాయణం బ్రహ్మనిధిం సురేశమ్**
**తం దేవ గుహ్యం పురుషం పురాణం**
**వందేమ్యహం లోక పతిం వరేణ్యమ్"**

అజుడు, వరేణ్యుడు, శ్రేష్ఠుడు, పద్మనాభుడు, నారాయణుడు, బ్రహ్మనిధి, సురేశుడు, దేవగుహ్యుడు, పురాణపురుషుడైన ఆ దేవదేవునికి వందనమాచరించుచున్నాను.

ఫల్గుణీ నక్షత్రములో కూడి పున్నమిగల మాసాన్ని ఫాల్గుణ మాసమని అంటారు. వినీలాకాశంలో శ్వేతవర్ణంలో దండాకారంగా ప్రకాశిస్తున్న రెండు నక్షత్రాలతో కూడిన మండలమే ఫల్గుణీ నక్షత్రం. పూర్ణిమ రోజున ఈ నక్షత్రంతో చంద్రుడు ఉంటే ఏర్పడే మాసాన్ని ఫాల్గుణ మాసమని అంటారు. సూర్యుడు సాధారణంగా ఫాల్గుణ మాసంలోనే మీన రాశిలో ప్రవేశిస్తాడు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసాల్లో ఈ మాసం ఒకటి. తెలుగు సంవత్సరాలలో చివరిది. ఈ మాసంలో పరశురామ జయంతి, హోళీ మొదలైన పండుగలు వస్తాయి.

తిథులలో పదకొండవ తిథిని ఏకాదశి అని అంటారు. మనకు సంవత్సరంలో 24 ఏకాదశులు వస్తాయి. ఏకాదశి శ్రీమన్నారాయణునకు అత్యంత ప్రీతికరం. గంగతో సమానమైన తీర్థం, మాతృసమానమైన గురువు, విష్ణుసమమైన దైవం, నిరాహారమును మించిన తపము, ఏకాదశిని మించిన తిథి లేదని పురాణాలు పేర్కొంటున్నాయి. ఏకాదశి విష్ణువుకు ప్రీతికరమైనందున 'విష్ణువాసరం' అని కూడా పిలుస్తారు. అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు, మనసు – మొత్తం పదకొండింటి యందు భగవంతుని లగ్నం చేసి సేవించిన వారికి తప్పక ముక్తి లభిస్తుంది. ఈ సత్యాన్ని తెలియ చేసేందుకే ఏకాదశికి అంతటి ప్రాముఖ్యత కలిగింది.

"ఏకాదశి నామ సర్వకామ ఫలప్రదం కుర్వన్తి సర్వదా". సర్వకామితములు తీర్చగలదు ఈ తిథి. ఈ రోజున "ఏకాదశ్య ముపవసేనన కదాచితి క్రమేత్". ఏకాదశినాడు విగ్రహారాధన, ఉపవాసముండుట మున్నగునవి ముఖ్యమైనవి. మనిషి ఇంద్రియములకు అధీనుడై ప్రవర్తిస్తాడు. సుఖభోగాలు మనిషిని



దైవానికి దూరం చేస్తాయి. ఉపవాసాది కఠిన నియమాల వల్ల ఇంద్రియాల ప్రభావం తగ్గి ఆధ్యాత్మిక సాధనలకు మార్గం సుగమమవుతుంది. ఉచ్ఛ్వాసం, నిశ్వాసములలో దైవచింతన ఇమిడిపోవాలి. మనస్సు నిర్మలంగా ఉండి సదా భగవద్భజన యందు విహరించాలి. హరినామ స్మరణ నిరంతరం చేస్తుండాలి. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను త్యజించాలి. పరనింద చేయరాదు. అసందర్భపు ప్రేలాపనలు పనికిరాదు. అప్పుడే సర్వకామితములు ఈడేరుతాయి. ఏకాదశి తిథికి సార్థకత ఏర్పడుతుంది.

ఫాల్గుణమాస శుక్లపక్ష ఏకాదశిని "ఆమలక ఏకాదశి" అంటారు. "ఆమలకం" అంటే ఉసిరిక. ఈ చెట్టును శ్రీమహావిష్ణువు స్వరూపంగా భావిస్తారు. ఆమలకం (ఉసిరిక) ప్రాధాన్యత ఉన్న ఏకాదశి కాబట్టి ఈ ఏకాదశికి అమలక్యేకాదశి అనే పేరు వచ్చింది. అంతేకాక ఈ రోజును "మోదన్యైకాదశి" అని కూడా అంటారు. "మంజు ఘోష" అనే అప్సరస, మేధావి అనే మహర్షికి తపోభంగం చేసి శాపానికి గురవుతుంది. ఫాల్గుణ ఏకాదశి రోజున శాపవిమోచనం పొందుతుంది. అప్పటినుంచి ఈరోజు 'మోదన్యైకాదశి'గా పేరు పొందింది. ఈనాడు ఉపవాస వ్రతం పాటించి విష్ణువును పూజించడం వల్ల ఇహ పర సౌఖ్యాలు లభిస్తాయి.

అమలక ఏకాదశి నాడు ప్రాతఃకాలముననే అనగా బ్రాహ్మీ ముహూర్తంలో నిద్ర లేచి నారాయణునకు నమస్కరించి కాలకృత్యములు తీర్చుకుని స్నాన సంధ్యాదులను పూర్తి చేసుకొని ఉతికిన శుభ్రమైన వస్త్రములను ధరించాలి. నుదుటన విభూతిని ధరించి కనుబొమల నడుమ భాగాన చందనమును ధరించి కుంకుమ బొట్టు పెట్టుకొని గణపతికి నమస్కరించి స్వామి ఆశీస్సులను పొందాలి. గోమయంతో పూజాగృహాన్ని శుభ్రం చేసి మంటపాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఉసిరిక వృక్ష సమీపాన గోమయంతో అలికి రంగవల్లులను తీర్చిదిద్దాలి. ఉసిరిక వృక్షపు నీడలో విష్ణుమూర్తి చిత్రపటాన్ని గాని, విగ్రహమును గాని ఉంచి అర్చనలు చేయాలి. పసుపుతో గణపతిని తయారు చేసుకొని భక్తిశ్రద్ధలతో పువ్వులు, గరిక, చందనం, మారేడులతో అర్చించాలి. గణపతికి ప్రీతికరంగా వడపప్పు, పానకం, అరటిపండ్లను నివేదన చేయాలి. అనంతరం విష్ణుమూర్తిని అష్టోత్తర శతనామాలతో పూజించి విష్ణు సహస్ర నామమును పఠించాలి. పాలను, అరటిపండ్లను నివేదన చేయాలి. ఉసిరిక చెట్టును పసుపు కుంకుమలతో పూజించి హారతినిచ్చి ''ధాత్రీదేవీ నమస్తుభ్యం సర్వపాపక్షయంకరి పుత్రాన్ దేహి మహాప్రాజ్ఞే యశోదేహి బలం చమే ప్రజ్ఞాం మేధంచ సౌభాగ్యం విష్ణుభక్తిం శాశ్వతం వీరోగం కురుమాం నిత్యాం నిష్టాపరా కురు సర్వదా'' అనే శ్లోకాన్ని పఠిస్తూ ప్రదక్షిణలు చేయాలి. అరటిపండ్లను నివేదన చేసి పూలమాలలతో అలంకరించాలి. ధూపాన్ని వెలిగించి ముమ్మారు చూపించి హారతినివ్వాలి. విష్ణుమూర్తికి నమస్కరించి –

**"ఏకాదశ్యాం నిరాహారో భూత్వాహమ పరేహని**
**భోక్ష్యామి పుండరీకాక్ష శరణం మే భవాచ్యుత"**

''ఓ పుండరీకాక్షా! నీకు ఎంతో ప్రీతిపాత్రమైన ఈ ఏకాదశి నాడు ఉపవాసం ఉండి, ద్వాదశి నాడు భోజనం చేస్తాను. నీ శరణు కోరిన నాపైన దయ ఉంచు'' అని సంకల్పించి ఏకాదశి ఉపవాసం చేయాలి. ''ఓం నమో నారాయణాయ'' (లేక) ''ఓం నమో భగవతే వాసుదేవాయ'' అంటూ మన శక్తిమేర జపం చేయాలి. శక్తి ఉన్నవారు పై రెండు మంత్రములను భక్తితో, తాదాత్మ్యముతో జపము చేయవచ్చు.

ద్వాదశి రోజున యథావిధిగా పూజాదికములను పూర్తి చేసుకొని అన్నదానం చేయాలి. శక్తి లేనివారు భాగవతోత్తముడైన బ్రాహ్మణుని పిలిచి ఆ బ్రాహ్మణునిలో నారాయణుని తిలకించి భక్తి శ్రద్ధలతో పూజించి భోజనము పెట్టాలి. ద్వాదశి రోజున యాదృచ్ఛికముగా నృసింహ ద్వాదశి రావడంతో ఆ స్వామిని సకల ఉపచారాలతో అర్చించాలి. ఈ రోజున చేసే గంగాస్నానం అక్షయ ఫలితాలను ఇస్తుందని, ఆ కారణంగా ఈ రోజును పాపనాశన ద్వాదశి అంటారని బ్రహ్మాండపురాణం చెబుతోంది.

అమలక వృక్షము జనార్దన స్వరూపం. ఈ వృక్షమును తాకితే రెండు రెట్లు, తింటే మూడు రెట్లు పుణ్యం లభిస్తుందని శాస్త్ర వచనం.

**"తస్య మూలే స్థితో విష్ణుస్త దూర్ధ్వంచ పితామహః**
**స్కందేచ భగవాన్ రుద్రః సంస్థితః పరమేశ్వరః**
**శాఖా సమనయః సర్వే ప్రశాఖా నుచ దేవతాః**
**పర్ణేషు వసనోదేవాః పుష్పేషు మరుతస్తథాః"**

అమలక వృక్షములో విష్ణువు, దానిపైన బ్రహ్మ, స్కందములో పరమేశ్వరుడు, శాఖల యందు మునులు, కొమ్మల యందు దేవతలు, పత్రముల యందు వసువులు, ఫలముల యందు ప్రజాపతులు నివాసముంటారని శాస్త్ర వచనం. అందువలననే అమలక ఏకాదశి నాడు ఏ దానము చేసిననూ అధిక పుణ్యము లభిస్తుంది. శంకరాచార్యులు ఇల్లిల్లూ తిరుగుతూ భిక్షాటనము చేయుచు ఒకానొక ఇంటి వద్దకు వెళ్ళి భిక్ష యడుగగా ఒక పేద గృహిణి వారికి ఉసిరికాయను భిక్షగా పెట్టింది. ఆమె పరిస్థితిని గమనించిన శంకరాచార్యులవారు లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ కనకధారా స్తవము చేశారు. శంకరాచార్యుల ప్రార్థనకు మెచ్చి లక్ష్మీదేవి ఆమె ఇంట బంగారు ఉసిరికాయల వర్షమును కురిపించింది. శంకరాచార్యులు గావించిన అమ్మవారి స్తుతి కనకధారా స్తోత్రముగా ప్రసిద్ధి కెక్కింది. ఆమలక ఏకాదశికి సంబంధించిన కథ ఈవిధంగా ప్రచారంలో ఉంది.

పూర్వకాలాన కావేరీనదీ తీరాన దేవశర్మ అను బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు వేద వేదాంగ శాస్త్ర పారంగతుడు. అతనికొక కుమారుడు ఉన్నాడు. ''పండిత పుత్రః పరమశుంఠః'' అను నానుడి ప్రకారం ఆ కొడుకు దురాచారుడు. అతడిని మంచి మార్గములో పెట్టడానికి తండ్రి అతడికి హితబోధ చేయసాగాడు. ''కుమారా! ఈ మాసం విష్ణువుకు ఎంతో ప్రీతికరం. కావున నీవు దానము, జపము, వ్రతము, సంధ్య మున్నగు వాటిని నియమ నిష్ఠలతో ఆచరింపుము. శివకేశవులకు దీపదానం, నమస్కార ప్రదక్షిణలు గావింపుము. భగవంతుని అనుగ్రహం వలన నీకు సద్బుద్ధి లభిస్తుంది. సదాచారుడిగా మారిపోతావు'' అని తండ్రి గావించిన హితబోధ ఆ కొడుకుకు అమితమైన ఆగ్రహమును కలిగించింది. ''నీవు చెప్పినవన్నీ నేను చేయను'' అని దురుసుగా జవాబిచ్చాడు.

తనయుని దురుసు ప్రవర్తనకు ఆగ్రహం చెందిన దేవశర్మ ''దుర్బుద్ధీ! నీవు వృక్షపు తొర్రలో మూషికములా జీవించు'' అని శాపమునిచ్చాడు. తండ్రి ఇచ్చిన శాపమును విని తనయుడు భీతిల్లినాడు. తండ్రి పాదములపై పడి ''తండ్రీ! నా దుష్ప్రవర్తనకు నన్ను క్షమించు. నాకు శాపవిమోచనము ప్రసాదించుమని ప్రాధేయపడసాగాడు. ప్రసన్నుడైన దేవశర్మ తనయునితో ''నీవు నివసించే ప్రాంతానికి విశ్వామిత్ర మహర్షి తన శిష్యులతో నదీ స్నానం నిమిత్తమై వచ్చి శిష్యులకు విష్ణుపురాణాంతర్గత

విషయములను ఉపదేశిస్తాడు. ఆ ఉపదేశమును విన్నంతనే, ఆ మహర్షిని కన్నంతనే నీకు శాప విమోచనమవుతుంద”ని వివరించాడు. తండ్రి ఇచ్చిన శాపము ననుసరించి దేవశర్మ తనయుడు మూషికముగా మారి చెట్టుతొర్రలో నివసించసాగాడు.

ఒకసారి విశ్వామిత్ర మహర్షి తన శిష్యులను వెంటబెట్టుకుని సంచారం గావిస్తూ దేవశర్మ కుమారుడు నివసించే చెట్టు వద్దకు వచ్చి, ఆ వృక్ష సమీపాన ఉన్న నదిలో స్నాన మొనరించి సంధ్యావందనము గావించి సూర్యభగవానునికి అర్ఘ్యమిచ్చి ఆ చెట్టునీడన కూర్చుండి విష్ణుపురాణ వైశిష్ట్యమును తన శిష్యులకు వివరించసాగాడు. ఆ సమయంలో ఒక బోయవాడు అక్కడికి వచ్చాడు. అతడు కూడా విశ్వామిత్ర మహర్షి ఉపదేశమును వినసాగాడు. చెట్టు తొర్రలో మూషిక రూపములో నివసిస్తున్న దేవశర్మ కుమారుడు విష్ణుపురాణమును విని ఆ పురాణ వైశిష్ట్యము చేత శాప విమోచనమును పొంది విశ్వామిత్ర మహర్షికి నమస్కరించి అక్కడకు వచ్చిన దివ్య విమానమునెక్కి స్వర్గ లోకమునకు వెళ్ళిపోయాడు. బోయవాడు కూడా పురాణ విషయములను విని స్వర్గలోకమునకు వెళ్ళిపోయాడు. ఫాల్గుణ మాసము మహిమాన్వితమైనది. అమలక వృక్షము మొదలులో సాలగ్రామమును ఉంచి భగవంతుని పూజించాలి. తులసి మాలను ధరించాలి. దీపారాధన చేయాలి. ఈవిధముగా చేసినట్లయితే లక్ష్మీనారాయణుల అనుగ్రహము ప్రాప్తిస్తుంది. ఇంతటి విశిష్ట గుణము గలది అమలక భక్షణము.

ఉసిరికను వైద్యపరంగా, ఆరోగ్యపరంగా చూసుకొనిన చాలా మహత్తరమైనది. ఉసిరికలో ‘సి’ విటమిన్ అధికంగా ఉంటుంది. ఒక్క ఉసిరిక రెండు నారింజపండ్లతో సమానము. ఉసిరిక శీతగుణము కలది. జీర్ణశక్తిని పెంపొందింపచేస్తుంది. శరీరపు ఉష్ణమును తగ్గిస్తుంది. కళ్ళమంటలు, పాదముల మంటలను తగ్గిస్తుంది. వీర్యవృద్ధిని కలిగిస్తుంది. మధుమేహ బాధితులకు హితకారి. కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది. ఉసిరికను పూజించి, నమస్కరించి భుజించి జీవితమును ధన్యము చేసుకుందాము.

**సర్వేజనా – సుఖినో భవంతు**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



‘శ్రీ వేంకటేశం’ మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com





# ఉగాది పర్వదినం

- డాక్టర్ దేవులపల్లి పద్మజ
ఫోను 9849692414

**ఉగాది**

ఈ సృష్టి యావత్తు బ్రహ్మదేవుడు తన భూత సృష్టిని ప్రారంభించిన "సృష్ట్యాది" నుంచి లేక ఈ కలియుగం ప్రారంభం మొదలు నుండి పంచాంగాలలో లెక్కించటం వాడుకగా వస్తున్న ఆచారం. ఈ బ్రహ్మ సృష్టిలో ప్రళయం అయిపోయిన తరువాత తిరిగి ఆరంభించే అధ్యాయాన్ని బ్రహ్మ కల్పం అని అంటూ ఈ ప్రారంభకాలాన్ని "కల్పాది" అని వ్యవహరిస్తారు. ప్రతి కల్పంలోను మొదట వచ్చే "ఆది" సమయమే "ఉగాది" పండుగ. దీనిని గురించి "సూర్యసిద్ధాంతము" అనే జ్యోతిష గ్రంథంలో స్పష్టంగా చెప్పబడినది. నాటి నుండి నేటి వరకు ఈ పద్ధతినే అనుసరిస్తూ ప్రతి తెలుగు సంవత్సర ఆరంభదినం నాడు మనం ఉగాది పర్వదినం జరుపుకునే ఆచారం ఏర్పడింది. "యుగాది" అన్న సంస్కృత పదము యొక్క ఉచ్చారణ భేదం వలన "ఉగాది" అనే తెలుగు మాట ఏర్పడింది.

**చైత్రేమాసి జగద్బహ్మ ససర్జ ప్రథమే అహని**
**వత్సరాదౌ వసంతాదౌ రసరాద్యే తథైవచ !!**

సృష్టి ప్రభవం అయిన మొదటి సంవత్సరం నుండి చరితార్థంగా "ప్రభవ" అని నామకరణం చేసి అక్కడి నుంచి "క్షయ" నామ సంవత్సరం క్రమంలో 60 నామాలతో సంవత్సర గమనం సాగుతుంది. క్షయ నామ సంవత్సరంతో సమాప్తమవుతుంది. కనుకనే మనం జన్మించిన మొదలు ఈ నామ చక్రం మనకు 60 సంవత్సరముల వయస్సుకు చేరినపుడు తిరిగి అదే సంవత్సరంచే పూర్తి అగుటచే షష్టిపూర్తి జరుపుకుంటాం.

వేదాలను హరించిన సోమకుడు అనే రాక్షసుని వధించి శ్రీ మహావిష్ణువు తిరిగి పునరుద్ధరించిన రోజుగా కూడా ఉగాది ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. తెలుగు సంవత్సరం చైత్రం నుండి శిశిరం వరకు ఆరు ఋతువులుగా విభజించబడినది. సంవత్సరం పొడవునా అనేక ఒడుదుడుకులు అనుభవించిన ప్రకృతిలో చెట్లు శిశిర ఋతువులో ఆకులు రాల్చి జడత్వాన్ని పొందుతాయి. చైత్రమాసంలో క్రొత్త చిగుర్లు తొడిగి చైతన్యవంతంగా కనిపిస్తాయి. ఈ విధంగా ప్రకృతిలో సంభవించే నూతన వత్సరం చైత్రమాసం. అందుకే ఈ మాసారంభానికి ఉగాది అని పేరువచ్చినదని చెప్పుకోవచ్చును. ఇది మనలో కూడా నూతన ఉత్తేజాన్ని కలిగించి నవనవోన్మేషంగా ముందుకు తీసుకుపోవటానికి దోహదం చేస్తుంది.

ఉగాది పర్వదినాన అభ్యంగనము, పుణ్యకాల సంకల్పం, ఉగాది పచ్చడి సేవనం, ధర్మకుంభం, సృష్టి క్రమ వర్ణన, కల్పాది వైవస్వత మన్వంతర వివరములతో కూడిన పంచాగ శ్రవణం అనే ముఖ్యమైన విధులను అనుసరించవలసి ఉంటుంది.

**అభ్యంగనము**

సూర్యోదయానికి పూర్వమే నువ్వులనూనె తలకి పట్టించి ఉసిరిక, పెసరపిండి, మ్రానిపసుపు, భావపంచాలు, కచ్చూరాలు మొదలైన వాటిని ఉపయోగించి శిరస్నానం చేయాలి. ఈ దినం వేడినీటి స్నానం శ్రేష్ఠం. అనంతరం తిలకము దిద్దుకుని, నూతన వస్త్రములు ధరించి సంకల్పం చెప్పుకొనవలెనని ధర్మసింధువు తెలియచేస్తోంది.

**పుణ్యకాల సంకల్పము**

సూర్యోదయానికి ఒక ముహూర్తకాలం (20 నిమిషాలు) మాత్రమే పాడ్యమి ఉన్నా సరే ఆ రోజునే పండుగ సందర్భ సంకల్పం చెప్పుకుని ప్రారంభించాలి. సూర్యునికి అర్ఘ్యము, దీపం, ధూపం, పుష్పాంజలి సమర్పించాలి.

ఈ సంకల్పములో ముఖ్యమైన దేశము, కాలము ధ్యానించి, బ్రహ్మ యొక్క సృష్టి సంకల్పము యొక్క సంకల్ప సిద్ధిని ధ్యానించి, మనము తలపెట్టిన కార్యక్రమాలకు శుభ ఫలితాలు

ఇవ్వాలని కోరుకుంటారు. హైందవ సంకల్ప మంత్రాలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఈ సాంప్రదాయ కృత్యములో ముందుగా స్మరించే 'శ్వేత వరాహ కల్పం' అనబడే ఈ 'బ్రహ్మకల్పము' యొక్క సంకల్పము. ఇది పంచాంగ గణితమంతటికీ ఆధారభూతమైనది.

"శ్రీ మహావిష్ణోరాజ్ఞాయ ప్రవర్తమానస్య ఆద్య బ్రహ్మణః ద్వితీయ పరార్ధే శ్వేత వరాహ కల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే........." అని వేద కాలమానము తెలుపుతూ ఆచరించవలెను.

ప్రస్తుతము నడిచే వైవస్వత మన్వంతరము ఏడవది. సూర్యుని పుత్రుడైన వైవస్వత మనువు పరిపాలన ప్రారంభమైన ఈ మన్వంతరములో 2 మహాయుగములు గడచినవి. ప్రస్తుత కలియుగము 18-12-3102 బి.సి.లకు సరిపోయినవని చెప్పబడినది. 7 గురు మనువులు ప్రారంభ తిథులు కూడా వేదమునకు ఉపాంగమైన జ్యోతిష శాస్త్రము వల్ల నిరూపించబడినది. ఈ విధముగా ఒక మహాయుగములో 43,20,000 సంవత్సరములు ఉండునని శాస్త్రీయముగా ఖగోళ గణితుల వలన నిరూపితమైనది.



**ఉగాది పచ్చడి సేవనం**

తరువాత జరిపే అత్యంత ముఖ్యమయిన కార్యక్రమం ఉగాది పచ్చడి స్వీకరణ. దీనిని పరగడుపునే స్వీకరించాలి. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాదిపచ్చడికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. తీపి, వగరు, చేదు, కారం, పులుపు, ఉప్పు వంటి షడ్రుచులు కలసిన ఉగాది పచ్చడి మన సొంతం. ఈ పచ్చడి ప్రాముఖ్యాన్ని వర్ణించటం బహు కష్టము. ఎంతో మంది కవులు, పండితులు, శాస్త్రకారులు ఉగాది పచ్చడి ప్రాశస్త్యాన్ని అమోఘంగా వివరించారు. ప్రతీ మనిషి తన జీవితంలో ఎదుర్కొనే వివిధ అనుభవాలకు ప్రతీకగా దీనిని భావిస్తారు. ఈ పచ్చడి తయారుచేసుకోవటానికి, చెరకు, మామిడికాయలు, వేపపువ్వు, అరటి పళ్ళు, లవణం, చింతపండు, బెల్లం, పచ్చిమిరప మొదలైనవి వాడతారు. చూత కుసుమము, అశోక చిగురులు కలిపి సేవించే సాంప్రదాయము మనకు ఇప్పటికీ కనిపిస్తూ ఉంటుంది.

**శాతయుర్వజ్రదేహాయుః సర్వ సంపత్కరాయచ**
**సర్వారిష్ట వినాశాయ, నింభ కుసుమ భక్షణం !**
**త్వామష్టశోక నరాభీష్ట! మధుమాస సముద్భవ !**
**విభావి శోక సంతప్తాం మామశోకం సదాకురు !!**

ఈ వేప పూత లేహ్య భక్షణం సర్వారిష్టాలను నివారించి సర్వ సంపదలను కలిగించే అదృష్టాన్ని వృద్ధి చేసి, దీర్ఘాయువు, వజ్రము వంటి దేహము ప్రసాదిస్తుందని తెలియజేస్తుంది. వసంతంలో చిగురించే ఓ అశోక కలికమా! జీవితంలో శోకాలతో బాధపడుతున్న నాకు శోకము లేకుండా చేయగలవు గాక!

**ధర్మకుంభము**

రానున్న రోజులలో పూర్ణ మనోరథసిద్ధి మరియు సకల సౌభాగ్యాలు కలుగుతాయనే సంకల్ప బలంతో పంచలోహాల పాత్రగాని, మట్టికుండగాని కలశముగా తీసుకుని సుగంధ జలము, చందనము మరియు పుష్పాక్షతలు వేసి ఆవాహన చేసి పుణ్యాహ మంత్రములతో బియ్యము పోసిన ఒక పళ్ళెములో కలశము ఉంచి నూతన వస్త్రము చుట్టి ఉపరి భాగమున నారికేళము ఉంచి, కుంకుమ, పసుపు చందనములు సమర్పించి పురోహితునకు గాని, గురువునకు గాని లేక గుడిలోని ఇష్ట దైవమునకు గాని దానమిచ్చి వారి ఆశీర్వాదములు పొందాలి. దీనినే "ధర్మఘటదానం" లేక "ప్రపాదనం" అంటారు. ఈ విధి నేటికీ పల్లెలలో ఆచరిస్తున్నారు.

**పంచాంగ శ్రవణము**

మహాపర్వదినాలైన కల్పాది తిథులు, మన్వంతర తిథులు, దశావతార పుణ్యతిథులు మొదలైనవి పంచాంగములో తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ మొదలైన 5 అంగముల కలయికగా చూపబడతాయి. ఈ విధమైన పంచ అంగముల శ్రవణము వలన భవిష్యత్తులో మనకు రానున్న విశేషాలు, పండుగలు, గ్రహణాలు,

వర్షవివరాలు, కాల నిర్ణయాలు మొదలైనవి తెలుసుకోవటం జరుగుతుంది. పంచాంగ శ్రవణంలో ఆ సంవత్సరంలో సాగే ధరవరలు, వర్షపాతములు మొదలైన ముఖ్య సమాచారము కూడా పొందుపరచబడి ఉంటుంది. ఇది రైతులకు, వ్యాపారులకే కాకుండా సామాన్య జనులకు దిక్సూచిగా ఉపయోగపడుతుంది. ఇది ఉగాది రోజును విశేష విధిగా భావించాలి. కనుక హైందవ సాంప్రదాయములో పంచాంగ శ్రవణం ఉగాది తిథి రోజున ప్రాముఖ్యత సంతరించుకున్నది.

**తిథేచ్ఛ, శ్రియమాప్నోతి వారాధాయుష్య వర్ధనమ్**
**నక్షత్రాత్తరతే పాపం, యోగాద్రోగ నివారణమ్**
**కరణత్కార్య సిద్ధిస్తు, పంచాంగ ఫలముత్తమమ్**
**కాల విత్కర్మ కృద్ధీమాన్ దేవతానుగ్రహం భవేత్ !!**

తిథి వలన సంపద, వారము వలన ఆయుష్షు, నక్షత్రము వలన పాపపరిహారము, యోగము వలన వ్యాధి నివృత్తి, కరణము వలన కార్యానుకూలత సిద్ధించును. కాలము తెలిసి కర్మము చేయు ఆస్తికులు భగవదనుగ్రహము పొంది సుఖమనుభవింతురు.

**తిథిర్వారం చ నక్షత్రం యోగః కరణమేవచ**
**పంచాంగస్య ఫలం శృణ్వన్ గంగాస్నాన ఫలం లభేత్!!**

రామాయణాది పవిత్ర గ్రంథ పఠనము వలన వచ్చే విశేష ఫలము ఈ పంచాగ శ్రవణము వలన కూడా పొంద వచ్చును.

**కన్యావనా కాంచన దిగ్గజానాం సహస్రమయుతం సతతం**
**ద్విజేభ్యః దత్వా ఫలం యల్లభేతే మనుష్యః**
**తత్తత్ఫలాన్యబ్దఫలంచ శృణ్వాన్**
**ఆయుర్వృర్ధం పుత్ర పౌత్రాభి వృద్ధిం**
**నిత్యారోగ్యం సంపదంచానపాయం**
**అచ్ఛినానామక్షదానా మహసిం**
**యచ్ఛంత్యేతీ వత్సతేరాధీశముఖ్యా !!**

భూమి, స్వర్ణము, ఏనుగులు, గోవులు, సర్వ లక్షణ యుక్తమైన కన్యను ఉత్తముడైన పాత్రునకు దానం చేస్తే కలిగినంత ఫలితముతో సమానము. శాస్త్రవిధిగా పంచాంగ శ్రవణము చేయుటవలన సూర్యునిచే శౌర్య తేజస్సులు, చంద్రునిచే భాగ్య వైభవములు, కుజునిచే సర్వ మంగళములు, బుధునిచే బుద్ధి వికాసము, గురునిచే గురుత్వ మరియు జ్ఞానములు, శుక్రునిచే సుఖము, శని దేవునిచే దుఃఖ రాహిత్యములు, రాహునిచే ప్రాబల్యము, కేతువుచే తన వర్గములో ప్రాముఖ్యత కలుగునని శాస్త్ర వచనము.

తెలుగు వారు ఉగాది పర్వదినాన్ని అత్యంత ఉత్సాహంతో, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ రోజు తమ తమ ఇంటిని పరిశుభ్రం చేసుకుని, మామిడి తోరణాలతో, రంగు రంగుల రంగవల్లులతో శోభాయమానంగా అలంకరించుకుంటారు. ప్రాంతాలవారీగా తమ తమ పంచాంగాలను, ఆచార వ్యవహారాల ననుసరించి జరుపుకుంటున్నప్పటికీ, క్రొత్త మాసారంభ సంకేతంగా మాత్రము ఉగాది జరుపుకుంటున్నారని మాత్రము గుర్తించవచ్చును. ఋతువులు కాలధర్మానికి సంబంధించినవి. రామాయణ కాలంలో వైశాఖ, జ్యేష్ఠాలు వసంత ఋతువుగాను, మహాభారత కాలంలో చైత్ర, వైశాఖ మాసాలు వసంత ఋతువుగాను పరిగణింపబడేది అని మనకు తెలుస్తోంది. తెలుగు వారు చాంద్రమానాన్ని ప్రమాణంగా స్వీకరిస్తారు. జ్యోతిష శాస్త్రాన్ని అనుసరించి పూర్ణిమ తిథిలో సంభవించే నక్షత్ర ఆధారంగా మాస నిర్ణయం జరుగుతుంది. ఆ విధంగా చిత్తా నక్షత్రంతో కలసిన పూర్ణిమ తిథిని మనం చైత్రమాసంగా భావించటం జరుగుతుంది. కొన్ని ప్రాంతాలలో సౌరమానం కూడా ప్రామాణికంగా తీసుకోవటం జరుగుతోంది. ఏది ఏమైనా తెలుగు వారు జరుపుకేనే ఉగాది పర్వదినం చైత్రమాస తొలి రోజుతో ప్రారంభం అవుతుంది.

మన హైందవ సంప్రదాయములో పండుగలకు విశేష స్థానముంది. బంధుమిత్రుల సమాగమనం, దైవ సందర్శనం, పేదలకు దానధర్మాలు, పశుపక్ష్యాదుల పూజలు మొదలైనవి ముఖ్యంగా కనబడతాయి. స్నేహ సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తాయి. ధార్మిక వాతావరణం అభివృద్ధి చెంది సామరస్య భావాలు పెరుగుతాయి. భగవంతుడు సృజించిన ఆహారంతో అందరికీ బ్రతికే అధికారం వుంటుంది కనుక పేదలు కూడా తగిన ఫలాలు అనుభవించగలుగుతారు. ప్రకృతి పరిరక్షణ కూడా ఒక అంశమౌతుంది కనుక వాతావరణ సమతుల్యత ఏర్పడుతుంది. క్రొత్త రుచులతో ఆహారం సేవించటం వల్ల శారీరక దౌర్బల్యాలు తొలగి కొత్త ఉత్సాహం పెరుగుతుంది. అభ్యంగన స్నానము చేయటం, క్రొత్త దుస్తులు ధరించటం వలన శారీరక కాంతి వృద్ధి చెందుతుంది. పండుగల వలన ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అనేక మంది వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

ఈ విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభం తెలుగు సంవత్సర క్రమంలో 39వది.

సంవత్సర ఫలితాలు సాధారణంగా నవనాయకుల సంచారం, గ్రహణాలు, మౌఢ్యాలు మొదలైన వాటి ననుసరించి నిర్ధారితమౌతాయి. ఆయా సంవత్సరాలలో జన్మించిన వ్యకులయొక్క స్థూల జాతక ఫలితాలను కూడా ఆయా సంవత్సరాల లక్షణాలను కొంత వరకు ప్రతిబింబిస్తాయి. కాని ప్రధానంగా జన్మించిన సమయానికున్న వారి వ్యక్తిగత జాతకాల ననుసరించి ఫలితాలు నిర్దేశితమౌతాయి.

విశేషమైన సత్ఫలితాలను అందించే ఉగాది అందరి మనోభీష్టములను నెరవేర్చి, సుఖ శాంతులు అందించాలని కోరుకుందాం.

**సర్వేజనాః సుఖినోభవన్తు!!**

# ప్రదక్షిణ

- డా॥ మునిపల్లె బాలసుబ్రహ్మణ్య శర్మ

భారతీయ సంస్కృతిలో ప్రదక్షిణ, నమస్కారము, జపము, ఉపవాసము, వ్రతము, పసుపు, కుంకుమ, ధూపము, దీపము, నైవేద్యము, శంఖానాదము, ఘంటానాదము, మడి ఇలా అనేక విషయాలకు ఎంతో విలువ, గౌరవము, ప్రాధాన్యత ఉన్నాయి. మన సంస్కృతిలో ఉన్న ప్రతి విషయానికి, ఆచారానికి, అలవాట్లకి గొప్ప అర్థం ఉంది. వాటిలో గొప్ప వైజ్ఞానికత, ఆరోగ్యపరమైన సూచనలు, నేటి సైన్సుకు అందని అనేక రహస్యాలు, వాటి నిరూపణలు ఇలా ఎన్నెన్నో ఉన్నాయి. వాటిలో దాగి వున్న సత్యాన్ని, రహస్యాల్ని తెలుసుకుని ఆచరించే ప్రయత్నం చేయడానికే ఈ వ్యాసాలు పరిచయం చేయడం.

**ప్రదక్షిణ**

మనం పూజలు చేసుకున్న తరువాత గాని, పారాయణలు, వ్రతాలు, నోములు వంటివి చేసుకున్న తరువాత గాని, దేవాలయాలకు వెళ్ళినప్పుడు గాని, ఆత్మ ప్రదక్షిణలు, ప్రదక్షిణలు చేస్తూ ఉంటాము. ఈ ప్రదక్షిణలు ఎందుకు చేయాలో అగస్త్య మహర్షి ఋషులతో ఇలా చెప్తున్నాడు.

**శ్లో ॥ "సర్వపాపహరం చైవ సర్వదాన ఫలప్రదమ్ ।**
**సర్వరోగ ప్రశమనం చరేత్తస్మాత్ ప్రదక్షిణమ్" ॥**

అంటే ప్రదక్షిణము అన్ని పాపాలను నశింపచేస్తుంది. సర్వదానాలు చేసిన ఫలము కలుగుతుంది. సర్వరోగములు నివారించబడతాయి. కాబట్టి ప్రదక్షిణములను చేయాలి. ప్రదక్షిణమనేది కొన్ని సంకేతముల సమూహము. ఎలాగంటే –

**శ్లో ॥ ప్ర ఛ్ఛినత్తి భయం సర్వం, ద కారో మోక్ష సిద్ధి దః ।**
**క్షి కారాత్ క్షీయతేరోగో, ణ కారః శ్రీ ప్రదాయకః ।**
**ప్రదక్షిణార్థం సంయోగాన్ ప్రదక్షిణమితి స్మృతమ్ ॥**

ప్ర – అనే అక్షరం – భయముల నన్నింటిని తొలగిస్తుంది.
ద – కారం – మోక్ష సిద్ధిని కలిగిస్తుంది.
క్షి – కారం – సర్వ రోగాలను క్షీణింప చేస్తుంది.
ణ – కారం – శ్రీని అనగా సంపదలను కలిగిస్తుంది.

పైన చెప్పబడిన అన్ని ప్రయోజనాలు కలగడానికి కూర్చబడినదే ప్రదక్షిణ. ప్రదక్షిణ ఎటు నుండి ఎటు తిరగాలి అంటే –

ప్రదక్షిణ లోని 'దక్షిణ' అనేది 'కుడి' వైపును సూచిస్తుంది. ఎలాగంటే దక్షిణ హస్తం అంటే కుడి చేయి అని అర్థం. మనం భగవంతునికి ఎదురుగా నిలబడినప్పుడు భగవంతుని కుడి చేయి ఎటు ఉంటుందో అటువైపు నుంచి మనం ప్రదక్షిణ చేయాలని గ్రహించాలి. (ఇప్పటి కాలానికి అర్థమవాలంటే క్లాక్ వైజ్‌గా చేయాలి).

ఈ ప్రదక్షిణమును ఆచరించడానికి మనం పాటించాల్సిన నియమాలను నాలుగు అంగాలుగా తెలియజేశారు.

**శ్లో ॥ "పదాత్ పదాన్తరం గచ్ఛేత్, కరౌ చలన వర్జితౌ ।**
**స్తుతిర్వాచి, హృది ధ్యానం చతురంగ ప్రదక్షిణమ్ ॥**

అంటే –

1. ప్రదక్షిణను మొదలుపెట్టినప్పటినుండి కాలితో నడుచుటకు అడుగు వేసిన తరువాత దాని వెనుకనే ఇంకొక అడుగు, దాని వెనకనే ఇంకొక అడుగు అట్లా అడుగు వెనక అడుగు వేసుకుంటూ నడవటం.
2. చేతులు కదల్చకుండా ఉంచటం. ఎలా అంటే నమస్కార ముద్రలో ఉంచి అడుగులు వేయటం.
3. భగవంతుని మనకు తెలిసిన, మనకు వచ్చిన స్తుతులు, స్తోత్రాలు లాంటివి గానం చేస్తూ వెళ్ళటం.
4. మనస్సులో భగవంతుని ధ్యానించుకోవటం.

ఇలా చేస్తూ ప్రదక్షిణలు చేయాలి. ఇవే ప్రదక్షిణకు ఉన్న నాలుగు అంగాలు. ఇంకా మనకు ప్రదక్షిణ చేసే విధానాన్ని తేలికగా తెలుసుకోవడానికి ఇలా చెప్పారు.

**శ్లో ॥ ఆసన్న ప్రసవా నారీ, తైలపూర్ణం యధా ఘటమ్ ।**
**వహన్తి శనకై ర్యాతి తథా కుర్యాత్ ప్రదక్షిణమ్ ॥**

నెలలు నిండిన గర్భిణీ స్త్రీ నూనెతో నింపిన పాత్రను (కుండను) పట్టుకుని దానిలో నూనె ఎక్కడ తొణికిపోతుందో అని ఎంత మెల్లగా నడుస్తుందో అలా ప్రదక్షిణము కూడా అంత మెల్లగా అడుగులు వేస్తూ చేయాలి. పైన చెప్పిన శ్లోకాల సారాంశం – ప్రదక్షిణం చేసేటప్పుడు భక్తి శ్రద్ధలతో చేయాలి గాని, మాట్లాడుతూ, పరధ్యానంగా చేయకూడదు అని తెలుసుకోవాలి.

దేవాలయాలలో చేసే ప్రదక్షిణములకు ఎంత గొప్ప ఫలితం ఉందో స్కాంద పురాణంలో –

**శ్లో ॥ దేవాలయేతు రాజేంద్ర యశ్చ కుర్యాత్ ప్రదక్షిణాం ।**
**ప్రదక్షిణా కృతా తేన స సాగరధరా ధరా ॥**

దేవాలయాలలో ప్రదక్షిణములు చేసినట్లయితే సముద్రములు, పర్వతాలతో కూడిన భూమి అంతా ప్రదక్షిణము చేసినట్లే అని చెప్పబడ్డది.

ఈ ప్రదక్షిణములు మూడు రకములుగా గుర్తించవచ్చు. ఆత్మ ప్రదక్షిణ, దేవాలయ ప్రదక్షిణ, అంగ ప్రదక్షిణ. అంగ ప్రదక్షిణ కూడా దేవాలయ ప్రదక్షిణే. ఈ ప్రదక్షిణలలో దాగి వున్న రహస్యాన్ని గమనిస్తే ఆత్మ ప్రదక్షిణ – భూ భ్రమణానికి అంటే భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ఉండటం. అంగ

ప్రదక్షిణమంటే తన చుట్టూ తాను తిరుగుతూ దేవాలయంలో దేవుని ప్రాంగణంలో ప్రధాన ఆలయం చుట్టూ తిరగడం. అంటే పరిభ్రమణం. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ఉండటం వల్ల పగలు, రాత్రి ఏర్పడుతాయని, సూర్యుని చుట్టూ తిరగడం వల్ల ఋతువులు, అయనములు, సంవత్సరములు ఏర్పడుతాయని, ఇలా కాలచక్రాన్ని సూచించే విజ్ఞానాన్ని ఈ ప్రదక్షిణ రూపంలో నిక్షిప్తం చేసి మన ప్రాచీనులు మనకు అందించారు.

ప్రత్యక్ష దైవాలైన తల్లితండ్రుల చుట్టూ తిరగటం – అంటే ప్రదక్షిణం చేయటం వల్ల భూ ప్రదక్షిణం చేసినట్లేనని విఘ్నేశ్వరుని గణాధిపత్య విషయంలో మనం తెలుసుకున్నాం. గో ప్రదక్షిణ కూడా భూ ప్రదక్షిణతో సమానం. అందునా దూడను కనేటప్పుడు చేసే గో ప్రదక్షిణ మరింత పుణ్యప్రదం.

మూడు లోకాలు ప్రదక్షిణ చేసినంత ఫలితమని ధర్మ శాస్త్రాలు చెప్తున్నాయి. గౌతమ మహర్షి అలా గో ప్రదక్షిణ చేసి కదా బ్రహ్మదేవునిచే అహల్యను పొంది ఇతర మహర్షులకు దక్కని అదృష్టాన్ని పొందాడు.

ప్రదక్షిణ యొక్క ప్రయోజనాలు తెలుసుకున్నారు కదా. కాబట్టి మన పెద్దలు చెప్పిన ఆచారాలు ఆచరిద్దాం. సుఖంగా ఉందాం.

# సంవత్సరంలో మొదటి పండుగ ఉగాది

- కొాతా నిర్మల

తెలుగు సంవత్సరాలు 60 ఉంటాయి. ఒక్కొక్క సంవత్సరానికి 12 మాసాలు ఉంటాయి. ఇంగ్లీషులో సంవత్సరానికి 12 నెలలు ఉంటాయి. ప్రతి తెలుగు సంవత్సరంలో మొదటి నెల, మొదటి తిథి నాడు ఉగాది పండుగను జరుపుకుంటారు. ఉగాది నాడు వేకువనే లేచి, తలంటి స్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి, ఆ పండుగ కోసం ప్రత్యేకంగా తయారు చేయబడిన ఉగాది పచ్చడిని ముందుగా తినాలి. ఆ పచ్చడి షడ్రుచుల సమ్మేళనం. అది తిన్న తర్వాతనే అల్పాహారాన్ని తీసుకోవాలి. ఉగాదినాడు ఇరుగు పొరుగున ఉన్నవారు, మిత్రులు, బంధువులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటారు. దూరాన ఉన్నవారికి గ్రీటింగ్ కార్డులు పంపి తమ అభిమానాన్ని, శుభాకాంక్షలను తెలుపుతారు. తోటివారికి మిఠాయిలు, పిండివంటలు ఇస్తారు. ఆ నూతన సంవత్సరం తాము చేయబోయే పనులను గురించి నిర్ణయించుకుంటారు. మానవ జీవితం శుభాశుభాలు, మంచి చెడులు, సుఖ దుఃఖాల కలయిక. తమకు జరిగే సంఘటనలను గురించి, క్రుంగిపోకుండా, పొంగిపోకుండా, సమానంగా తీసుకోవాలన్నదే ఈ పండుగలోని అంతరార్థం.

ఉగాది పచ్చడిని సన్నగా తరిగిన మామిడికాయ ముక్కలు, కొత్తబెల్లం తరుగు, కొత్త చింతపండు గుజ్జు, వేపపూవు, ఉప్పు, చిటికెడు కారం లేదా మిరియాల పొడి లేదా అతి సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు అన్నింటినీ కలిపి తయారు చేసేదే ఉగాది పచ్చడి. దైవపూజ ముగిసిన తర్వాత నైవేద్యంగా కొబ్బరికాయ, పళ్ళతో పాటుగా ఉగాది పచ్చడిని కూడా సమర్పిస్తారు. ఆ తర్వాత ఇంటిల్లిపాదీ ఆ ఉగాది పచ్చడిని తింటారు. గత సంవత్సరపు కష్టాలను, సుఖ సంతోషాలను, అనుభవాలను, ముఖ్య సంఘటనలను ఉగాది రోజున గుర్తు తెచ్చుకుంటారు. గత సంవత్సరంలో తాము చేసిన తప్పులు పొరపాట్లు ఈ సంవత్సరం చేయకూడదని, వాటిని సరిదిద్దుకోవాలని నిర్ణయించుకుంటారు.

ఉగాది రోజున పలు చోట్ల కవితా గోష్ఠులు, పంచాంగ శ్రవణం, ఆధ్యాత్మిక సంబంధిత సమావేశాలు జరుపబడతాయి. ఆ సంవత్సరమంతా తమ రాశి ఫలం ఏ విధంగా ఉంటుందో, ఆదాయ వ్యయాలు, రాజపూజ్యం, అవమానం గురించి పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకుంటారు. ఆ సంవత్సరకాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులు, భవిష్యత్తులో జరిగే మంచి చెడులు, ఆరోగ్య అనారోగ్యాలు, దేశ కాల పరిస్థితులు, రాజకీయాలు పంచాంగం ద్వారా తెలుసుకుంటారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణాన్ని ఆకాశవాణి, టెలివిజన్ ల ద్వారా కూడా తెలుసుకుంటారు. దేవాలయాల్లో ప్రముఖ వ్యక్తులు పంచాంగాన్ని ప ఠించి భక్తులకు ఆ సంవత్సరమంతా జరగబోయే విశేషాలను తెలియచేస్తారు. ఉగాది రోజున తప్పకుండా పంచాంగంలో తెలియచేయబడిన విషయాలను విని తెలుసుకోవాలి. ఉగాదిరోజున కొంతమంది తమలోని చెడు అలవాట్లను వదిలివేయాలని నిర్ణయించుకుంటారు. ఆ సంవత్సరమంతా చెడు అలవాట్లను తొలగించుకునే ప్రయత్నం చేస్తారు. ఉప్పు, పులుపు, చేదు, వగరు, తీపి, కారంతో కూడిన ఉగాది పచ్చడి వంటిదే మానవ జీవివతం అన్న సందేశం ఆ పచ్చడిలో ఉంది. కష్టాలు, సుఖాలు, బాధలు, సంతోషాలు, కలిమి లేములు, సమస్యలు, పరిష్కారాలు, విడిపోవడాలు, కలుసుకోవడాలు కలగలిసినదే మానవ జీవితం అని తెలిపే పండుగ ఉగాది.

నూతన భవిష్యత్తుకు తొలి అడుగు ఉగాది పండుగ నాడే పడుతుంది. ఉగాది నుంచి నూతన సంవత్సరం ఆరంభమవుతుంది.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 343. ముచుకుంద వరప్రదాయ నమః

**అతి బలాఢ్యుడైన కాలయవనుని యుక్తిగా చంపించి, ఆ పని చేసిన ముచుకుందునికి వరము ఇచ్చినవాడు – కృష్ణుడు.**

కాలయవనుడు నారదుని ఉపదేశమున మధురపై దండెత్తి రాగా కృష్ణుడు విశ్వకర్మ వలన సముద్ర తీరమున ద్వారకా నగరమును కట్టించి అందు మధురాపురిలోని సర్వ జనులను ద్వారకకు చేర్చి, కృష్ణుడు తానొక్కడే నిరాయుధుడై మధుర నుండి వెలుపలికి వచ్చి కాలయవనునికి భయపడిన వాని వలె పరిగెత్తి ముచుకుందుడు నిద్రించియున్న పర్వత గుహలో ప్రవేశించినాడు. కృష్ణుని వెంటబడి వచ్చిన కాలయవనుని గుహలో ప్రవేశించి నిద్రించి యున్న ముచుకుందుని కృష్ణుడు అని తలంచి కాలితో తన్నగా అతడు లేచి కాలయవనుని చూడగా వాడు కాలి భస్మమైనాడు.

ముచుకుందుడు మాంధాత యొక్క కడపటి కుమారుడు. ఇతడు దేవ హితార్థము బహుకాలము మేల్కొని యుండి అలసి ఒక కొండ గుహలో పండుకొని యుండగా కృష్ణుడు కాలయవనుడు తరుముకొని వచ్చినప్పుడు ముచికుందుడు నిద్రించి యున్న పర్వత గుహలో ప్రవేశించాడు. వెంబడే వచ్చిన కాల యవనుడు పండుకొని యున్న ముచికుందుని కృష్ణుడని తలంచి కాలితో తన్నగా ముచుకుందుడు మేల్కొని కోపముతో చూడగా కాలయవనుడు కాలి బూడిద అయినాడు. ముచుకుందునికి అతని నిద్రాభంగము చేసినవాడు చూచినంతనే కాలి బూడిద అగునట్లు వరము ఇచ్చియున్నారు దేవతలు.

ముచుకుందుడు మేల్కొనిన పిమ్మట కృష్ణుడు అతనికి కనిపించినాడు. అంత ముచుకుందుడు లేచి కృష్ణునికి నమస్కరించి వినుతించినాడు. కృష్ణుడు ముచుకుందుని యెడ అనుగ్రహంతో బదరికాశ్రమము నందు తపస్సు చేయుమని ఉపదేశించినాడు. ముచుకుందుడు అట్లే బదరికాశ్రమమునకు వెళ్ళి తపస్సు చేసినాడు.


ముచుకుందునికి వరము ఇచ్చిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశ్వరునకు నమస్కారము.

## 344. సాల్వ సేవిత దుర్ధర్షరాజస్మయ నివారణాయ నమః

**– సాల్వుడు శిశుపాలుని తమ్ముడు. శిశుపాలుని సంహరించిన కృష్ణునిపై కోపముతో ద్వారకపై దండెత్తినాడు. కృష్ణుడు సాల్వుని, అతనిని ఆశ్రయించిన రాజులను జయించి గర్వమడచి సంహరించినాడు.**

సాల్వుడు ధమ ఘోషుని కుమారుడు. శిశుపాలుని సోదరుడు. సాల్వుడు కాశీరాజు కుమార్తె అయిన అంబను ప్రేమించగా, స్వయంవరము నాడు భీష్ముడు రాజులందరినీ జయించి, అంబను, ఆమె చెల్లెళ్ళను హస్తినాపురమునకు తీసుకొని వెళ్ళి తన తమ్ముడు విచిత్ర వీర్యునికిచ్చి వివాహము చేయదలంచగా అంబ సాల్వుని ప్రేమించిందని తెలిసి, భీష్ముడు ఆమెను సాల్వుని వద్దకు పంపగా సాల్వుడు అంబను వివాహమాడుటకు నిరాకరించినాడు. అంబ శిఖండిగా జన్మించి భీష్ముని మరణమునకు కారణమైంది.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

సాల్వుడు ద్రౌపది స్వయంవరములో కూడా పాల్గొన్నాడు.

సాల్వుని, అతనిని సేవించిన రాజులను సంహరించిన వాడగు కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 345. రుక్మి గర్వాపహారిణే నమః

**రుక్మి విదర్భ దేశపు రాజగు భీష్మకుని పెద్ద కుమారుడు. రుక్మిణికి అన్న. భీష్మకుడు రుక్మి మాటను కాదనలేక యుండెను.**

రుక్మి తన సోదరి రుక్మిణిని శిశుపాలునకిచ్చి వివాహము చేయదలంచినాడు. రుక్మిణి కృష్ణుని వివాహమాడదలంచి ఒక బ్రాహ్మణుడు అగ్నిద్యోతనుని ద్వారా తన వలపును కృష్ణునికి తెలియజేసింది. రుక్మిణి స్వయంవరమునకు ముందురోజు కృష్ణుడు విదర్భకు వచ్చి దుర్గాదేవిని పూజించుటకు నడిచి వచ్చిన రుక్మిణిని రథముపై కూర్చుండజేసి ద్వారకకు తీసికొని వెళ్ళాడు. అందుకు కోపించిన రుక్మి రథముపై కృష్ణుని వెంటాడాడు. రుక్మిని శిశుపాలుని వివాహమునకు వచ్చిన జరాసంధాది రాజులు తమ సైన్యముతో అనుసరించారు. వీరిని బలరాముడు యాదవులతో కలిసి అడ్డగించినాడు. రుక్మి కృష్ణునిపై బాణములు ప్రయోగించాడు. కృష్ణుడు మార్గ మధ్యముననే వీటిని ఖండించినాడు. ఇట్లు కొంతసేపు అస్త్ర యుద్ధము జరిగిన పిదప, రుక్మి ఖడ్గము చేబూని కృష్ణుని చంపుటకు కృష్ణుని రథమును సమీపించినాడు. కృష్ణుడు కూడా ఖడ్గమును చేతబూని రుక్మిని ఎదుర్కొనుటకు సన్నద్ధుడయినంతనే రుక్మిణి భయపడి కృష్ణుని పాదములు పట్టుకొని రుక్మిని చంపవద్దని మిమ్ము శరణు వేడుచున్నాను అని ప్రార్థించింది. కృష్ణుడు రుక్మిణి యెడ ప్రీతుడై ఖడ్గమును రథముపై పెట్టి రుక్మి దగ్గరకు వెళ్ళి అతని ఉత్తరీయము తోనే అతనిని బంధించి అతని ఖడ్గముతోనే రుక్మి తలను, మీసములను గొరిగి, తలపై పంచశిఖలు పెట్టి విరూపుని చేసి విడిచిపెట్టినాడు. అంత బలరాముడు రుక్మిణి మనస్తాపమును పోగొట్టి రుక్మి బంధనములను తొలగించి పంపినాడు. బలరాముడు కృష్ణునితో మన బంధువైన రుక్మిని విరూపుని చేయుట తగని కార్యము. అది చంపుటతో సమానమని చెప్పి హితము ఉపదేశించినాడు.

రుక్మిగర్వమును అడగించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

## 346. రుక్మిణీ నయనోత్సవాయ నమః

**రుక్మిణీదేవి కన్నులకు ఉత్సవమయిన వాడు కృష్ణుడు. కృష్ణుడు రుక్మిణి కన్నులకు పండువైనాడు.**

రుక్మిణి చంద్రమండల ముఖుడు, నవాంభోజ దళాక్షుడు జగన్మోహనుడు అగు కృష్ణుని వరించింది. ఈ సందర్భమున రుక్మిణి ''భువన మోహన! నిన్ను బొడగానగా లేని చక్షురింద్రియముల సత్త్వమేల?'' (భాగ.10–పూర్వ 1708) అని చింతించింది. ఇందుకు కారణము కృష్ణుని రూప సౌందర్య వైభవము రుక్మిణికి కనువిందు చేయడమే.

రుక్మిణీ నయనోత్సవుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేకటేశునకు నమస్కారము.

# తిరుప్పావై

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు**

గత సంచిక తరువాయి

## 7వ పాశురము

కీశుకీశె న్ఱెంగుం ఆనైచ్చాత్తన్, కలన్దు
పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో పేయ్ ప్పెణ్ణే!
కాశమ్ పిఱప్పుమ్ కలగలప్ప కైపేర్త్తు,
వాశనఱుం కుళలాయిచ్చియల్, మత్తినాల్
ఓశైప్పడుత్త త్తయిరవమ్ కేట్టిలైయో,
నాయగప్పెణ్పిళ్ళాయ్! నారాయణన్! మూర్తి!
కేశవనైప్పాడవుమ్ నీకేట్టే కిడత్తియో,
తేశముడైయాయ్! తిఱవేలో రెమ్బావాయ్

తాత్పర్యము – ప్రొద్దుపొడుచుటకు సూచించుచు అవ్యక్తమైన మధురధ్వనితో భరద్వాజ పక్షులు తాము విడిపోయే సమయమైనదనే బెంగతో ఒకదానితో నొకటి కలిసి కిచకిచలాడుచున్నవి. అది పెద్ద గోలవలె నున్నది. పిచ్చిపిల్లా! ఆ ధ్వని నీకు వినబడుటలేదా? మెడలోని మంగళ సూత్రములు పూసలు తగులుకొనియు, చేతుల గాజులు తగులుకొనియు గలగల శబ్దించునట్లు, సుగంధములు వెదజల్లు శిరోజములు గల గొల్లవనితలు కవ్వములతో చిలుకుచున్న పెరుగు యొక్క పెద్ద చప్పుడైనా వినబడుటలేదమ్మా? అవన్నియును తెల్లవారుటకు గురుతులాయని సందేహపడవద్దు, నీవు మాకందరకూ నాయకురాలవు గద! అన్ని వస్తువులకు లోపల బయటను వ్యాపించిన తత్త్వము మనకై శ్రీకృష్ణుడై వచ్చి 'కేశి' అను మన విరోధులను సంహరించినాడు. అందులకాతని వీరచరితమును పాడుట మన కర్తవ్యము. మేము పాడుటచే నీలో కలిగిన తేజస్సు కన్పట్టుచున్నది. వింటూ పడుకొనక లేచి తలుపు తెఱవుము.

**విశేషార్థము:** భగవత్సంబంధం ఏ ఒక్కరు కోల్పోరాదన్నది మన ఆండాళ్ తల్లి ఆశయము. తనకేదో తనకు దక్కింది. ఇతరులకేమైతే ఏమిలే అనే వైఖరి నిజమైన భక్తులకు ఉండదు. ఒకరి లోపం తీర్చనిదే తమకు ఉన్నది కూడా అనుభవించలేరు. అలాంటివారు ఏ జాతి కులాదులకు చెందినా మనకు



శిరోభూషణాల వంటివారే.

భగవంతుడంటే ప్రేమ ఉన్నా భక్తులను చూసినప్పుడు లోపాలను వెతకాలనో, ఈర్ష్యాసూయలతో ఆక్షేపించాలనో అనిపిస్తుంది. భగవంతుని చూచినప్పుడు కలిగేటంతటి ప్రేమ, ఆదరము భక్తులను చూచినా కలిగితేనే అది నిజమైన భగవత్ప్రేమ అవుతుంది. భగవానుని కంటే భక్తుల సహవాసమే బాగుపడగోరువానికి ప్రధానం. భక్త సహవాసం మనలో సంశయాలను తొలగిస్తుంది. భగవద్రుచి కలిగేట్లు చేస్తుంది. అజ్ఞానపు చీకట్లు తొలగించి విశ్వాసమనే ఉషోదయంలోకి చేరుస్తుంది. వారు పలికే పలుకులు, వారి ఆచరణలు మనలో తెలియకనే సచ్ఛీలాన్ని అలవరుస్తాయి. శోకాన్నీ బాపే మార్గం అందిస్తారు వారు.

'తరతి శోక మాత్మవిత్' ఆత్మజ్ఞాని శోకమును దాటగలడన్నది ఉపనిషత్తు. శోకమంటే ఇష్టమైన వస్తువు దూరమైతే కలిగే

మనోవికారము. ఇష్టమైనవి రెండే. 1.ఆత్మ అంటే నేను. 2. పరమాత్మ. రెండూ సహజానందం కలవే అయినా మనం ఆ విషయం మరచాం. తిరిగి జ్ఞాపకం చేసుకొంటే చాలు. మనలో ఉన్నవి దర్శనమిస్తాయి. తల్లి గర్భంలో ఉన్నప్పుడు గుర్తించాం. బయట పడగానే మరచాం. ప్రకృతి ప్రభావం వల్ల, తిరిగి జ్ఞాపకం చేసేవారే భక్తులు. వారు పక్షులవలె ముందు మేల్కాంచి మనలను మేల్కొలుపుతారు. వారి పల్కులే శాస్త్రాలు. అవి వినడం వలన కర్తవ్యం, కాస్త మేల్కాంచిన వానికే పక్షులు అరుపులు వినబడతాయి. కొంత తెలివి వచ్చిన రుచి కలవారికే అవి వినబడతాయి. అవి అప్రయత్నంగా వినే సత్కథలు,అభిముఖ్యం కలగగానే మనకై వారు ప్రణవ సారాన్ని వివరిస్తారు.

వినాలనే కోరిక శుశ్రూష ముందు వినాలి. తరువాత మననం చేయాలి. ఆపై మననం చేసిన దానిని ఎదుట చూస్తున్నట్లనిపించే విధంగా ధ్యానం చేయాలి. 'ఆత్మవారే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః' అని యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి చెబుతాడు.

ఈ వినడం రెండు రకాలు. ఆ రెండు రకాలను చూపిస్తూ నిన్న, ఈ రోజు ఇద్దరు గోపికలు లేపబడుతున్నారు. 'నిన్న వినలేదా చిన్నపిల్లా?' అన్నది, గోదా నేడు. 'విని కూడా పడుకునే ఉంటావేం?' అంటుంది. నిన్నటి బాలిక భగవదనుభవంలో కొత్తది కనుక చిన్నపిల్ల ఈనాడు పరిచితురాలే అయినా అతి ప్రేమపిచ్చి కలది. భగవదనుభవం పాత కొత్తల తేడా లేక అందరూ ఎల్లప్పుడూ కొత్తదిగానే భాసిస్తుంది. అతి ప్రేమతో ఈమెను ఈరోజు లేపుతున్నారు.

విడిపోవలసి వస్తోందనే బెంగతో భరద్వాజ పక్షులు ఒకదానితో ఒకటి మాట్లాడుకొంటున్నాయి. రాత్రి కలిసే వరకు నెమరు వేసుకొనేటట్లుగా మాటల మూటలను దారి భత్యముగా చేసుకుంటూ తిరుగుతున్నాయి. భక్తులమైన మనం ఒకరిని ఒకరు వీడి ఉండుట ఇంత బెంగ కలిగిస్తుందని గుర్తించనే లేదే! ఆ పక్షుల ధ్వని నీవు వినలేదా? అని మొదటి గుర్తు చెప్పారు. ఆమె పలుకలేదు. మరొక గుర్తు తెలుపుచున్నారు.

గడ్డ పెరుగులో కవ్వములను బలముగా నాటి గోపవనితలు నిత్యకృత్యంగా వెన్న తీస్తున్నారు. అధిక శ్రమ వల్ల అలంకరించుకొన్న వారి కొప్పుల ముడులు జారి లోనున్న పుష్పముల పరిమళము వ్రజమంతా వ్యాపించినది. వీరి శ్రమ చూచి, జాలిపడి, చీకటిలో తాను చేయి కలిపి చిలికి ఇచ్చిన వెన్నను, గోపికలు చూసుకొనేలోపు, మ్రింగి పారిపోవువాడు కదా మన స్వామి!

వారు మెడ తాల్చిన తాళిబొట్టులు, కరముల కంకణములు వారి కదలికలకు అనుగుణంగా గణ గణ మ్రోగుతూ, ఛర ఛర మనే దధిమథన నినాదములతో ఆకసమంతా మారుమోగుచున్నది. తమ అలుపు తీరుటకై పరమ ప్రీతితో స్వామి నామాలను వీరు పాడుతారు. ఆ స్వరం కూడా ఈ ధ్వనులతో కలిసింది. ఆ దధిమథన ఘోషము నీ చెవికి సోకలేదా? అని మరొక గుర్తు తెలిపారు. ఆమె సమాధానం చెప్పలేదు. మాకు నాయకురాలుగా ఉండదగిన దానవు నీవు. శిశువు ఒడిలో కాపాడు తల్లివలె సర్వమును కాపాడు వాత్సల్యపూర్ణుడు మన నారాయణుడు. మనకు గోచరించుచూ శ్రీకృష్ణుడైనాడు. వానిని మననుండి విడదీయు దుష్టుడగు అశ్వాసురుని చీల్చి కేశవుడైనాడు. అందమైన అతని కేశ సౌందర్యము తెలిసి కూడా నీవలా పడి ఎలా ఉండగలుగుతున్నావు? అని అడుగుతున్నారు. అయినా లోపలినుండి జవాబులేదు. ఏమిటా? అని వీరు లోనికి చూడగా లోపలి ఆమె దివ్యకాంతితో ప్రకాశిస్తోంది. 'ఓ తేజశ్శాలినీ! నీ ఆ భగవత్ సౌందర్యము ఒంటరిగా కాక మా అందరితో కలిసి అనుభవించుటచే నేర్పరితనము. లేనిచో నీవు పిచ్చిదానవే. ఆవేశంతో కాక ఆలోచనతో లేచిరా! విన్నందుకు ప్రయోజనం తోటివారందరితో కలిసి పొందుటే! అనుభవించటమే కదా! తలుపు తెరువుమా!'' అంటుంది ఆండాళ్.

నిన్న పక్షులు తమలో తాము శాస్త్రాలను అనుసంధానం చేసుకొనే బ్రహ్మజ్ఞానులను సూచిస్తాయి. ఈనాడు పక్షులు తమ తోటివారితో మాటలాడుకొంటున్నాయి. భాగవతులు తమ శిష్యులను ఉద్దేశించి చేసే శాస్త్రీయోపదేశాలే ఇవి. ఇవి రెండూ మన కోసం కాదు. వాటి అర్థాలు మనకు తెలియవు. అయినా తెల్లవారడాన్ని అవి సూచిస్తాయి మెలకువ వచ్చేదానికి.

మనకి రాత్రివలె కనపడక అజ్ఞానమనే చీకట్లచే ఆవరించబడ్డది భగవత్ జ్ఞానం. ఆచార్యుల భక్తుల ఉపదేశాలే మన కోసం కాకున్నా, అర్థం కాకున్నా, అర్థం లేకున్నా మనం వినే అవకాశం చేసుకుంటే మనలో సత్త్వమనే తెల్లవారడం జరుగుతుంది. అప్పుడు భగవంతుని యందభినివేశం ఏర్పడుతుంది. కనుక మొదట శాస్త్ర విషయాలను వినడం అలవాటు చేసుకోవాలి.

రెండవ శ్రవణం చేయించిన పక్షి ద్వారా మూడు పురుషాయుషములు తపమాచరించి వేద విజ్ఞానాన్ని బాగా గ్రహించి శిష్యులకు ఉపదేశించి సత్సంప్రదాయ శాస్త్ర ప్రవర్తకుడైన భరద్వాజ మహర్షి స్మరింపబడుతున్నాడు. తెల్లవారడానికి రెండవ గుర్తుగా నిన్న ఒక అభిప్రాయాన్ని తెలిపే శంఖనాదాన్ని ఈనాడు నిత్యకర్మలు అనుష్ఠించునపుడేర్పడే నామ మధన ఆభరణముల ధ్వనులను పుష్ప పరిమళాలను చూపినది అమ్మ. భగవదారాధన మానరాదనీ, జీవుడా పరమాత్మకు సదా దాసుడనీ, అతని సేవకై వినియోగపడుటే స్వరూపమనీ, ఇది శంఖనాదాన్ని బట్టి ఊహించారు. భగవత్ప్రేమ ఉన్నా భక్తులు నిత్యకృత్యాలు మానరని, ఆ నిత్యకర్మలను జ్ఞానముచే సంస్కరించి కైంకర్యములుగా మంచి ప్రీతితో చేస్తూ ఉంటారనీ, భగవన్నామ గానంతో అట్టి నిత్యకర్మలు వీరికి బంధకములు కావని చూపింది.

అట్టివారికి జ్ఞానప్రసూన పరిమళము వారి భగవత్సేవా రూపమైన ఆచరణ ద్వారా ప్రకటితమవుతుందని పుష్ప పరిమళాల ద్వారా అమ్మ సూచించింది.

తెల్లవారుటకు మూడవ గుర్తు. గుర్తించిన భగవత్స్వరూపం వారి నామం ద్వారా తెలుపబడింది. ఆ భగవానుడు సర్వపాప హరుడనీ, తాపశమనం చేయునని తెలిపింది నిన్న. అతనిని గూర్చి శ్రవణం చేయాలని అర్థం.

అట్లే ఈనాడు ఆ భగవానుని యొక్క సకల కళ్యాణ గుణాకరత్వాన్ని గుర్తించి ఆశ్రితులలో, అనాశ్రితులలో ఉండి అందరినీ కాపాడువాడని, సర్వసులభుడని ఆశ్రితుల విరోధులను దూరము చేయు ఆ స్వామి శక్తిని గురించి పెద్దల ఉపదేశంతో తెలుసుకోవాలి. ఇది ఉజ్జీవించువాని మొదటి దశ అని ఈ పాశురమున సూచించబడినది.

# 8వ పాశురము

**కీళ్వానమ్ వెళ్ళెన్ఱు ఎరుమై శిఱువీడు,**
**మేయ్వాన్ పరన్దనకాణ్ మిక్కుళ్ళ పిళ్ళైగళుమ్,**
**పోవాన్ పోగిన్ఱారై ప్పోగామల్ కాత్తు, ఉన్నై**
**క్కూవువాన్ వందు నిన్ఱోమ్, కోదుకలముడైయ**
**పావాయ్! ఎళున్దిరాయ్! పాడిప్పఱై కొండు**
**మావాయ్ పిళన్దానై మల్లరై మాట్టియ,**
**దేవాదిదేవనై శెన్ఱు నాం శేవిత్తాల్,**
**ఆవావెన్ఱారాయ్ న్దరుళేలో రెమ్బావాయ్**

**తాత్పర్యము** – తూరుపు దిక్కున ఆకసమంతా తెల్లవారినది. గేదెలు మొదటి చిన్నమేతను మేయుటకై నలుదిక్కులకు విడువబడి వ్యాపించినవి. మన తోడి గోపికలంతా త్వరగా కృష్ణుని వద్దకు వెళ్ళుటయే ఫలమని తలంచి పోబోవుచున్నారు గాని వారందరునూ పోకుండా ఆపి గోష్ఠిగ వెళ్ళుట మంచిదని ఓ చిన్నిదానా! నిన్నుకూడా పిలుచుకుని పోవుటకై వచ్చి నిలిచితిమి. ఆతనిని చేరవలయునని మిక్కిలి కుతూహలము నీకునూ కలదు కదా, మరి వెంటనే లేచిరమ్ము. ఆతనిని కీర్తించి పఱై అనెడిదానిని ఆతనినుండి పొందుదాము. అశ్వాసుని నోటిని చీల్చివేసియు, చరాచర ముష్టికులను, మల్లులను దునిమియు పరాత్పరుడై ఉండి కూడా శ్రీకృష్ణుడై వచ్చి యుండగా ఆయన వచ్చుటకు ముందే మనమే వెళ్ళి సేవించినచో, అతడు నొచ్చుకొని, అయ్యో! అయ్యో! మీరే వచ్చివేసితిరే. నేనే రావాలనుకుంటుండగా అని మనను పరిశీలించి మన కోరిక నెరవేర్చును కనుక మరి వెంటనే లేచి రమ్ము.

**విశేషార్థము :** పదుగురిలో మూడవ గోపబాలికను లేపుతోంది ఆండాళ్. 'నారీణాం ఉత్తమాం వధూః' ఉత్తమ స్త్రీగా ప్రసిద్ధి గాంచిన మన సీతమ్మ వలె ఈ గోపిక కూడా స్త్రీత్వం పూర్తిగా గల ప్రౌఢ. శ్రీకృష్ణుడే ఈమెను ఘనముగా పొగుడుతాడు. ఈమెను వదిలిపోతే శ్రీకృష్ణుడు బాధపడతాడు. అందుకే ముందుగా ఆమెను ఉంచి స్వామి వద్దకు పోవలెనని నిద్ర లేపుతున్నారు గోపభామలు.

వ్రేపల్లెలో శ్రీకృష్ణుని చూచు సమయం గోపికలకు రాత్రియే. పగలు శ్రీకృష్ణుడు గోవుల మేతకు అడవికి పోవును కదా. తెల్లవారిపోతే తిరిగి అతని దర్శనం ఉండదని భయం. కనుక తెల్లవారకుండానే పోయి సేవించాలని త్వరపడతారు. సంసారులకు పగలు రజోగుణ ప్రభావం వల్ల ప్రాపంచిక వృత్తులు గోచరిస్తాయి. భగవద్విషయం కనుమరుగవుతుంది. అవి మేల్కొనక మునుపే సత్వగుణమున్నపుడే జ్ఞానులను ముందుంచుకొని స్వామిని సేవించాలి. సత్వగుణము ఉన్నదిప్పుడే. తెల్లవారు సమయం దానిని సూచించే ప్రాభాతిక సంకేతాలను పక్షుల అరుపులు కాక మరో అందమైన రీతిలో ఆండాళ్ వర్ణిస్తుందీ నాడు.

తూరుపు తెల్లవారుతున్నది. గేదెలు మొదటి చిరుమేతకై పచ్చిక బయళ్ళ యందు అంతటా తిరుగాడుచున్నవి. నీవు తప్ప మిగిలిన గోపికలందరూ వ్రత సంకేత స్థలం చేరడానికి త్వరపడిపోతున్నారు. నిన్ను వదిలిపోవడం ధర్మహాని యని వారందరినీ పోకుండా నిలిపినాను. నిన్ను లేపడానికి నీ ముంగిట నిలచినాను. మన స్వామి మనస్సు దోచిన పూర్తి స్త్రీత్వం కలదానవు నీవని మా ధైర్యము. నీవు మాకు ముందుండగా, స్వామి నామము పాడగా వలయు పరికరాలెల్ల తానిచ్చు మనకు గుఱ్ఱమై వచ్చిన అశ్వాసురుని నోరు చీల్చినవాడా! మదము గల మల్లురను మట్టి కరిపించినవాడా! దేవతలందరికీ ఆదిదేవుడవని స్వామి సన్నిధి చేరితిమని దీనముగా సేవింప, అయ్యయ్యో అనుచు ఆదరమొప్ప కరుణించు మనల లేచి రావమ్మా!' అన్నది మన ఆండాళ్.

మన ఈ 30 పాటల తిరుప్పావై సకల ఉపనిషత్సారం. వేదములకే ఇది బీజము వంటిదని 'వేదమనైత్తుక్కుం విత్తాగుమ్' అని పూర్వులంతా అంగీకరించారు. గోదాదేవి శ్రీరంగనాథుని పొందుటకు చేరు ప్రయత్నమొకటి. గోపికలు శ్రీకృష్ణుని చేరు ప్రయత్నమొక్కటి. పైకి అందంగా కనిపిస్తాయి. వెనుక జ్ఞానము కల యోగులందరికీ పరమ పురుషార్థమైన భగవత్ప్రాప్తికి ఈ దేహములో ఉన్నప్పుడు సాగించే అద్భుతమైన సాధన, భగవానుడెలా చేయించునో నిరూపిస్తోంది. ఇది మానవులందరికీ అత్యావశ్యకమైన ప్రధానమైన ఆచరణ. పశు పక్ష్యాదుల కంటే వేరుగా మానవుడు తన ఉనికిని నిరూపించుకొనడానికి చేసే ప్రాథమిక అనుష్ఠానమే ఈ ధనుర్మాస వ్రతం. కనుకనే ఈ 30 పాటల సారాన్ని ఎరుగని వారిని 'వైయంశుమప్పదం నంబు' ఈ భూమి మోయుట బరువు చేటు అని తీర్మానించారు. అది ఎలాగో

చూద్దాం. బాగుపడగోరే వారెవ్వరైనా ముందు చేయవలసింది పెద్దల ఉపదేశాన్ని వినడం. ఆపైన మననం. తరువాత 'దర్శన సమానాకార ధ్యానం' అని ఉపనిషత్తు బోధించింది. అందు శ్రవణంలో భేదాలు రెండు పాశురాలలో వివరించబడినాయి. నేడు మననమును నిరూపిస్తోంది శ్రీ ఆండాళ్.

శ్రవణం మూడు విధాలుగా ఉంటుంది.

1.ఎవరికోసమో పలికే శాస్త్రములను విని, వారి సారతమార్థాన్ని గుర్తించాలి. పెద్దల ప్రవచనాదులను వినడం వల్ల సత్వగుణమనే తెల్లవారుట సూచితమైంది. అదే మొదట పక్షుల అరుపులు. ఆపై పక్షులు కలిసి మాట్లాడుకొనుట అని ఆండాళ్ తెలిపింది.

2.విన్న కొన్నింటిని బట్టి కొన్ని మనం ఊహిస్తాం. అదే మొదటి పిలుపు. శంఖాన్ని బట్టి తెల్లదనం ఊహించారు. తరువాత శబ్దాలను బట్టి పెరుగు చప్పుడు, ఆభరణాల ధ్వని, పాటల స్వరాన్ని, పూల పరిమళాలను ఊహించారు. ఇవి వీరు చూడలేదు. అనుమానం చేత తెలుసుకొన్నారు. పెద్దల ద్వారా విన్న శాస్త్రార్థాన్ని ఊహించి కొన్నింటిని మనం గుర్తిస్తాం. అందులోనూ భగవద్గుణాలు కన్పడవు గాని మనలో కలిగే 'సత్వగుణ వృద్ధి' అనే తెల్లవారుటను తెలుపుతుంది ఆ తరువాత.

3.భగవన్నామాలే స్పష్టంగా ఆదేశించబడినాయి. మొదట పాప పరిహర్తగా, ఆపై నారాయణ, కేశవాది శబ్దాలతో సకల గుణోపేతునిగా గురువులు ఉపదేశిస్తారు. మంత్ర మంత్రార్థాలను తెలుపుతారు. గురువులైన పెద్దల వలన పొందిన ఉపదేశం 'మననం' చేయడం ద్వారానే ఫలవంతమవుతుంది. మననం సాగవలసింది మనస్సులో. మనస్సుకు నాలుగు పేర్లున్నాయి. ఒక విషయం నిలకడగా ఉంటే 'మనస్సుకు' అంటారు. శరీరమే నేను అనిపించినప్పుడు 'అహంకారం' అంటారు. ఒక విషయాన్ని నిర్ధారణ చేసుకోలేక ఊగిసలాట స్థితిలో 'చిత్తం' అంటారు. నా అంతవాడు వేరెవ్వడనే గర్వము నిండినపుడు 'అభిమానం' అంటారు. లోకంలో అనుభవించే శబ్ద స్పర్శ రూప రస గంధాలు గల వస్తువులన్నీ త్రిగుణాత్మకములే. సత్వము పైకి వస్తే రజస్తమస్సులు అణుగుతాయి. రజస్సు పైకి వస్తే సత్వ తమస్సులు అణుగుతుంటాయి. అలాగే తమస్సుకి కూడా. మనము సత్వము పైకి రావాలని కాంక్షిస్తాము. కారణం? అది మనస్సును నిర్మలంగా ఆరోగ్యకరంగా ఉంచుతుంది. ఆత్మజ్ఞానాన్ని ప్రకాశింపచేస్తుంది.

సత్వాన్ని పైకి రాకుండా రజస్తమస్సులను పెంచే అయిదు రకాల మలినాలు విషయానుభవాల వల్ల మనస్సును అంటి ఉంటాయి. అవి అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, పట్టుదల అనేవి. వీటివల్ల ఇంద్రియాలు బలహీనమై బుద్ధి బలహీనమవుతుంది. ఆత్మజ్ఞానం ప్రకాశించడం మాని మనిషి పతనమవుతాడు. దానినే భగవద్గీత 2వ అధ్యాయంలో 'ధ్యాయతో విషయాన్ పుంసః' అని ప్రారంభించి ...'ప్రణశ్యతి' అని కృష్ణుడు ఉపదేశించాడు. దీనియందు కూడా అంటే పతనం కాకుండా ఎలా బాగుపడాలో అక్కడే ఉపదేశించాడు. దాన్ని ఆండాళ్ అందమైన కథలో ఇమిడ్చింది.

భగవద్గీత 2వ అధ్యాయం 53వ శ్లోకంలో బలహీనమైన బుద్ధిని శక్తివంతం చేయడం ద్వారా మనోమలినాలను అణచి సత్వగుణాన్ని పెంచవచ్చునని చెప్పాడు. బుద్ధికి బలం కల్గించడానికి రెండు సాధనాలు ఉన్నాయి. 1. సాత్వికాహారం. 2. గురువుల ఉపదేశం. 'శ్రుతి విప్రతిపన్నా బుద్ధిః' అని చెప్పాడు. ఆ శ్లోకంలో శ్రవణం వల్ల బుద్ధికి బలం పెరిగి విషయాలను గ్రహిస్తున్న ఇంద్రియాల వద్ద భగవత్సంబంధమనే జల్లెడ ఏర్పడుతుంది. విషయ సుఖాలు మాననవసరం లేదు. వాటిని వడబోసి గ్రహించాలి. అవి కృష్ణ సంబంధం కలవవుతాయి. అవి 61 వ శ్లోకంలో చెప్పాడు. దీనివల్ల మనసున కంటివున్న మలినాలు దూరమై మనస్సు నిర్మలమై ప్రకాశిస్తుంది. తూరుపు తెల్లవారుతోందన్నమాట. ఇది 64, 65 శ్లోకాలలో కృష్ణుడు చెప్పాడు.

శ్రవణం లేనివానికి బుద్ధి నిలకడ ఏర్పడదనీ, అది లేనివానికి మలసంపర్కం కల మనస్సు సుఖాన్ని ఇవ్వదని తీర్మానించాడు స్వామి. ఇంతవరకు పక్షుల శబ్దం వల్లనే గురూపదేశం వల్ల ఏర్పడ్డ భగవన్నామ జ్ఞానం తెల్లవారడాన్ని సూచించింది. ఇదంతా వైరాగ్యమంటారు. భగవదితరమైన వాటియందు రుచి తగ్గుట, అభ్యాస వైరాగ్యాలే మనస్సును నిలకడగా ఉంచేవి. వైరాగ్యం ఏర్పడిన తరువాత ఇక అభ్యాసక్రమం తెలపాలి కదా! అదే మననం. ఈనాటి పాశురంలో వివరించింది అందంగా.

ఇక్కడ గేదెలు అజ్ఞానానికి, తమస్సుకి ప్రతీక. తెల్లవారితే అవి బయటికి పోతాయి. పూర్తిగా పోవు. తిరిగి వస్తాయి. వాటిని రానివ్వాలి. పాలు మాత్రం పితికి బయటకు పంపివేస్తారు. గురూపదేశం వల్ల మనసు నిర్మలమైతే లోకతత్వం ప్రకాశించినట్లనిపిస్తుంది. రాగద్వేషాలు, అజ్ఞానాదులనే గేదెలు వంటివి బయటికి పోయాయనుకుంటాం. పోయి తిరిగి అవి లోనికి వస్తాయి. రానివ్వాలి. వాటిలో దైవానుకూలమైన వస్తువులను, పాల వలె గ్రహించి, గేదెలను పెద్ద మేతకు వదలి వేసినట్లు వదలేయాలి. గురుసన్నిధిలో ఇంద్రియాలు, రాగద్వేషాలు అణగి, సుప్తదశలోనో, క్షీణదశలోనో ఉంటాయి. మనం బయటకు రాగానే విషయాలు కన్పడగానే అవి మళ్ళీ విజృంభిస్తాయి. దీనినే శ్రీకృష్ణుడు 2వ అధ్యాయం 59వ శ్లోకంలో 'విషయా వినివర్తన్తే'... అని తెలిపాడు. అంటే పరమాత్మను దర్శించేటంత వరకు ఈ ఇంద్రియాలనే గేదెలను బయటకు పంపక తప్పదు. తిరిగి వచ్చినప్పుడు వాటి పాలను మాత్రమే గ్రహించి, అంటే శరీర ధారణకు తగినంత భగవత్సంబంధము

కల్పించి స్వీకరిస్తూ ఉండక తప్పదు. లోన మాత్రం భగవద్గుణ సంబంధాన్ని 'మననం' అభ్యాసరూపంగా సాగించాలి. ఇది సాగడానికి దోషాలు నాలుగు మనం తెచ్చుకునేవి అడ్డుంటాయి. అవిద్యాది మలినాలు పుట్టుకతో వస్తే మనం తెచ్చుకునే దోషాలు ఈ నాలుగు. అవి ఈర్ష్యాపరులకు అపకారం చేయాలనే కోరిక, అసూయ అమర్షము ఇవి పెద్దలు, భక్తులతో ఏర్పడిన సహవాసం వల్ల కలిగే మైత్రి, కారుణ్యం సంతోషం, ఉపేక్ష – అనే నాలుగు అలవాటు చేసుకొంటే దోషాలు తొలగుతాయి. పరుల గొప్పదనానికి ఏడవడం, ఈర్ష్య, మంచి చెప్పేవారిని శత్రువులనుకొనడం వల్ల అపకార వాంఛ ఏర్పడుతుంది. వ్యక్తిలోని మంచి గుణాలను చూచి దోషాలను నిందించడం, ఎవరో నన్నేదో అనుకుంటున్నారనే ఉడుకుమోతుతనం అమర్షం. ఈ నాలుగు దోషాలతో పాటు అయిదు మలినాలు తొలగి భగవానునిచే ప్రేమించబడిన గోపిక కనుక ఆమె ముందుంటే కృష్ణుడు అనుగ్రహిస్తాడని లేచి రమ్మంది మన ఆండాళ్. ఆమె స్మరణ మనకూ అట్టి యోగ్యత కల్గించుగాక.

# 9వ పాశురము

**తూమణిమాడత్తు చ్చుత్తుమ్ విళక్కెరియ,**
**తూపమ్ కమళ త్తుయిలణై మేల్ కణ్వళరుమ్**
**మామాన్మకళే! మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్,**
**మామీర్! అవళై యెఴుప్పీరో, ఉన్ మగళ్ దాన్**
**ఊమైయో? అన్ఱి చ్చెవిడో, అనన్దలో?**
**ఏమ ప్పెరున్దుయిల్ మన్దిరప్పట్టాళో?**
**మామాయన్ మాదవన్ వైగున్దన్ ఎన్ఱెన్ఱు,**
**నామమ్ పలవుమ్ నవిన్ఱేలో రెమ్బావాయ్!**

తాత్పర్యము – దోషములు లేని శుద్ధ మాణిక్యములు పొదగబడి నిర్మించిన మేడ, దాని చుట్టూ ప్రకాశించునట్లు దీపములు వెలుగుచుండగా విలాసమును సూచించు అగరు ధూపములు ఘుమ ఘుమలాడుచుండగా, ఆ శ్రీకృష్ణుడు కావాలంటే రాక ఏమి చేస్తాడనే ఉపేక్షచే సర్వ లక్షణోపేతమైన హంస తూలికా తల్పముపై నిదురించు ఓ మామగారి కూతురా! కాంతి వల్ల గుర్తు తెలియక యున్న నీ మాణిక్య ఖచితమైన తలుపు యొక్క గడియను తెరువుమా! ఓ మేనత్తగారూ! పోనీ మీరైనా ఆమెను లేపి పంపండి. ఏమమ్మా మీ అమ్మాయి మూగదా? లేక చెవిటిదా? లేక అలసి బద్ధకించుచున్నదా? అదీ కానిచో లేవకుండా ఆమె నెవరైనా మంత్రించినారా? లేక అడ్డుచున్నారా? ఆశ్చర్య చేష్టలు కల శ్రియఃపతి, పరమపద నివాసియే యైనను మన కొఱకై శ్రీకృష్ణుడై వచ్చినాడని ఇంకా ఇంకా ఆయన తిరునామాలు పాడుచుండ వెంటనే లేపి పంపుడు.

విశేషార్థము : ఈ రోజున నాల్గవ గోపికను విలక్షణమైన రీతిలో మేల్కొలుపుతున్నారు మనవారు. ఒక ఫలాన్ని కోరి చేసే సాధనను 'ఉపాయము' అంటారు. దీనివల్ల కలిగే ఫలితాన్ని 'ఉపేయం' అంటారు. సామాన్యులు కోరే ఉపేయములు, వాటికై ఆచరించే ఉపాయములు బోలెడన్ని. అవి మన ప్రయత్నం మీద ఆధారపడి ఉంటాయి. వాటికెన్నో నియమాలు, నిర్బంధాలు ఉంటాయి. ఏ కాస్త లోపం ఏర్పడినా విపరీత పరిణామాలకు దారి తీస్తాయి. అతి ఆయాస జనకములైనా సహిద్దామంటే వాటివల్ల సిద్ధించే ఫలితాలు అల్పాలు, నశ్వరములూను. అల్పజ్ఞుడైన జీవుడు ప్రయత్నించేది ఏమంత గొప్పగా ఉంటుంది కనుక. దీనివల్ల సిద్ధించేది కూడా అంతంత మాత్రమే తప్ప అనంతమూ; శాశ్వతమూ కానే కాదు.

మన గోపికలకు ఫలము ఉపేయము. ఇతరమైనవి కాదు. వీరు కోరేది సాక్షాత్తు శ్రీకృష్ణుడినే. అతడు సిద్ధమై ఉన్న ఫలంగా పైగా పరమ చైతన్యమూ, సర్వజ్ఞమూ, సర్వశక్తి యుతము కూడా. అలాంటి ఉపేయమును ఏ ఉపాయానుష్ఠానంతో పొందాలి? 'నాహం వైదేర్న తపసా నదానేన నచేజ్యయా... భక్త్యాత్వనన్య యా శక్యః' వేదపఠన, దాన, తపో యజ్ఞాదులు వేటికీ తాను పొందబడననీ, కేవల నిస్వార్థ ప్రేమ కలవారికి మాత్రమే తనను తాను చూపుకొందునంటాడు.

ఇతరోపాయములన్నీ భగవంతుని ఇవ్వ పనికిరానివే. తపనను సాధించుటకు ఉపాయము శ్రీకృష్ణుడే. ఇదియే ఉపనిషద్రహస్యము. లోకమందు ఉపాయములు వేరు, ఫలములు వేరు. శ్రీకృష్ణుడు మాత్రమే తానే ఉపాయము, తానే ఉపేయము కూడా కాగలడు. ఇది లోకవిరుద్ధమేమీ కాదు. ఏడిచే శిశువునకు అమ్మ ఉపేయం. ఆ అమ్మను సాధించి ఇచ్చే ఉపాయం ఏది? అమ్మే కదా! తానే వచ్చి ఎత్తుకొని, తన ఒడి సౌఖ్యాన్ని శిశువుకు తృప్తితో అందిస్తుంది. అదేవిధంగా భగవానుడు ఉపేయములై ఆశ్రితులను కాపాడునని ఉపనిషత్ తాత్పర్యమైన రహస్యార్థం.

భక్తుల్లో కొందరు భగవానుడే ఉపాయమని విశ్వసించి, ఇతరోపాయముల నుంచి విరమిస్తారు. వీరు భగవంతుడే ఉపాయమని నమ్మిక కలవారు కనుక 'ఉపాయనిష్ఠులు' అంటారు. వీరు తైత్తిరీయోపనిషత్ చెప్పినట్లు 'ఏషహ్యే వానన్దయాతి' ఇతడే జీవుని ఆనందింప జేయును అను దానిని విశ్వసించి ఇతరమేమీ చేయక ఇతర ఉపాయముల ఆచరణలో నిదురిస్తున్నట్టుంటారు. వీరికి తమ అల్పజ్ఞానం, అల్పశక్తి తెలుస్తుంది. భగవానుని సర్వజ్ఞత, సర్వశక్తులు తెలుసు. కనుక స్వప్రయత్నం నుండి పూర్తిగా విరమించి ఉండేవారు. 'పరగత స్వీకార నిష్ఠులని' పిలువబడతారు. పిల్లిపిల్ల తనకు శక్తి ఉన్నా తన రక్షణభారం తల్లిమీదనే ఉంచుతుంది. నోటకరచి పిల్లను జాగ్రత్తగా రక్షిత స్థలానికి తల్లి చేరుస్తుంది. అలాగే ఉపాయ

నిష్ఠులు 'లోకంలో నుండి రాముని పైనే భారం వేసిన సీతమ్మ' వలె భగవానుడే మనకు ఏమైనా చేసుకోవాలని తప్ప మనమేమి ప్రయత్నించరాదని అంటారు.

భక్తులలో మరికొందరు 'ఆనందం బ్రహ్మణో విద్వాన్' పరమాత్మ అఖండ, అనంతమైన ఆనందము కలవాడు. తానే ఆనందస్వరూపుడగు ఉపనిషద్వాక్యాలను ఎరిగి, అంత గొప్ప ఫలముల నెలా పొందక ఉండగలమని దానిని పొందడానికి ఏమైనా చేయడానికి వెనుకాడరు. ఫలస్వరూపుని గొప్పతనం అది. అంత గొప్ప ఫలం భగవానుడే కాకపోతే ఆయనకొక నమస్కారం.

శ్రీకృష్ణ సౌందర్యం కొందరిని ఉపాయ నిష్ఠులను చేసింది. వారు స్వప్రవృత్తి ఏమీ లేక నిదురిస్తున్నట్టుంటారు. భగవదుపాయత్వాన్ని గుర్తించరు. ఇది లోపల పడుకున్న గోపికల దశ.

అదే సౌందర్యం మిగిలినవారిని ఉపాయనిష్ఠులను చేసింది. ఏవో తాము చేయక నిలువజాలక పరుగులు తీసేట్టు చేసింది. ఇది బయట లేపవచ్చిన గోపికల దశ.

ఒక భక్తుని జీవయాత్రను స్మరించుకొంటే చాలును. మనలను అలాంటి జ్ఞానులుగా తరింప చేస్తుందని పూర్వులు గుర్తించారు. అందుకే ఈనాడు నాల్గవ గోపిక భవన సౌందర్యాన్ని చూస్తూ మేల్కొలుపుతున్నారు. నిన్నటిదాకా శ్రవణమైంది. శ్రవణం వల్ల ఏర్పడిన సంతత మననం చేత మనో మాలిన్యాలు, దోషాలు దూరమై మనసు నిర్మలమవుతుంది. దానినే మనః ప్రసాదమంటారు. 'వీనికి భగవత్ జ్ఞానము ఒక కవచమై నిలచిందన్నమాట. అదే ప్రజ్ఞా ప్రసాద'మంటారు. క్షుద్ర విషయాలందు చొరలేవు. అట్టి జ్ఞాని మనన నిష్ఠుడనీ, స్థిత ప్రజ్ఞుడనీ భగవద్గీత చెప్పింది. స్థితప్రజ్ఞుని దశలు నాలుగు.

1) యతమానావస్థ – ఇంద్రియాలను విషయాల నుండి అరికట్టే ప్రయత్నం చేస్తూ ఉంటాడు ప్రజ్ఞాబలము చేత, విశ్వామిత్రుని వలె.
2) వ్యతిరేకావస్థ – వస్తు సంగమున్నా వాటియందపేక్ష ఏమీ ఉండదు. మనస్సులో మాత్రం తెలుస్తూ ఉంటుంది వాటి ప్రభావం. ఇది జనక చక్రవర్తి వంటి దశ.
3) ఏకేంద్రియావస్థ – ఇక్కడ విషయ సంగం ఉండదు. కానీ అన్నీ తెలుస్తూనే ఉంటాయి ఈ దశలో. జడ భరతుడు దీనికి దృష్టాంతం.
4) వశీకారావస్థ – కోరికలు కోరికలనే తెలియవు. వాటిలోనే ఉన్నా నాటి స్పృహ అతనికి ఎంతమాత్రము ఉండదు. శ్రీ శుక యోగీంద్రుడు దృష్టాంతమని యోగ శాస్త్రంలో నాలుగు దశలు వర్ణించబడి ఉన్నాయి. వాటిలో నాలుగవది పరిపక్వ దశ. భగవానుడు పరిపక్వదశ నుండి ప్రారంభించి 'ప్రజహాతి యదా కామాన్' అంటూ వెనుకకు నాలుగు దశలను రెండవ అధ్యాయంలో వర్ణించాడు స్థితప్రజ్ఞదశలు. అతణ్ణి ఆదర్శంగా తీసుకున్న మన ఆండాళ్ అదే క్రమంలో ఆ స్థితిలో ఉన్న నలుగురు గోపికలను లేపుతూ ఈరోజు వశీకారావస్థ ఏవిధంగా ఉంటుందో ఈ గోపిక ద్వారా చూపుతోంది. పరిశుద్ధ మణిమయ భవంతిలో చుట్టూ దీపాలు వెలుగుచున్నవి. దీపాలు కాంతులీనుచూ, ధూపములు పరిమళించుచుండ, నిదురబుచ్చు పర్యంకమున మేనువాల్చి పవళించిన మేనమామ కూతురా! ద్వారపు తాళము తెరువవా! ఓ మేనత్తగారూ! మీరయినా ఆమెను లేపరాదుటమ్మా! ఏమీ మీ కుమారితె మూగిదా? లేక చెవిటిదా? బద్ధకము పైబడ్డదా? ప్రక్కన మాటాడనీయక ఎవరయినా కావలి ఉన్నారా? లేక మంత్రముగ్ధ అయినదా? అత్యాశ్చర్యకర గుణచేష్టలు కల మాయావీ; శ్రియఃపతీ! వైకుంఠవాసా! అంటూ ఎన్నెన్నో స్వామి నామాలను మేము కీర్తిస్తున్నా, ఆమె లేచి రాకున్నదే అంటూ ఈ గోపికను ఆండాళ్ మేల్కొలిపింది.

ప్రియురాండ్రపై ప్రేమతో తనకోసం తెచ్చిన హారాలు మణులు ఆమె భవనానికి వాడేసి మిగిలిన ఒకటీ అరా మణులతో తన భవనం కృష్ణుడు కట్టుకున్నాడట. రసికుడు కదా! అందుచేతనే ఈమె పరిశుద్ధం. కృష్ణుని భవనం నిర్మలం. ఈమె గొప్ప జ్ఞాని. నాలో భక్తులున్నారు. భక్తుల హృదయాలలో నేనున్నానని స్వామి అంటాడు.

ఇపుడు భక్తుల ఇల్లు పరిశుద్ధమైన భవనం అయింది. జీవుడు దేవుడు ఇరువురూ సహజ జ్ఞానం కలిగినవారే. మణికి సహజకాంతి ఎలాగో వీరికి జ్ఞానం అలా సహజం. భారతీయ సంస్కృతిలో సంజ్ఞలు కొన్ని ఉన్నాయి. గజమంటే ఎనిమిది అని అర్థం. అట్లే మణి అంటే తొమ్మిది అని అర్థం. జీవేశ్వరులిరువురూ మణులంటే, ఇరువురికీ తొమ్మిది సంబంధాలున్నాయి. విడదీయరానివని అర్థం. ఇవన్నీ భగవద్గీతలో తెలుపుబడ్డాయి.

స్వామిలో లీనమయి చేరి ఉండడం చేత బయటివారి మాటలు వినలేరు. చెవిటివారా అని పిలుస్తారు. మూగివారా? అనే భ్రమను కలిగిస్తారు. యోగదశలో మగ్నులయినందున బాహ్య విషయాల్లో బద్ధకస్తులుగా గోచరిస్తారు. అటువంటి వారిని భగవన్నామాల అనుసంధానం తోటి బయటి ప్రపంచంలోకి తేవాలే తప్ప ఇతరమైన ప్రయత్నాలు అనవసరం. పైగా అది వారికి ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఆ మార్గాన్నే అవలంబించి మన ఆండాళ్ శ్రీ శుక యోగీంద్రుని వంటి యోగదశలో మనస్సు శ్రీకృష్ణునితో చేరిపోయి ఉన్న మహాజ్ఞానిని 'స్థితప్రజ్ఞుని' ప్రసన్నుని కమ్మని ప్రార్థించింది.

**(సశేషం)**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

## నిరాశ

సీతాదేవిని బెదిరించారు రాక్షసాంగనలు. చంపుతామన్నారు. తింటామన్నారు. భయపడింది మైథిలి. అయినా ధైర్యం తెచ్చుకుంది. ''నేను మానవ కాంతను. ఒక రాక్షసునికి భార్య కాజాలను. ఇక మీ ఇష్టం నన్ను తినండి అంది. అడవిలో తోడేళ్ళ మధ్య చిక్కింది జింక అన్నట్లు వుంది జానకి. బిక్కు బిక్కుమంటూ కూర్చుంది. వణికిపోయింది. కాసేపటికి లేచింది. నడిచింది. శింశుపా వృక్షం దగ్గర నిలబడింది. ఒక కొమ్మ పట్టుకుంది. ఆ చెట్టుమీదే హనుమంతుడున్నాడు. ఆకుల మధ్య దాగి ఉన్నాడు. జనకరాజ పుత్రి బేల అయింది. రాముణ్ణి తలచుకుంది. ఆలోచిస్తోంది. కళ్ళవెంట కన్నీరు కారుతోంది. పొడుగాటి జడ కదులుతున్న పాములా కనిపిస్తోంది. గాలికి ఒరగిన అరటిచెట్టులా ఉందామె.

హా రామా! హా లక్ష్మణా! అయ్యో కౌసల్యా! సుమిత్రా! అని అరిచింది. ఏడ్చింది. అకాలంలో మృత్యువు దుర్లభమన్నారు పండితులు. అది సత్యం. ఈ రాక్షసులు బాధపెడుతున్నారు. ఇక ఒక్క క్షణం కూడా బతకరాదు. రాముడు దూరమైనాడు. నేనింకా బతికే ఉన్నాను. దురదృష్టవంతురాలిని. రాక్షసాంగనల ఆధీనంలో ఉన్నాను. నా రాముని దర్శనానికి నోచుకోలేని దాన్ని. బరువెక్కిన పడవ – గాలికి సముద్ర మధ్యంలో భగ్నమైనట్లుంది నా బతుకు. పద్మదళాయుతాక్షుడు, సింహంలా నడిచేవాడు, కృతజ్ఞుడు, ప్రియంగా మాట్లాడేవాడు రాముడు. ఆతని దర్శనం అబ్బినవారు ధన్యులు. రాముణ్ణి ఎడబాశాను. విషం తాగి చావాలని ఉంది. జన్మాంతరంలో పాపం చేశాను. ఇపుడు అనుభవిస్తున్నాను. బతకలేక చావలేక ఉన్నాను. ఛీ, స్త్రీ జన్మ ఎంత పరాధీనమైంది – అనుకుంది. విలపించింది.

పరవశ్యతాం – అన్నాడు వాల్మీకి. పర అంటే ఇక్కడ రాక్షస మూకల అధీనం లేదా రావణుని అధీనం అని లౌకికార్థం. ఆధ్యాత్మికంగా పర అంటే పరమాత్మ అధీనమని అర్థం. ప్రాణత్యాగం చేసే అధికారం లేదు. జీవుడు పరమాత్మ సొత్తు. ఆయన స్వామి. మరణం జీవుని చేతిలో లేదు. తొందరపడి స్వప్రయత్నం చేస్తే – ఆత్మహత్య చేసుకుంటే అది మహాపాపం. ప్రేతాత్మగా మారి తిరుగుతూ ఉండాలి. ఆత్మహత్య చేసుకోరాదంటుంది శ్రీ రామాయణం. ఎవరు ఎన్ని ఆశలు చూపినా, ఎంత ప్రలోభ పెట్టినా సీతాదేవి లొంగలేదు. రాక్షసాంగనలు బెదిరిస్తే – చంపి తింటామంటే – ప్రాణభయంతో, ప్రాణం మీది తీపితో లొంగిపోలేదు జనకరాజ సుత. అది పతివ్రత లక్షణం. శీల ఔన్నత్యం.

దుఃఖావేశం పొంగి పొర్లింది మైథిలిలో. పిచ్చెక్కిన దానిలా అయింది. మద్యం మత్తులో మైమరచిన దానిలా అయింది. నేలమీద పడింది. ఆడు గుర్రంలా దొర్లింది. తనలో తాను అనుకుంటోంది. ఈ రాక్షస గణానికి వశమైనాను. వాళ్ళ బెదిరింపులు సహించలేకున్నాను. రాముణ్ణి ఎడబాసినాను. ఇక నాకు ఐశ్వర్యాలెందుకు? ఆభరణాలెందుకు? బతికి లాభమేమి? నా గుండె బద్దలైపోలేదు. నాది రాతిగుండె. దీనికి జరా మరణాల్లేవు. ఇది ముక్కలైపోదు. రాముడు లేని బ్రతుకు నికృష్టమైంది. ఎపుడో చనిపోయి వుండాలి. అయినా చావు రాలేదు. ప్రాణాలెందుకు కాపాడుకుంటున్నానో తెలియదు. నాది పాపపు బతుకు అనుకుంది. రాక్షస స్త్రీలను చూసింది. "నన్ను కొట్టండి, చంపండి, చీల్చండి, కాల్చండి, ముక్కలు చేయండి, తినండి. నేను రావణుని దరి చేరను. మీరిలా అరవడం వృథా. బెదిరించడం వృథా" అంది. మళ్ళీ వెంటనే అనుకుంటోంది.

రాముడు సుప్రసిద్ధుడు. ప్రాజ్ఞుడు. కృతజ్ఞుడు. దయామయుడు. సదాచార సంపన్నుడు. అంతటివాడు నామీద జాలి చూపడంలేదు. అది నా దౌర్భాగ్యం. దండకలో ఒక్కడే పద్నాలుగు వేల మందిని హతమార్చాడు. అంతటివాడు నన్నెందుకు రక్షించడు? ఈ రావణాసురుడు అల్పవీరుడు. వీణ్ణి చంపగల సమర్థుడు రాముడు. ఈ లంక సముద్ర మధ్యంలో ఉంది. ఇక్కడికి ఎవ్వరూ రాలేరు. అయినా రామ బాణాలకు అడ్డులేదు. ఎవ్వడూ వాటిని ఆపలేరు.

## క్రోధావేశం

రావణుడు అపహరిస్తే రాముడు రక్షించలేదు. కారణమేమిటి? నేనిక్కడ ఉన్నట్లు తెలియదేమో. తెలిస్తే బాణాలతో లంకను ముంచేస్తాడు. రాక్షసుల్ని బతకనిస్తాడా? లంకను ఉఫ్ అని ఊదేస్తాడు. రావణుణ్ణి నామ రూపాలు లేకుండా చేసేవాడు. ఇపుడు నేనెలా ఏడుస్తున్నానో అలా రాక్షస స్త్రీలు ఏడుస్తారు. నన్ను రావణుడు అపహరించాడు. ఆ విషయం జటాయువుకి తెల్సు. కానీ అతడు నిహతుడైనాడు. ఆ పక్షి రాజుది మహత్కార్యం. శ్లాఘనీయం.

త్వరలో అన్నదమ్ములు వస్తారు. సముద్రాన్ని ఎండగడతారు. లంకలోకి వచ్చేస్తారు. రాక్షసుల్ని సర్వనాశనం చేస్తారు. ఎక్కడ చూసినా, ఏ వీధి చూసినా చితిమంటలే. శవాల పొగలే. గద్దలన్నీ తిరుగుతాయి. లంక స్మశానమైపోతుంది. అచిరకాలంలో నా మనోరథం ఫలిస్తుంది. ఇపుడు అనేక అశుభాలు కనిపిస్తున్నాయి. లంక దగ్ధమవుతుంది. ఇది తథ్యం. లంకలో ఇంటింటా రాక్షస స్త్రీల రోదన ధ్వనులు వినపడతాయి.

క్రూరుడు నీచుడు రావణుడు. వాడు పెట్టిన గడువు అయిపోతోంది. ఈ రాక్షసులకి ఇది ధర్మం ఇది అధర్మం –, ఇది అకార్యం – అనే విచక్షణా జ్ఞానం లేదు. ఎంతటి పాపకార్యమైనా చేస్తారు. ప్రాతఃకాల భోజనానికి నన్ను చంపుతారు. వండి పెడతారు.

రాముడు చెంత లేడు. నేనేం చేయాలి? ఇక్కడ నాకు విషం దొరుకుతుందా? ఇచ్చే దాత వుంటే ఎంత బావుంటుంది? యమ దర్శనం లభించేది కదా. నేను బతికి వున్నట్లు రామలక్ష్మణులకు తెలియదేమో. నాకోసం వెదుకుతూ ఉంటారేమో. నేను కనపడలేదని అస్త్ర సన్యాసం చేశారా? రాముడు దేహత్యాగం చేశాడా? దేవలోకం చేరాడా? అక్కడ రాముణ్ణి చూసినవారు ఎంత ధన్యులో?

**ప్రియాన్న సంభవేద్దుఃఖం అప్రియాధికం భయమ్ ।**
**తాభ్యాం హి యే వియుజ్యంతే నమస్తేషాం మహాత్మనామ్ ॥**

ప్రియ వస్తువు లభిస్తే దుఃఖం ఉండదు. సుఖం ఉంటుంది. అప్రియంతో అధిక భయం కల్గుతుంది. ద్వంద్వాలకు అతీతులైనవారు మహాత్ములు. వాళ్ళకి నమస్కారం. ప్రేమ స్వరూపుడు రాముడు దూరమైనాడు. మహాపాపి రావణుని వశమైనాను. ఇక బతకను. ప్రాణం విడిచేస్తాను.

## త్రిజట స్వప్నం

ఆక్రోశంతో మాట్లాడింది సీతమ్మ. విన్నారు రాక్షసాంగనలు. ప్రాణత్యాగం చేసుకోవాలనుకుందామె. కోపంతో ఉడికిపోయారు రాక్షస స్త్రీలు. రావణునికి విషయం చెప్పాలనుకున్నారు. కొందరు వేగంగా వెళ్ళారు. మిగిలినవాళ్ళు చెలరేగారు. మైథిలిని పాప నిశ్చయురాలా అని తిట్టారు. కఠినంగా మాట్లాడారు. భయపెట్టారు. నిన్ను ఇప్పుడే చంపుతాం. నీ మాంసం తింటాం అన్నారు.

రాక్షస గణంలోని ఒక అంగన పేరు త్రిజట. అంతవరకు నిద్రిస్తోందామె. లేచింది. అంటోంది. "దుష్టులారా! నన్ను తినండి. ఈ జనకరాజు గారాల బిడ్డ, దశరథుని కోడలు. ఆమెను తినవద్దు. నాకొక కల వచ్చింది. అది భయంకరమైంది. ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ కలలో రాక్షస వినాశనం, రామ విజయం చూశాను".

విన్నారు అందరూ. భయపడ్డారు. వచ్చిన కల చెప్పమన్నారు. చెప్పసాగింది త్రిజట.

ఒక పల్లకీ చూశాను. ఏనుగు దంతాల పల్లకీ అది. వేయి హంసలు పూన్చిన పల్లకీ అది. ఆకాశమార్గంలో వచ్చింది. ఇక్కడికి వచ్చింది. అందులో రాముడున్నాడు, లక్ష్మణుడున్నాడు. ఇద్దరూ తెల్లని పూలదండలు వేసుకున్నారు. తెల్లని బట్టలు కట్టి ఉన్నారు. కలలో సీతను చూశాను. తెల్లని కొండ మీద కూర్చుని ఉంది. ఆ కొండ సముద్ర మధ్యంలో ఉంది. తెల్లటి చీర కట్టిందామె. సూర్యకాంతిలా రామునితో కనిపించింది.



కొండంత ఏనుగు. దానికి నాలుగు దంతాలు. రామలక్ష్మణులు ఎక్కారు. తెల్లని మాలలు, వస్త్రాలు ధరించి వున్నారు. అన్నదమ్ములు సీత దగ్గరికి పోయారు. ఆమె ఆ ఏనుగుని ఎక్కింది. రాముడి ఒడిలో కూర్చుంది. వెంటనే లేచిందామె. సూర్య చంద్రుల్ని పట్టుకుంది. ఆకాశంలో కనిపించిందా ఏనుగు. ఒక రథం కనిపించింది. దానికి ఎనిమిది ఎద్దులు కట్టి వున్నాయి. సీతా రామలక్ష్మణులు ఎక్కారు. దివ్య పుష్పక విమానం ఎక్కారు. అది ఉత్తర దిక్కుకుపోయింది.

కలలో రావణుణ్ణి చూశాను. ఒళ్ళంతా నూనె పూసుకుని ఉన్నాడు. ఎర్రని బట్టలు కట్టి ఉన్నాడు. ఎర్రగన్నేరు పూలమాలతో ఉన్నాడు. బాగా తాగి ఉన్నాడు. కైపులో ఉన్నాడు. పుష్పక విమానం నుంచి కిందపడ్డాడు. ఈసారి గుండుతో కనిపించాడు రావణుడు. ఒకతె రావణుణ్ణి లాక్కుపోతోంది. ఆమె నల్ల చీర కట్టి వుంది. అంతలో గాడిదలు పూన్చిన రథం కన్పించింది. అందులో ఉన్నాడు రావణుడు. పిచ్చివానిలా ఉన్నాడు. నూనె తాగుతున్నాడు. నవ్వుతున్నాడు. నాట్యం చేస్తున్నాడు. గాడిదల రథమెక్కాడు. దక్షిణ దిక్కుకు పోయాడు వేగంగా. తర్వాత తలకిందులుగా పడ్డాడు. భయపడుతున్నట్లున్నాడు. మత్తు వల్ల స్పృహ లేనివాడై ఉన్నాడు. దిగంబరుడై ఉన్నాడు. నోటికి వచ్చినట్లు వాగుతున్నాడు. మల కూపంలో పడ్డాడు. అది చీకటిగా ఉంది. దుర్గంధంగా ఉంది.

దక్షిణానికి పోతున్నాడు రావణుడు. బురద గుంటలో పడ్డాడు. ఒక నల్లని స్త్రీ వచ్చింది. దాని శరీరమంతా బురద. ఎర్రని చీర కట్టింది. రావణుని మెడకు తాడు కట్టింది. దక్షిణ దిక్కుకు ఈడ్చుకుపోతోంది.

రావణుని కొడుకుల్ని చూశాను. వాళ్ళు నూనెలో మునిగి ఉన్నారు. పందిపై రావణుడు, మొసలిపై ఇంద్రజిత్తు, ఒంటెపై కుంభకర్ణుడు పోతున్నారు. ముగ్గురూ దక్షిణానికే పోతున్నారు.

ఒక్క విభీషణుడు అలా లేడు. తెల్లని గొడుగుతో కనిపించాడు. తెల్లని పూలదండలు వేసుకున్నాడు. తెల్లని వస్త్రాలు కట్టాడు. మంచిగంధం, మైపూతలు పూసుకుని ఉన్నాడు. శంఖాలు పూరింపబడ్డాయి. దుందుభులు మోగింపబడ్డాయి. నృత్య గీత వాద్య ధ్వనులు వినిపిస్తున్నాయి. నాలుగు దంతాల ఏనుగు వచ్చింది. నలుగురు మంత్రులతో విభీషణుడు ఎక్కాడు. అది ఆకాశంలో తిరుగుతోంది.

రాక్షసులు ఎర్రగుడ్డలు కట్టారు. ఎర్రని దండలు వేసుకున్నారు. వాద్యాలు వాయిస్తున్నారు. పాటలు పాడుతున్నారు. నూనెలో మునుగుతున్నారు. లంకలో మహాద్వారాలు గోపురాలు కూలిపోయాయి. గుర్రాలు రథాలు ఏనుగులు సముద్రంలో మునిగాయి.

ఈ లంకలోకి ఒక వానరుడు వచ్చాడు. అతడు రామదూత. మహాబలవంతుడు. లంకంతా కాల్చివేశాడు. రాక్షస స్త్రీలు నూనె తాగారు. నాట్యమాడుతున్నారు. వెర్రిగా నవ్వుతున్నారు. కేకలు వేస్తున్నారు. బూడిదైన లంకంతా తిరుగుతున్నారు. కుంభకర్ణుడు మరెందరో రాక్షసులు ఎర్రని వస్త్రాలు కట్టారు. పేడ మడుగులో పడ్డారు.

ఇది నాకు వచ్చిన కల. సీత కంట పడకండి. లేకపోతే మీరంతా నాశనమవుతారు. రాముడు సీత దగ్గరికి వస్తాడు. ఈ సీత పూజ్యురాలు. రాముని ప్రియురాలు. ఈమెను బెదిరించకండి. రాముడు చంపేస్తాడు. రాక్షసులకి ఆపదలు వస్తాయి. మంచిగా మాట్లాడండి. ఇదే మనకు తరణోపాయం. బతకాలంటే నా మాట వినండి. ఆమెకు మొక్కుదాం. బతిమలాడుదాం.

**ప్రణిపాత ప్రసన్నాహి మైథిలి జనకాత్మజా ।**
**అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్ ॥**

జనకరాజ పుత్రి మైథిలికి నమస్కరిస్తే చాలు ప్రసన్నురాలవుతుంది. ఆపదల నుంచి రక్షిస్తుంది. ఆమె దయామయురాలు. సమర్థురాలు.

ఇక ఈమె దుఃఖం పోతుంది. దివ్యభోగాలనుభవిస్తుంది. మన రాక్షసరాజు వినాశనం, రాముని విజయం, వైదేహి అభీష్టసిద్ధి త్వరలో చూస్తాం. అదుగో ఆమె ఎడమ కన్ను అదురుతోంది. ఎడమ భుజం అదురుతోంది. అదుగో పింగళ పక్షి కూస్తోంది. రామునికి స్వాగతం చెబుతున్నట్లుంది. అన్నీ శుభ శకునాలే కనిపిస్తున్నాయి. రాముడు వస్తాడు తప్పక.

స్వప్నంలో సూర్యమండలం కానీ చంద్రమండలం కానీ

చేతులతో తాకిన వానికి మహారాజ్యం ప్రాప్తిస్తుంది. ఏనుగును ఎక్కినట్లు, కొండ ఎక్కినట్లు శిఖరాగ్రం చేరినట్లు కలలలో వస్తే సర్వసంపదలు కలుగుతాయి. గన్నేరు దండ మెడలో వేసుకోరాదు. బలి పశువుకు మాత్రమే వేస్తారు.

## ఆత్మహత్యాయత్నం

రావణుని మాటలు మెదులుతున్నాయి. ఆర్తురాలైంది సీతమ్మ. సింహం మీద పడితే బెదిరిన ఏనుగులా ఉంది. అడవి మధ్యలో విడిచిన బాలికలా ఉందామె. విలపిస్తోంది. మళ్ళీ ఆలోచనలు కుమ్మరి పురుగుల్లా తొలుస్తున్నాయి. నాకెందుకు చావు రాలేదు? కోరుకున్నప్పుడు చావు రాదంటారు పెద్దలు. అది ముమ్మాటికీ నిజం. నాకు సుఖం లేదు. దుఃఖమే మిగిలింది. వజ్రాయుధానికి కొండ బద్దలవుతుంది. నా గుండె ముక్కలు కాదు. అది కఠినాతికఠినమైంది. ఈ రాక్షసుడు నన్నెలాగూ చంపేస్తాడు. నా అంతట నేను చనిపోతే దోషం ఉండదు. బతికి వుంటే నేను రాక్షసునికి వశమవ్వాలి. అది ఎంతమాత్రం జరగదు. గడువు లోగా రాముడు రాకపోతే – సుఖ ప్రసవం కాని గర్భస్థ శిశువుని – శస్త్ర చికిత్స చేసినట్టు నన్ను ముక్కలు చేస్తాడు. రాజాపరాధం చేసిన దొంగని ప్రాతః కాలాన వధించినట్లు నన్ను చంపేస్తాడు. హా రామా! హా లక్ష్మణా! హా సుమిత్రా! హా కౌసల్యా! నేను మందభాగ్యురాలిని. సుడిగాలికి సముద్రంలో మునిగిన పడవలా ఉంది నా బతుకు. పిడుగుపాటుకి రెండు సింహాలు చచ్చినట్లు జింకని కోరాను. నా లోభమే రామలక్ష్మణుల్ని దూరం చేసింది. జింక కోసం రాముణ్ణి పంపాను. రక్షణగా ఉంటానన్న లక్ష్మణుణ్ణి పంపేశాను. మూఢురాలిని. రామచంద్రా! ఇపుడు ఈ రాక్షసునితో చంపబడుతున్నాను. అది నీకు తెలియదు. వాస్తవానికి కాలపురుషుడే మృగరూపంలో వచ్చాడు.

'అనన్య దైవత్వ మియం క్షమ చ భూమౌచ శయ్యా నియమశ్చ ధర్మే'

రామా! నిన్నే పరమ దైవంగా భావించాను. అనన్య భక్తితో సేవించాను. నీ దర్శన భాగ్యం కలుగుతుందని ఆశ. ఈ రాక్షసులు పెట్టే బాధలు సహిస్తున్నాను. కటిక నేలపై పడుకుంటున్నాను. పాతివ్రత్యంతో బతుకుతున్నాను. అవన్నీ నిష్ఫలం. నిన్ను కలిసే ఆశలేదు.

పధ్నాలుగేళ్ళ వనవాసం ముగుస్తుంది. పితృాజ్ఞని పూర్తి చేస్తావు. అయోధ్యకు వెడతావు. అక్కడ కష్టాలుండవు. అన్నీ సుఖాలే. ఎందరో సుందరీమణులు. హాయిగా క్రీడిస్తావు. ఛీ. నేను దురదృష్టవంతురాలిని. ఇక బతకను, పోతాను. జీవితాన్ని త్యజిస్తాను. విషమైనా తింటాను. ఆయుధంతోనైనా చస్తాను. అయినా ఈ లంకలో విషమెవరిస్తారు? ఆయుధమెవరిస్తారు?

అలా పరి పరి విధాల ఆలోచించింది సీతమ్మ. సర్వాత్మనా రాముణ్ణి తలచింది. ఏడ్చి ఏడ్చి నోరు ఎండిపోయింది. శింశుపా వృక్షం దగ్గరికి వెళ్ళింది. చేత్తో జడని తీసుకుంది. మెడకి చుట్టుకుంది. చెట్టుకొమ్మని పట్టుకుంది. చావాలని నిశ్చయించుకుంది. రాముణ్ణి తలచింది. లక్ష్మణుణ్ణి స్మరించింది. తను మెట్టిన వంశాన్ని తలచుకుంది. అంతలో శుభ నిమిత్తాలు కనిపించాయి. అవి ధైర్యం చేకూర్చాయి. రామాగమనాన్ని సూచించాయి.

మైథిలి ఎడమ భుజం అదిరింది. ఎడమ కన్ను అదిరింది. ఎడమ తొడ అదిరింది. చీర కొంగు జారింది. ఎండకి ఎండి – గాలికి వాడిపోయి – వాన వల్ల మళ్ళీ మొలకెత్తిన విత్తనంలా జానకిలో ఆశ చిగురించింది. రాహువు నుంచి బయటపడ్డ చంద్రబింబంలా వుందామె ముఖం. శోకం దూరమైనట్లుంది. ఆందోళన తొలగినట్లైంది. మనస్తాపం శాంతించినట్లుంది. సంతోషంతో మనసు వికసించినట్లుంది.

**(సశేషం)**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన**
**మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా**
**గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

### 77వ కళ్యాణం

తేది 16-02-2025 ఆదివారం రోజు ఉదయం 10.30 గంటల నుండి హెచ్.ఐ.జి ఏ – 6 డా॥ ఏ.ఎస్.రావ్ నగర్, ఆఫీసర్స్ కాలనీ, హైదరాబాద్‌లో జరిగింది. దీనిని శ్రీమాన్ ఎం.ఎస్.ఎన్.రాజు, మల్లిక దంపతులు మరియు కాలనీ మెంబర్లు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది.

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మాండ పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

### చోళరాజు నాగకన్యను చూచుట

ఆ రాజు వేటయందాసక్తితో మరల అడవిలో సంచరిస్తూ ఇంద్రియాలకు లోబడిన వానివలె విశ్రమించలేదు. అంతలో ఆమె నేత్రములు వికసించిన పద్మమువలె ఉన్నాయి. ఆమె ముఖము చంద్ర బింబమువలె ఉన్నది. ఆమె లావణ్యం ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తేటట్లు ఉన్నది. ఆమె శ్యామల వర్ణంలో ఉంది. ఆమె మంచి యౌవనంలో ఉన్నది. ఆమె రాజహంసవలె నడుస్తున్నది. ఆ యువతి పూలు కోస్తూ, మనోహరంగా ఉంది.

ఇసుక తిన్నెను నీటితో నిండిన నది లాగేసినట్లు ఈ రాజు మనస్సును ఆమె హరించింది. అతడు పూలు కోస్తున్న ఆమె సన్నని నడుమును, ఉదరముపైని మూడు మడతలను, ఉన్నతమైన స్తన భారంచే వంగుతున్న ఆమె శరీరసౌందర్యాన్ని మిక్కిలి ఉత్సాహంతో చూస్తూ ఆ అడవినుండి ఒక్క అడుగు కూడా కదిలించలేకపోయాడు.

ఆ రాజు వేటగాని దెబ్బతిన్న మృగంవలె మన్మథుని బాణములతో (కొట్టబడి) జయింపబడి కదలలేక సైన్యాలను అన్నింటిని వదలి ఆమెను సమీపించాడు. ఆ సుందరి కూడా రాజును చూచింది. అతడు ధనుస్సును విడిచిన మన్మథునివలె మనోహర రూపంతో ఉన్నాడు. ఆ విశాల నేత్రములు కల ఆ సుందరాంగి మన్మథబాణానికి గురియై రాజుయందు మనస్సు లగ్నము కాగా పూలు కూడా కోయలేకపోయింది.

ఆ మనస్విని మరల మరల రాజును చూస్తూ చేత్తో పూలను కోస్తూ, చూపులతో దర్శిస్తూ ఈతని యందు చిత్తం లగ్నం కాగా మన్మథ విలాపాలను చూపిస్తూ అతని దృష్టి నుండి మరలకుండా ఉంది. అంతట ఆ రాజు ఆమెను సమీపించి ఆ మధురభాషిణి పవిత్రమైన కులాన్ని ప్రవృత్తిని, శీలాన్ని స్వయంగా తెలుసుకోగోరి యిలా అడిగాడు.

'ఓ కల్యాణీ! నీవెవరు? ఈ అడవిలో భయం లేకుండా ఒంటరిగా ఎలా సంచరిస్తున్నావు? నీ తల్లి తండ్రులెవరు? నీవెక్కడ ఉంటున్నావు? నీకు పెళ్లయిందా? కాలేదా? ఓ శోభనాంగీ! ఇప్పుడు నీకు వివాహం చేసుకొనుటకు తగిన వయస్సు కదా! ఒక వేళ నీకు పెళ్ళి కానట్లయితే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను ఓ వరాంగీ! నన్ను నా జీవితాన్ని నీ అధీనం చేసుకో! అన్నాడు.

అప్పుడా కన్యక ఆ రాజుతో యిలా అంది నేను బుద్ధిశాలియైన

ధనంజయుడనే సర్పరాజు కుమార్తెను నేను పాతాళలోకంలో మా తండ్రి పెంపకంలో ఉన్నాను నేను మా తండ్రి అనుగ్రహం వలన అనేక దివ్య సుఖాలు అనుభవిస్తూ చెలికత్తెలతో ఆడుకుంటూ చాలాకాలం పాతాళ లోకంలోనే ఉన్నాను, నాకు వివాహవయస్సు రాగానే మా తండ్రి ఈమెకు తగిన వరుడెవరా? అని ఆలోచిస్తున్నాడు.

ప్రభూ! నేను నా తండ్రితోను మా బంధువులతోను, యిష్టమైన వారితోను సంప్రదించకుండా నీ కోరికను అంగీకరించలేను. కావున నీవు వెంటనే పాతాళలోకానికి వెళ్ళి మా తండ్రిని అడుగు, గుణవంతుడవు, శీలవంతుడవు అయిన నిన్ను మా తండ్రి తప్పకుండా అంగీకరించి నన్ను నీకిచ్చి వివాహం చేస్తాడు. ఓ పుణ్య చరిత్రా! పుణ్యాత్మా! పూర్ణచంద్రో దయంతో ఉప్పొంగినప్పటికి సముద్రం చెలియలికట్టను దాటదు కదా! అలాగే నీవు లోకమర్యాదను కాపాడుకో! అన్నది.

అప్పుడు రాజామెతో 'ఓ సుందరీ! నేను చేసేది అధర్మమేమీ కాదు. నేను శాస్త్ర మర్యాద నతిక్రమించుట లేదు. ఈ గాంధర్వ వివాహాన్ని మునులు కూడా ప్రస్తుతించారు. రాజులు, రాజకుమార్తెలకు పరస్పరం అనురాగం కలిగినపుడు వారు గాంధర్వ వివాహం చేసుకొన్నట్లు మనం వింటున్నాము. కావున నీవు నన్ను ఎడబాయవద్దు, ఈ వివాహం ధర్మ సమ్మతమైనది స్వర్గ ప్రదమైనది. ఓ పద్మ నేత్రీ! దీనివల్ల అనర్థమేమీ జరుగదు. పాపం రాదు. అందువల్ల నీ యందు అనురాగం గల నన్ను కృతార్థుణ్ణి చెయ్యి నీవు లేకుండా నేను జీవించలేను నిన్ను వదలి జీవించాలని కాని, సుఖించాలని కాని అనిపించడం లేదు" అని పలుకగనే ఆ నాగకన్య మన్మథవశయై సిగ్గుతో తలవంచి, కాలిగోటితో నేలపై వ్రాస్తూ ఏదో చెప్పాలనుకొని చెప్పబోయింది. కానీ, సిగ్గుతో చెప్పలేకపోయింది. మౌనంగా రాజుతో గాంధర్వ వివాహానికి అంగీకారాన్ని తెలుపుతూ క్షణకాలం మౌనంగా నిలబడింది. అంతట రాజు ఆమెను తోడ్కొని పొదరిండ్లలోనికి వెళ్ళి ఆమెతో అనురాగంతో కామోపభోగాలనుభవించాడు. ఇంతలో సాయంత్రమైంది. అప్పుడు నాగ కన్య తాను ఇంటికి వెళ్ళాలని తొందరపడి, రాజును వదలి వెళ్ళలేక విరహబాధతో ఎలాగో అతని అనుమతి కోరింది. రాజుకూడ బాధపడుతూ ఆమెను వదిలి ఉండలేక, ఆమె ఎడబాటును సహించలేక, దుఃఖిస్తూ ఆమెను మరల కౌగలించుకొని చివరకు అతి కష్టం మీద ఆమె వెళ్లుట కనుమతించాడు. రాజు అనుమతి తీసుకొని సంగమ శ్రమతో అలసినదై, కళ్లు సగం మూతబడగా ఆ తోయజాక్షి బడలికతో బయలుదేరి పాతాళ లోకానికి వెళ్ళింది.

ఆ నాగకన్య తండ్రి వద్దకువెళ్ళి చోళరాజు తనను గాంధర్వ వివాహం చేసుకొన్న వృత్తాంతమంతా చెప్పింది. అది విని నాగరాజు తన కుమార్తెకు తగిన వరుడు లభించాడని సంతోషించాడు ఆరాజు కూడ లతామండపం నుండి బయటకు వచ్చి తన సేనను వెదుకుతూ వెళ్ళాడు అతని మనస్సులో ఆ నాగకన్య విలాసచేష్టలే మెదలుతున్నాయి. సూర్యుడు పశ్చిమాద్రికి చేరుతుండగా రాజు తనసేనను చూశాడు. ఇంతలో సూర్యుడస్తమించాడు. పడమటి కొండపై ఆయన ప్రకాశించాడు. ఆకాశంలో మేఘాలు ఎర్రగా ఉన్నాయి. కుంకుమతో ఎరుపెక్కిన పయోధర భారంతో సంధ్యాదేవి, తెల్లగా, ప్రకాశిస్తున్న నక్షత్రాలతో ఆకాశము శోభించినాయి. ఆ దృశ్యం ఎర్రని పగడాలలోను, తెల్లని ముత్యాలలోను కూడిన సముద్రమువలె ఉన్నది".

బిభ్రతీ కుంకుమారక్తం రయోధరభరం తదా!
బభౌ సంధ్యారుణం వ్యోమ స్ఫురత్తారకమండలమ్ ।
ప్ర వాళరక్తా ముక్తాభిః ముక్తాభిః రంజితో వారిధిర్యథా ॥

**- బ్రహ్మాండ పురాణం అధ్యాయం 7. శ్లోకాలు. 46, 47**

ఇంతలో విషయాసక్తి గల వాని మనస్సును అజ్ఞానమనే చీకటి ఆవరించినట్లుగా ప్రపంచమంతా నెమ్మది నెమ్మదిగా చీకట్లు వ్యాపించినై.

"జగాహే జగదంగాంతస్తి మిరంచ విద్యా శనైః శనైః ।
హృదయం విషయాసక్తమవిద్యా తిమిరం యథా ॥

**-బ్రహ్మాండపురాణం అధ్యాం7.శ్లోకం 47,48.**

## చోళరాజుకు నాగకన్యయందు పుత్రుడుదయించుట

ఆ నాగకన్య గర్భము ధరించి, సకల శుభలక్షణములతో కూడి, తండ్రికి ఆనందాన్ని కలిగిస్తున్నది. జ్యోతిష్కులామెను చూసి "ఈమెకు మహా తేజశ్శాలియైన పుత్రుడుదయిస్తాడు. అతడు చక్రవర్తియై సముద్రాలు, పర్వతాలు, అడవులతో కూడిన సమస్త భూమండలాన్ని దేవేంద్రుని ధర్మమార్గంలో పరిపాలిస్తాడు" అని చెప్పారు. ఆ తరువాత ఆ నాగరాజు కుమార్తె పదవనెలలో సర్వలక్షణసంపన్నుడు, సార్వభౌముడు కాదగిన చక్కని పుత్రుని కన్నది.

"అస్యాముత్పద్యతే పుత్రః చక్రవర్తీ మహాద్యుదిః ।
పృథివీం సాగరోపేతాః సశైల వనకాననామ్ ॥
పాలయిష్యతి ధర్మేణ మహేశ్వన్ద సదృశః ప్రభుః ॥

**-బ్రహ్మాండపురాణం అధ్యాయం. 7 శ్లోకాలు 50,51**

## తండ్రి వద్దకు పుత్రుని రాక

నాగరాజు ధనంజయునికి మనుమని ముఖసౌందర్యాన్ని సంతోషంతో విప్పారిన నేత్రాలతో తనివితీరా చూద్దామన్నా తృప్తి కలుగలేదు. తాతగారి లాలనతో ఆ పిల్లవాడు శుక్లపక్షచంద్రుని వలె దినదిన ప్రవర్ధమానుడయ్యాడు. కొంత కాలము తరువాత ఒకనాడు ఆ బాలుడు ఊహ తెలిసి తన తల్లి వద్దకు వెళ్ళి అమ్మా!

నా తండ్రిని చూపించు' అని అడిగాడు. అది విని ఆ తల్లి పూర్వం జరిగిన వృత్తాంతమంతా కుమారునికి చెప్పింది. ఆ పిల్లవాడు తల్లి చెప్పినదంతా విని మరల ఆమెను 'అమ్మా! భూలోకవాసియైన నా తండ్రిని వెంటనే చూడాలని నాకు మనస్సులో చాల కుతూహలంగా ఉన్నది. నేను సంతోషంతో నా తండ్రి ఒడిని చేరుటకై భూలోకానికి వెళ్ళే మార్గాన్ని నాకు తెలియ జేయి అని అడిగాడు.

కుమారుని మాటలు విని సంతోషంచి ఆ నాగకన్య అతనికి భూలోకానికి వెళ్ళే సొరంగాన్ని చూపించింది. ఆ బాలుడు ఆ సొరంగమార్గం గుండా భూలోకానికి వెళ్ళి, తన తండ్రియైన చోళరాజును సమీపించి ఆయన పాదాలకు నమస్కరించాడు. తనకు సాష్టాంగనమస్కారం చేసిన ఆ బాలుని చూసి చోళరాజు నీ వెవరవు' అని అడిగాడు అప్పుడా బాలుడు తన తల్లి చెప్పిన వృత్తాంతాన్నంతా రాజుకు వివరించాడు. రాజా వృత్తాంతమంతా విన్నప్పటికీ ఆ బాలుని తన కుమారునిగా స్వీకరించడానికి చాలా సందేహించాడు. రాజు సంశయ చిత్తంతో వానిని చూస్తూ కొంతసేపు అలాగే మౌనంగా ఉండిపోయాడు.

## ఆకాశవాణి పలుకులతో పుత్రునికి రాజ్య పట్టాభిషేకం

ఆ విధంగా సందేహిస్తున్న చోళరాజును ఊరడిస్తూ ఆకాశవాణి కనబడకుండానే ఇలా పలికింది–"ఓ రాజేంద్రా! విచారించవద్దు. ఇతడు నీ పుత్రుడే సందేహం లేదు. ఇతడు బుద్ధిమంతుడై, గొప్ప విష్ణుభక్తుడై, శేషాద్రిలో స్వయంగా వ్యక్తమైన శ్రీమహావిష్ణువును పూజిస్తాడు. ఆ భగవంతుడు ఇతని ఆరాధనకు సంప్రీతుడై అర్చామూర్తిగానున్నప్పటికీ, దానిని మీరి ఇతనితో ప్రతిరోజు సంభాషిస్తాడు, కావున ఓరాజా! నీవు ఏ మాత్రం సందేహించకుండా ఈ నీ పుత్రుని రాజ్యాభిషిక్తుని చెయ్యి".

**అతీవ విష్ణుభక్తశ్చ భవిష్యతి మహామతిః ।**
**శేషాద్రౌ చ స్వయం వ్యక్తం విష్ణు మభ్యర్చయిష్యతి ॥**
**ప్రీతశ్చాపి మహాదేవో హ్యర్చా భావమతిక్రమన్ ।**
**సల్లాపం తేన సుచిరం కరిష్యతి దినే దినే ॥**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం 8. శ్లోకాలు, 14,15.**

చోళరాజు ఆకాశవాణి పలుకులు విని, దేవవాక్కు అసత్యం కాదని తలంచి ఇంద్రుడు జయంతుని వలె పుత్రుని ఆదరించి, స్వీకరించాడు. ఆ తరువాత అంతకు పూర్వం తాను వేటకు వెళ్ళినపుడు నాగకన్యను కలిసిన చోటుకు అతనిని తీసుకు వెళ్ళాడు. అక్కడ సుందరమైన ఒక పెద్ద పట్టణాన్ని నిర్మించాడు. దానికి పుత్రుని పేరు పెట్టాడు. అక్కడ కుమారునికి రాజ్య పట్టాభిషేకం చేశాడు. ఆ తరువాత అతడు చక్రవర్తిగా భూలోకంలో ప్రసిద్ధిగాంచి సముద్రమే వస్త్రంగాగల భూమండలాన్నంతా పరిపాలించాడు. (అతడే తొండమాన్ చక్రవర్తి, అతని రాజధాని తొండమనాడు. ఇది శ్రీకాళహస్తి వద్ద ఉన్నది. అతను పరిపాలించిన ప్రాంతమునకు తొండమండలమని పేరు. ఆ కాలంలో ఈ ప్రాంతంలో దొండతీగెలు ఎక్కువగా ఉండేవి. అందువలన దీనిని తుండీమండలం' అనేవారు. అదే తొండమండలంగా మారింది).


## గోపాలకులు చెప్పిన పుట్ట వృత్తాంతం

చక్రవర్తి పరిపాలన చేస్తుండగా ఒకనాడు పాలనలో ఉన్న గోపాలకులు (గొవులనుకాసే గొల్లవాళ్ళు) ఆయన వద్దకు వచ్చి ఇలా విన్న వించుకున్నారు– "ఓ మహారాజా! మేము ఆవులను మేపుకుంటూ శేషాచలం వరకు వెళ్ళుతుంటాము. తమ ఆజ్ఞ మేరకు పాలు పిండి కుండలలో నింపి వాటిని తెచ్చేటప్పుడు ఒక విచిత్రం జరగుగుతున్నది. ఆ శేషాద్రిపై ఒక పుట్ట ఉన్నది. మేము పాల కుండలను తీసుకొని ఆ దారిలో వస్తూండగా ఆపుట్ట వద్దకు రాగానే పాలకుండలన్నీ పగిలిపోతున్నాయి. పాలన్నీ నేలపాలవుతున్నాయి. మేము ఎంత జాగ్రత్తగా పరిశీలించినా అందుకు కారణం మాకు తెలియడం లేదు. కావున ఓ మహారాజా! దేవరవారు దీనిని విచారించవలసినదిగా మనవి చేసుకుంటున్నాము".

రాజు వారి మాటలు విని ఆశ్చర్యపడుతూ, ఇదంతా దైవలీలే అని భావించి, సాయంకాలవేళ హృషీకేశుని ధ్యానిస్తూ, ఆతనియందే మనస్సులగ్నం చేసి శరీరాన్ని, వాక్కును, మనస్సును పవిత్రంగా ఉంచుకొని, నియమించుకొని, స్నానం చేసి శుచిగా నిద్రించాడు. ఆ తెల్లవారు జామున ఆయన కొక కలవచ్చింది. తెల్లవారిన తరువాత రాజు నిద్ర లేచి, స్నానసంధ్యాదులు పూర్తి చేసి, మంత్రివర్యులను రావించి వారితో ఇలా చెప్పాడు.

## స్వప్నంలో భగవత్సాక్షాత్కారం

మంత్రులారా! రాత్రి నాకొక అద్భుతమైన కల వచ్చింది. అటువంటి స్వప్నాన్ని ముందెవ్వరూ చూచి ఉండరు. అది రహస్యాతిరహస్యమైనది. నాకు స్వప్నంలో నీలమేఘశ్యాముడు, అతి సుందరమూర్తి, పద్మములవలె విశాలములైన నేత్రములుగల ఒక అద్భుతమైన పురుషుడు దర్శనమిచ్చాడు. నేనతనిని 'అయ్యా! నీవెవరవు? ఎక్కడ నుండి వచ్చావు? ఎందుకు వచ్చావు? నేను నీకేమి ఉపకారం చేయాలి? అని అడిగాను. అప్పుడా దివ్య పురుషుడు నాతో ఇలా చెప్పాడు–ఓ నరశ్రేష్ఠా! దేవేంద్ర పర్వతంపై నివసించే మహాత్ముడైన శ్రీనివానుడు నన్ను నీ వద్దకు పంపాడు. నేనెల్లప్పుడు శేషాద్రిపై ఆయన సన్నిధానంలో ఉంటాను, మహాద్భుతమైన ఈ వేంకటాద్రి ప్రభావాన్ని, మాహాత్మ్యాన్ని, వైభవాన్ని నీకు తెలియజేయమని భగవంతుడు పంపగా నేను నీ



వద్దకు వచ్చాను.

ఈ పర్వతంపై శ్రీనివాసుడు శంఖచక్రములను ధరించి శ్రీదేవి, భూదేవి సహితుడై నిత్యం విహరిస్తూ విరాజిల్లుతున్నాడు, ఈ పర్వతానికి దక్షిణం వైపున ఆయన రాజధాని ఉన్నది. ఆ రాజధాని ఏనుగులు, గుర్రాలు, రథాలతో అత్యద్భుతంగా ఉంటుంది. ఈపర్వతంపై ముప్పై మూడు కోట్ల మంది దేవతలు, మహర్షులు, సిద్ధులు, యోగీంద్రులు సదా నివసిస్తున్నారు. పవిత్రమైన ఆ పర్వతంలో సకల పుణ్య తీర్థాలున్నాయి. 1.అణిమా 2. మహిమా 3. గరిమా 4. లఘిమా 5. ప్రాప్తి 6. ప్రాకామ్యం 7.ఆశత్వం, 8. వశిత్వమనే అష్టసిద్ధులు ఆపర్వతం తూర్పువైపున తపస్సు చేస్తున్నై.

శిలోచ్చయేఽత్ర వై శంఖ చక్రావనతహస్తకః ।
శ్రీ భూమి సహితో నిత్యం విహరన్ రాజతే ॥
అద్రేర్దక్షిణతస్తస్య రాజధానీ విరాజతే ।
జగ వాజి రథోపేతా సర్వాద్భు తమయా సదా ॥
తస్మిన్‌గిరౌ త్రయస్త్రింశత్కోటి సంఖ్యశ్చ దేవతాః ।
సర్వే మహర్షయశ్చాపి సిద్ధా యోగివరా స్తథా ॥
వసన్తి సర్వతీర్థాని తస్మిన్ గిరివరే శుభే ।
అణిమా మహిమాచైవ గరిమా లఘిమా తథా ॥
ప్రాప్తిః ప్రాకామ్యమీశత్వం వశిత్వం చాష్ట భూతయః ।
తస్యాద్రేః పేర్వభాగే వై చరన్తి విపులం తపః ॥

**-బ్రహ్మాండ పురాణం. అధ్యాయం 8. శ్లోకాలు. 34-38.**

ఆ పర్వతానికి తూర్పు దిక్కున శ్రీకాళహస్తి అనే ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రముంది. ఆపట్టణంలో మహాదేవుడైన పరమ శివుడు వేంచేసి ఉన్నాడు. శ్రీకాళహస్తికి ఉత్తరం వైపున సువర్ణ ముఖరీనది ఉంది. సర్వ పాపాలను పోగొట్టే ఆ పుణ్యనదిని మనులు సేవిస్తూ ఉంటారు. ఆ నదీతీరంలో శుక మహర్షి మొదలగు మునిశ్రేష్ఠులు శేషశైలేశుడైన శ్రీనివాసుని అనుగ్రహానికై ఘోర తపస్సు చేస్తున్నారు.

ఆ పర్వతానికి చుట్టు ప్రక్కల (56మైళ్ళు) ఏడుయోజనాల దూరంలో ఉన్న ప్రజలందరు సర్వపాపముల నుండి విముక్తులై విష్ణులోకానికి వెళతారు. ఇక అక్కడ అష్టాక్షరీ మహామంత్రాన్ని జపించేవారిని గూర్చి ఏమని చెప్పాలి? ఆ దేవదేవుణ్ణి! ఆయన దివ్యాలయాన్ని దర్శించడానికి వెంటనే శేషాచలానికి రమ్మని ఆ మహాపురుషుడు నన్ను పిలిచాడు. నేనా దివ్య పురుషునితో పాటు శేషాచలానికి వెళ్ళాను. ఆ పర్వత శిఖరములపైనున్న మహా వృక్షాలు ఆకాశాన్నంటుతున్నాయి. అక్కడకు వెళ్ళిన తరువాత ఆ దివ్యపురుషుడు స్వర్ణమయమై, రత్నాలంకృతమై దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న దివ్యవిమానాన్ని నాకు చూపించాడు. నేను చూస్తూండగానే ఆ దివ్యపురుషుడు అదృశ్యమయ్యాడు. మరుక్షణంలో ఆ దివ్య విమానం కూడ అదృశ్యమైంది.

నేనిటువంటి అద్భుతమైన కలగన్నాను, ఒడలు గగుర్పాటు కలిగించే ఇటువంటి ఆశ్చర్యమైన కల ఇంతకుముందెవ్వరికీ వచ్చి ఉండదు. దీని ఫలిత మేమిటో మీరు విచారించండి అన్నాడు. అంతట ఆ మంత్రులు' మహారాజా! భగవంతుని దివ్యానుగ్రహ విశేషం వలన మీకిటువంటి కల వచ్చింది. ఆయనే మీయందలి కృపతో మీకీ స్వప్న దర్శనమిచ్చాడు. ఇంతకు ముందు గోపాలురు చెప్పిన ఆ పుట్టలోనే భగవానుడు తప్పక ఉంటాడు. గోపాలురు ఏ పుట్ట సమీపంలో తమ పాలకుండలు పగిలి పోయాయని చెప్పారో, ఆ పుట్టపైన పాలతో అభిషేకిస్తే భగవంతుడు ప్రత్యక్షమౌతాడని చెప్పారు. వారంతా దానిని గురించి ఆలోచిస్తున్నారు.

## శేషాద్రి నుండి శబరుని రాక

ఇంతలో ఆ రాజు వద్దకు ఒక బోయవాడొచ్చాడు. అతడు (కారుదుబ్బు) కాలమేఘం వలె నల్లగా ఉన్నాడు. ధనుర్బాణాలు, ఖడ్గం ధరించాడు. తలలో నెమలిపించాన్ని పూతీగెలను, చిగురుటాకులను అలంకరించుకున్నాడు. అతడు రాజుగారికి శిరస్సు వంచి నమస్కరించి, అంజలి బద్ధుడై నిలబడి ఇలా విన్నవించాడు–"ప్రభూ! నేను శేషాద్రిపై నివసిస్తూ క్రౌంచలను పండించు కొంటూ జీవిస్తున్నాను. వ్యవవసాయం చేసుకొంటూ

భార్యాపుత్రులతో, బంధువులతో కలసి బ్రతుకుతున్నాను. ప్రతిరోజు ఒక శ్వేతవరాహం అక్కడకు వచ్చి మేమందరం అక్కడ ఉండగానే ఆ కొర్ర (పంటనంతా) ధాన్యమంతా తినేస్తున్నది. నాకుమారుణ్ణి ధాన్యానికి పంటకు కాపలా పెట్టి భగవంతునికి ప్రియమైన కొర్రలను తేనెతో కలిపి స్వామికి నివేదించుటకై తేనె కొరకు నేనా పర్వతంపై చాలా దూరం వెళ్ళాను.

నేను అడవి నుండి తేనె తీసుకొని వచ్చేటప్పటికి నా కుమారుడు కొర్రల యందాశతో వాటిని చేతిలో వేసుకొని నలిపి తింటున్నాడు. అది చూసి నాకు చాల బాధ కలిగింది. నేనెప్పుడూ భగవంతునికి నైవేద్యం పెట్టకుండా తినలేదు. అందువల్ల నాకు కోపం వచ్చి, వాడు ఏడుస్తున్నా వాణ్ణి చంపడానికి సిద్ధమయ్యాను. ఆకాశవాణి పరమ దుర్మార్గుడనైన నాతో ఇలా అన్నది.

"ఓరీ! కొఱ్ఱలు భగవంతుని నివేదించలేదని నీ కుమారుని చంపకు. భగవంతుని యందు నీకుగల దృఢమైన భక్తికి సంతోషించి స్వామి వాటిని ఆరగించాడు. అంతేకాదు చక్రవర్తికి స్వప్నంలో స్వామి సాక్షాత్కరించాడు. కావున నీవు ఆ రాజు వద్దకు వెళ్ళి, అతనికి స్వప్న వృత్తాంతాన్ని జ్ఞాపకంచేసి, అతనిని ఇక్కడకు తోడ్కొని రమ్ము" అని ఆకాశవాణి చెప్పిందని ఆ బోయవాడు రాజుకు నివేదించాడు.

రాజా శబరుని మాటలు విని ఆశ్చర్యపడి మంత్రులతో ఏమిటిదంతా చాలా ఆశ్చర్యకరంగా ఉన్నది గోపాలకులు చెప్పింది, స్వప్నంలో కనబడింది, బోయవాడు చెప్పిందీ విచారిస్తే ఈ మాడింటికీ ఏదో సంబంధం ఉన్నదని విచారించాడు. ఆ తరువాత పుట్టనభిషేకించుటకై వెయ్యి ఆవుల పాలను శేషాద్రికి తీసుకురమ్మని మంత్రులను ఆజ్ఞాపించి చక్రవర్తి ఆ బోయవానితో పాటు శేషాచలానికి వెళ్ళాడు.

## చక్రవర్తికి శ్వేతవరాహ దర్శనం

రాజు శబరునితో పాటు శేషాద్రికి వెళ్ళి అక్కడ శబరుడు చెప్పినట్లు కొర్ర ధాన్యం తింటున్న శ్వేత వరాహాన్ని, దివ్య విమానాన్ని చూడాలనే కుతూహలంతో వెదుకుచుండగా వారికి కొర్ర పంటను తింటున్న శ్వేతవరాహమొకటి కనబడింది. అది భయంకరంగా గర్జిస్తూ, ఇటు అటు తిరుగుతూ, మహా పరాక్రమం గలదై ఉన్నది. అలాగే వారికొక దివ్యవిమానం కూడ కనబడింది. అది రత్నాలంకృతమై, అనేకవేల సూర్యులతేజస్సుతో ప్రకాశిస్తూ, స్వప్నంలో అద్భుతంగా కనబడిన దానివలె ఉన్నది, అంతకు ముందెప్పుడూ చూడనిదివలె ఉన్నది. ఇంతలో ఆ వరాహం ఆ బోయవారి కొర్రలను తృప్తిగా తిని వెంటనే వాళ్ళు చూస్తుండగానే దగ్గరలో నున్న పుట్టలో ప్రవేశించింది. రాజు మరల ఆ విమానాన్ని చూసి చాల ఆశ్చర్యపడి, ఆ బోయవానిని దీనికి కారణమేమిటని అడిగాడు. ఆసక్తితో అడిగిన ఆ రాజుతో బోయవాడిలా చెప్పాడు–

## క్షీరాభిషేకం – శ్రీనివాసావిర్భావం

"ప్రభూ! ఈ వరాహం సామాన్యమైన వరాహం కాదు, ఈయన పాతాళంనుండి భూమిని ఉద్ధరించిన వరాహమూర్తి, భగవంతుడు మీరింతకు ముందెన్నడు చూడనిది, ఇప్పుడు దర్శిస్తున్న దివ్య విమానం కూడా ఆయనదే. ఆయన ఈ పుట్టలో నివాసముంటున్నాడు కాబట్టి ఈ పుట్ట సాధారణమైనది కాదు. మహత్తరమైనది.

"అయం వరాహో న వరాహ మాత్రం ।
దేవః స్వయం యో ధరణీం బభార ॥
ఇదం విమానం చ తదీయమేవ ।
దివ్యం త్వయా దృష్ట మదృష్ట పూర్వమ్ ॥
వాసో–స్య వల్మీకమిదం మహాత్మన్ ।
మహత్తరం నూన మితస్తు హేతోః ॥

-బ్రహ్మాండపురాణం అధ్యాయం 9 శ్లోకాలు: 6,7.

ఆ మహావరాహం ఈ పుట్టలోనుండే బయటకు వచ్చి మరల దీనిలోకే వెళ్తున్నది కావున ఓమహారాజా! పదునైన పలుగులతో(గడ్డపారలతో) ఈ పుట్టను త్రవ్వించి చూడండి. భగవానుడు ఈ పుట్టలోనే తప్పక నివాసముంటున్నాడని నాకు తోస్తున్నది." అని బోయవాడు చెప్పిన మాటలు విని రాజు ఆ పుట్టను త్రవ్వుట ప్రమాదమని భావించి దానిని త్రవ్వలేదు. ఆ గోపాలకులు తెచ్చిన లెక్కలేనన్ని పాలకుండలతో భక్తితో ఆ పుట్టను అభిషేకించాడు.

వెంటనే ఆ పుట్టలోనుండి ఒక దివ్య విమానం సాక్షాత్కరించింది. అది రత్నభూషితమై, మహాద్భుతమై ఉన్నది. దాని వైభవాన్ని మాటలలో వర్ణించడానికి గాని, మనస్సులో ఊహించడానికి గాని సాధ్యం కాదు. అటువంటి శ్రేష్ఠమైన విమానాన్ని దర్శించిన రాజు సంతోషంలో శిరస్సు వంచి దానికి నమస్కరించాడు. ఆ దివ్య విమానంలో నీలమేఘశ్యాముడు, లక్ష్మీదేవికి నివాస స్థానమైనవాడు, ఆశ్రిత రక్షకుడు, శ్రీవత్సమనే పుట్టుమచ్చ కలవాడు, పద్మములవలె విశాలమైన నేత్రములు కలవాడు, రెండు చేతులలో శంఖ చక్రములను ధరించినవాడు, వరద హస్తముతో ప్రాణులకు వరముల నిచ్చేవాడు, మరొకచేతిని నడుముపై పెట్టుకొని విరాజిల్లు తున్నవాడు, పీతాంబరం ధరించి ప్రకాశిస్తున్నవాడు, కిరీటంలో పొదగబడిన రత్నాలతో శోభిస్తున్నవాడు, శాంతస్వరూపుడు, శాశ్వతుడు, దేవతలచే సేవించ బడుతున్న పరవాసుదేవుడైన శ్రీనివాసుని దర్శించాడు.

"శ్రీవత్సాంకం పుండరీకాయ తాక్షం ।
శంఖం చక్రం ధారయన్తం కరాభ్యామ్ ।
శాంతాకారం శాశ్వతం శ్రీనివాసం ।
సేవ్యం దేవైః వాసుదేవం దదర్శ ॥

-బ్రహ్మాండ పురాణం అధ్యాయం.9.శ్లోకాలు:11,12.

## చక్రవర్తికృత శ్రీనివాసస్తుతి

అంతట చక్రవర్తి ఆ దివ్యవిమానంలో ఆవిర్భవించిన దేవదేవుడు, భక్తవత్సలుడు అయిన శ్రీనివాసునికి మరల మరల సాష్టాంగనమస్కారములు చేసి అనేక స్తుతులతో ఆ పరాత్పరుని ఈ విధంగా స్తుతించాడు.

"బ్రహ్మారుద్రో వసవో యేచ సాధ్యాః ।
విశ్వేదేవాఃమరతఃగుప్తపూరే ।
ఏతేచాస్యే దేవముఖ్యా నియోగం ।
పశ్యన్తస్తే విష్టపాన్ వర్తయన్తే ॥

-బ్రహ్మాండ పురాణం అధ్యాయం 9.శ్లో. 14.

ఓ దేవదేవా! బ్రహ్మదేవుడు, పరమ శివుడు, అష్ట వసువులు, సాధ్యులు, (దేవతలు విశ్వదేవతలు, సప్త మరుత్తులు ఇంకా ఇతర దేవతాగణాలు నీ ఆజ్ఞానుసారం ముల్లోకాలను పరిపాలిస్తున్నారు. అత్యద్భుతమైన నీ దివ్యరూపాన్ని సనాతనులైన యోగిపుంగవులు కూడ దర్శించలేరు. అటువంటి నీవు మాబోటి సామాన్యమైనవారిని అనుగ్రహించుటకై ఈ రూపంతో దర్శనమిచ్చావు. అగ్ని ముఖంగా హోమము చేయదగిన వాడవు నీవే. అగ్నిహోత్ర స్వరూపుడవు నీవే. హోమము చేయువాడవు నీవే. అగ్నిలో హోమము చేయబడే ద్రవ్యము నీవే నిన్ను ఉద్దేశించే హోమాలు, యజ్ఞ యాగాలు చేస్తారు. ఆ యజ్ఞ ఫలమునీవే. నీవే యజ్ఞ స్వరూపుడవు నీకంటె వేరైనదేదీ జగత్తులో లేదు.

పరబ్రహ్మస్వరూపుడవైన నీవు ఎప్పుడూ ఒక్కడివే. ఈ ప్రపంచం నీకంటె భిన్నమైనది కాదు. సనాతనుడవైన నీ సంకల్పం వల్ల ఈ చరాచర జగత్తు మొదట సృష్టించబడింది ఆ తరువాత ఆ జగత్తుకు నీవు అంతర్యామివై, సర్వవ్యాపివై దానిని పరిపాలిస్తున్నావు. నీకు పూర్వం బ్రహ్మకాని, శివుడుకానిలేరు. భూమి, ఆకాశం లేవు. నీవప్పుడు జలమును సృష్టించి, శేషతల్పంపై నీవొక్కడవే జాగరూకుడవై శయనించి ఉన్నావు.

లోకంలో నీ మహిమను ఎవరూ తెలిసికొనలేరు. కాని లోకమంతా నీకు తెలుస్తుంది. నీవు ఆది మధ్యాంతరహితుడవు. వేదాలు నీవు సచ్చిదా నందస్వరూపుడవని కీర్తిస్తున్నాయి. అటువంటి నీకు నమస్కరిస్తున్నాను. ప్రళయకాలంలో సర్వ జగత్తును లయింపజేసే కాలస్వరూపుడవు నీవే. ఆదిలో జగత్తును సృష్టించేవాడవు నీవే. ఈ సమస్త ప్రపంచాన్ని పరి పాలించేవాడవు, రక్షించేవాడవు నీవే, సృజించబడేది, నాశము చేయబడే సమస్త వస్తుజాతము నీవే రక్షింబడేదినీవే. కర్త, కర్మకూడ నీవే.

యజ్ఞస్వరూపుడవు నీవే, యజ్ఞ దీక్షితుడైన యజమానివి నీవే, స్వాహాకారంతో యజ్ఞంలో అర్పించే హవిస్సుకూడా నీవే, హవిస్సును స్వీకరించే అగ్నిహోత్రుడవు కూడానీవే, నీవీ లోకమంతా వ్యాపించి ఉన్నావు, నిత్యానపాయిని(నిన్ను వదలకుండా సదా నీతోనేఉండే) లక్ష్మీదేవి నిన్ననుసరించి ఉంది. లక్ష్మీసఖుడవు, పుట్టుకలేనివాడవు, సర్వవ్యాపివి, సర్వలోక ప్రభువువు. ఆశ్రిత జనసంరక్షకుడవు, శుభప్రదుడవు, సకలమంగళ ప్రదాతవు అయిన నిన్ను నేను శరణు వేడుచున్నాను."

త్వం యజ్ఞో దీక్షితస్త్వంచ స్వాహా–సౌ త్వంహుతాశనః ।
త్వయావ్యాప్తమిమం లోకయనువ్యాప్తారమా తవ ॥
సో౽హం త్వాం శరణం ప్రాప్తః పద్మాసఖమజం విభుమ్ ।
శేషిణం సర్వజగతాం ప్రణతార్తిహరం శుభమ్ ॥

-బ్రహ్మాండపురాణం అధ్యాయం 9.శ్లోకాలు 21,22.

(సశేషం)

## భక్తిమార్గంలో ఉన్న 10 కంటకాలు

| | | |
|---|---|---|
| 1. | సన్నింద | : సత్పురుషుల్ని విమర్శించడం, నిందించడం |
| 2. | అసతోనామ వైభవ కథ | : అసత్యాన్ని, అధర్మ వర్తనుల్ని ప్రశంసించడం |
| 3. | శ్రీ శేషయోః భేదధీ | : దేవతా మూర్తులను భేదదృష్టితో, తారతమ్యాలతో చూడడం |
| 4. | అశ్రద్ధా గురోర్వచనే | : ఆచార్యుల/గురువుల మాట మీద, శ్రద్ధాభక్తులు లేకపోవడం/లోపించడం |
| 5. | శాస్త్రవచనే అశ్రద్ధా | : శాస్త్రాల్ని నమ్మకపోవడం |
| 6. | అశ్రద్ధా వేదవచనే | : వేదవాక్కులపై శ్రద్ధ లేకపోవడం/నమ్మకపోవడం |
| 7. | నిషిద్ధ వృత్తి | : అనుమానంతో నామజపం చేయడం, పవిత్రాచరణ లోపించడం |
| 8. | నామ్నోర్థవాద భ్రమ | : నామజపం చేసేటప్పుడు ఏదో ఒక నామాన్నే లాభకరంగా భావించి, మిగతావాటిని (నామాలని) నిర్లక్ష్యం చేయడం |
| 9. | కర్తవ్య విహీన జపం | : కర్తవ్యం వదలి జపం మాత్రమే చేస్తూ కూర్చోడం |
| | ధర్మ సామ్యమ్ | : ధర్మంలా అనిపించే అధర్మాలను నమ్మడం, ఆలోచించడం, ఆచరించడం |

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 28 శ్లోకం

"నాథే నః పురుషోత్తమే త్రిజగతా మేకాధిపే చేతసా
సేవ్యే స్వస్య పదస్య దాతరి సురే నారాయణే తిష్ఠతి ।
యం కంచి త్పురుషాధమం కతిపయ గ్రామేశ మల్పార్థదం
సేవాయై మృగయామహే నరమహో మూకా వరాకా వయం ||"

ప్రభూ! మాకు నాథుడును, పురుషోత్తముడును, మూడు లోకములకు ఏకైకనాథుడు, మనసు మాత్రము చేత సేవింపగలిగేవాడు, సేవించిన వారికి తన పదవి ఇచ్చేవాడు, పరమాత్మ అగు నారాయణుడుండగా, మాతో ఏ సంబంధము లేని ఒకానొక మానవాధముడిని ఏ కొద్ది గ్రామములకో అధిపతి అగు వానిని, అల్పాల్పములగు ఫలములను ఇచ్చే వానిని, ఒక మానవమాత్రుని సేవించుటకై తహతహలాడుచున్నాము. అహో! ఏమి మా జాడ్యము! నారాయణుని సేవింపక, నరుని సేవించు వారికి స్పష్టముగా తెలియుటకై వారికి గల తారతమ్యమును ఇందు స్పష్టముగా వివరించినారు.

నారాయణుడు సర్వ ప్రాణుల సమూహమునకు ఆశ్రయుడై, సమస్త చేతనులకు అంతర్యామియై ఉండువాడు. అతడు లేనిదే నిలకడలేనివాడు ఈ నరుడు. నారాయణుడు మనకు ప్రభువు. పరమాత్మకు మనకు విడదీయలేని తొమ్మిది విధములైన సంబంధములు ఉన్నాయి.

1. పితృ-పుత్ర – కార్యకారణ సంబంధము
2. రక్షకుడు-రక్ష్యుడు – రక్ష్య రక్షక సంబంధము
3. శేషి-శేషుడు – శేష శేషి సంబంధము
4. భర్త-భార్య – భర్తృ భార్య సంబంధము
5. జ్ఞేయ-జ్ఞాత – జ్ఞాతృ జ్ఞేయ సంబంధము
6. స్వామి-దాసుడు – స్వస్వామి సంబంధము
7. ఆధారము-ఆధేయము – ఆధార ఆధేయ సంబంధము
8. ఆత్మా-శరీరము – శరీరాత్మ సంబంధము
9. భోక్త-భోగ్యము – భోక్త భోగ్య సంబంధము.

నరునకు నరునితో సంబంధము కల్పితము. అతడు త్రిజగన్నాథుడు. పరమాత్మను మనసుతో సేవించిన చాలును. భుక్తికై ప్రస్తుతించే నరుడికి శరీరమును కష్టపెట్టి ఊడిగము చేయవలెను.

నారాయణుడు తనని కొలిచిన వారికి తన పదమునే ఇచ్చును. ఈ నరుడల్పాల్పములను ఈడేర్చును. అతడు పురుషోత్తముడు, వీడు పురుషాధముడు. అతడు దివ్యుడు, ఇతడు మర్త్యుడు. ఇంత భేదమున్నను ఈ నరులనే కొలుచు మూఢాత్ములమగు మా సంగతి ఏమను కోవలెనో తెలియదు.

"యదా హి చేంద్రియార్థేషు"అని గీతలో తెలియజేసినట్లు భగవద్భక్తి కలవారిని మనము ఆశ్రయిస్తే మనకు కలిగిన సకల సామ్రాజ్యము అంతా పరమాత్మవలననే లభించింది అనే జ్ఞానాన్ని కలిగిస్తారు, ఉపకారస్మృతి కలిగిస్తారు. అధములను ఆశ్రయిస్తే మోసమే జరుగుతున్నది.

ఓ పురుషోత్తమా! పురుష శబ్దం ఆత్మతత్త్వాన్ని తెలియజేసేది. అలాంటి పురుషులలో ఉత్తమ మైన వాడు తనకి సమానుడు కానీ, మించిన వాడు కానీ, లేనందున పురుషోత్తముడు శ్రీమన్నారాయణుడు. స్వామి నువ్వు ప్రసాదించిన ఈ ఇంద్రియములు నీ విషయముల యందే ప్రవర్తించేలా అనుగ్రహించుము. సర్వ ఫలాలను అనుగ్రహించేది పరమాత్మ మాత్రమే, ఇతరు లెవ్వరు అనుగ్రహించలేరు. అటువంటి సామర్థ్యం కలిగిన త్రిలోకాధిపతి, ఏకచ్ఛత్రాధిపతి అయినటువంటి పరమాత్మయే శరణు. శరణాగతి ఆరు లక్షణములతో ముఖ్యమైనది "మహావిశ్వాసం" చేసే కర్మలకు

సాక్షి. ఫలప్రదాత పరమాత్మయే అని మహావిశ్వాసం కలిగి ఉన్ననాడు సకలము లభింపచేయును. ఇహలోక, పరలోక వాంఛలను కూడా తీర్చగల సర్వశక్తి సమర్థుడు పరమాత్మ కనుకనే కులశేఖరాళ్వార్లు పరమాత్మయే ఫలప్రదాత, తానే పురుషోత్తముడు అంటూ ఉపాయ స్వరూపమును తెలియజేస్తున్నారు.

స్వామీ! నువ్వు ప్రసాదించిన ఈ ఇంద్రియములు నీ విషయముల యందే ప్రవర్తించేలా అనుగ్రహించుము. సర్వ ఫలాలను అనుగ్రహించేది పరమాత్మ మాత్రమే, ఇతరు లెవ్వరు అనుగ్రహించలేరు. అటువంటి సామర్థ్యం కలిగిన త్రిలోకాధిపతి అయినటువంటి పరమాత్మయే శరణు. అంటూ, ఆదర్శనీయ జీవితము ద్వారా అనుకరింపదగిన అద్భుత చరితాత్ముడుగా భక్తుల హృదయాలలో స్థిరంగా నిలిచిపోయాడు 'రోహిదాసు'.

పరమ పవిత్రమైన కాశీ క్షేత్రంలో రఘు అనే వ్యక్తి వుండేవాడు. అతడు కుల వృత్తిననుసరించి చెప్పులు కుట్టేవాడు. రాత్రులందు రాజుగారి ఆస్థానంలో కాపలాదారుగా కూడా ఉండేవాడు. చాలా కాలంగా అతనికి సంతానం లేదు. పుత్ర సంతానం అనుగ్రహించమని భగవంతుణ్ణి ధ్యానిస్తూ ఉండేవాడు. భగవత్ప్రసాదంగా అతనికొక పుత్రుడు జన్మించాడు. అతనికి 'రోహిదాసు' అని నామకరణం చేశారు.

పుట్టినది మొదలుకొని కుర్రవాడు విలపించలేదు. సదా ప్రశాంత వదనుడై కనిపించేవాడు. పానీయములను కూడా తాగడం లేదు. ఇతని ప్రవర్తన కుటుంబంలోని వారినే కాకుండా, నగరవాసులందరినీ కూడా ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఊరి ప్రజలంతా వచ్చి చూసేవారు. బ్రహ్మజ్ఞాన కాంతులీనుతున్న ఆ బాలుని ముఖ సరోజమును చూసి ఇతడు మహాజ్ఞాని వలే కనబడుతున్నాడు. యోగ భ్రష్టుడై ఇలా జీవించాడేమో అని చెప్పుకునేవారు.

ఒకనాడు ఈ వింత వార్త విని రాజు కొలువులో ఉన్న నర్తకి రోహిదాసుని చూడటానికి వచ్చింది. ప్రసన్న వదనుడై ఉయ్యాలలో పడుకొని ఉన్నాడు. నర్తకి రోహిదాసుని సమీపించి చూసింది. ఆ బాలునిలో గోచరించే ఆధ్యాత్మిక సౌందర్యమును చూసి ఆశ్చర్యపోయింది. ఎంతటి బ్రహ్మ వర్చస్సు, గత జన్మలో వీరు గొప్ప సాధకులై ఉండాలి. ఏనాటి బంధమో! ఇక్కడ జన్మించారు. జన్మ రహస్యం తెలియనెవరితరం. 'మహాత్మా! ఎవరు మీరు?' అని అప్రయత్నంగా అన్నది రాజనర్తకి.

వెంటనే ఉయ్యాలలో పడుకొని వీక్షిస్తున్న రోహిదాసు నవ్వుతూ 'ఒకనాడు గురు ఆజ్ఞానుసారము నీ ఇంట నైవేద్యమునకు వలయు వస్తు సామగ్రిని నిరాకరించిన బ్రాహ్మణ యువకుడను. గురుశాపవశాత్తు ఈ ఇంటిలో కడతేరుటకు రోహిదాసుగా జన్మించినాను.' అనెను. నర్తకి మనసులో ఆలోచన ప్రారంభమైంది. అవును తనకి ఇంకా జ్ఞాపకం ఉంది. ఇటీవలనే కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన ఇది. ఒక జన్మలోని సమకాలికులంతా బ్రతికి ఉండగా, ఇతడు బాల్యమునందే మరణించి, ఈ ఇంట్లో మరల జన్మించాడు.

కాశీ క్షేత్రంలో భాగవతోత్తముడైన రామానంద స్వామి ఉండేవాడు. వారి వద్ద అనేకమంది శిష్యులు ఉండేవారు. ఒకనాడు శిష్యులలో ఒకరిని పిలిచి భగవంతునకు నైవేద్యమును సమర్పించుటకు వస్తు సామగ్రిని ఒక గృహస్థుని వద్ద నుండి అడిగి తెమ్మని చెప్పాడు. 'అయితే ఒక షరతు ఆ గృహస్థుడు భక్తుడై ఉండాలి, శీలవంతుడై ఉండాలి, ఉత్తమ మార్గంలో జీవన యాత్ర చేసేవాడుగా ఉండాలి.' అని చెప్పారు రామానంద స్వామి. శిష్యుడు బయలుదేరాడు ఒక ఇంటి ముందు నిలబడ్డాడు. తన అభీష్టము తెలియజేశాడు. ఆ ఇంటిలో నుండి ఒక స్త్రీ కావలసిన వస్తువులన్నీ ఒక పళ్ళెంలో ఉంచుకొని తెచ్చింది. గురువుగారి షరతులు జ్ఞాపకం వచ్చాయి ఆ బ్రహ్మచారికి. 'మీ పేరేమిటి?' అని ప్రశ్నించాడు. నేను రాజనర్తకిని అని సమాధానం చెప్పింది. ఎందుకో బ్రహ్మచారి మనసు వాటిని గ్రహించుటకు అంగీకరించలేదు 'వద్దు' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంతలో వర్షం ప్రారంభమైంది, గాలి జోరుగా వీస్తున్నది, కుండపోతగా వర్షం కురుస్తున్నది. ఒక ఇంటి ముందు పంచలో బ్రహ్మచారి తలదాచుకున్నాడు. ఇంటి యజమాని వచ్చి చూశాడు. ఆ బ్రహ్మచారిని గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. తన వద్ద ఆ వస్తు సామగ్రిని గ్రహించి తన బ్రతుకును చరితార్థం చేయమని ప్రార్థించాడు. వర్షం తీవ్రంగా కురుస్తున్నది. ఇంతకన్నా మరో మార్గం కనిపించడం లేదు. ఆ ఇంటి యజమాని చెప్పులు కుట్టి జీవించే మాదిగ కులానికి చెందిన వాడు. అయినను చేయగలిగింది ఏమీలేక అతని వద్ద నుండి సంభావన గ్రహించాడు. అది తీసుకొని గురువుగారి వద్దకు చేరాడు. త్రికాలవేది అయిన రామానంద స్వామి జ్ఞాన దృష్టితో సమస్తము గ్రహించాడు.

వత్సా! నా ఆజ్ఞకు వ్యతిరేకముగా ప్రవర్తించావు. నీచవృత్తిలో జీవించే మాదిగవాని ఇంట సంభావన తెచ్చి అపవిత్రం చేయ సంకల్పించావు. నీవు దీనికి పరిహారంగా మాదిగవాని ఇంటనే జన్మించగలవు అని శపించాడు. అశ్రుపూరిత నయనాలతో బ్రహ్మచారి గురువుగారి పాదాలకు నమస్కరిస్తూ, 'మహాత్మా! మోక్షధామం చేరాలని మీ పాదాలను ఆశ్రయించాను. చివరకు నా బ్రతుకు ఇలా నరకతుల్యమైనది' అంటూ బోరున ఏడుస్తాడు.

రామానందుడు బ్రహ్మచారిని ఓదారుస్తూ, 'నాయనా! దిగులు చెందకు, ఇందులో నేను నిమిత్తమాత్రుడను. ఇదంతా భక్తవత్సలుడైన పాండురంగ దేవుని దివ్యసంకల్పము. నీకు ఇది చివరి జన్మ, మోక్షధామమును చేర్చుటలో, అది కడపటి

సోపానము. భక్తికి జాతి, వర్ణ, లింగ, భేదాలు లేవు అని నీ జీవితము ద్వారా ప్రపంచానికి తెలియచేయాలని, ఆ భగవానుడు ఈ విధంగా చేశాడు. ఇప్పుడు జరిగినదంతా కాకతాళీయన్యాయమే' అని తెలియజేయగా, గురుకృపకు పులకాంకితుడైన బ్రహ్మచారి రామానందుని పాదాలపై పడి తన కన్నీటితో గురువు పాదాలను అభిషేకం చేస్తాడు.

తర్వాత కొంతకాలానికి బ్రహ్మచారి గతిస్తాడు. అతడే తను సంభావన గ్రహించిన రఘు అనే మాదిగవాని ఇంట రోహిదాసుగా జన్మిస్తాడు. ఈనాడు తనను దర్శించడానికి వచ్చిన నర్తకి ఎవరో కాదు గతజన్మలో తాను సంభావనను గ్రహించుటకు నిరాకరించినది ఈ నర్తకి వద్దనే. తన గత జన్మ వివరాన్ని తెలియజేయగానే రాజ నర్తకి దిగ్భ్రాంతి చెందింది. రోహిదాసుకు నమస్కరించి, 'మహాపురుషా! మీరు జ్ఞాన స్వరూపులు, మీకు తెలియనిది లేదు. మీకు మేము చెప్పగలిగింది లేదు. మీరు ఆహార పానీయాలను విసర్జించుట సరియైనది కాదు. అలా చేయడం వలన మీరు కాని దేహాన్ని మీరు శుష్కింప చేయుచున్నారు. ఈ శరీరము భగవానునిది. ఈ దేహాన్ని పని ముట్టుగా స్వీకరించి, భగవానుడు తాను చేయదలచిన కార్యములు నిర్వహించాలి. మీరు నిరాహారంగా జీవించి శరీరమును శుష్కింపచేయుచు, భగవానుని దివ్యసంకల్పానికి అవరోధము కల్పించిన వారగుతున్నారు.' అని రాజనర్తకి చెబుతుంది. నర్తకి ప్రబోధము బాలుడైన రోహిదాసులో చక్కటి పరిణామం తెచ్చింది. అప్పటినుండి తాను ఆహారమును గ్రహించుటకు అంగీకరించాడు తల్లిదండ్రులు ఆనంద భరితులయ్యారు.

రోహిదాసు దినదిన ప్రవర్ధమానుడగుచున్నాడు. కానీ అతని వ్యక్తిత్వము, ప్రవర్తన ఎవరికి అంతుపట్టని రహస్యాలుగా మిగిలాయి. ఎవరితోనూ మాట్లాడడు, ఏ పని చేయడు. తండ్రికి వృద్ధాప్యం సమీపిస్తున్నది. కుమారుడైన రోహిదాసును తన కులవృత్తిలో ఉంచి తాను విశ్రాంతి తీసుకోవాలనుకుంటాడు తండ్రి. కానీ రోహిదాసు మనసు అందుకు భిన్నంగా ఉంది. జంతువుల చర్మాలతో చెప్పులు కుట్టడం తన చేత కావడం లేదు. జీవ కారుణ్యంతో హృదయం కుంచించుకు పోసాగింది. ఏ పని చేయక నిరంతరం ఒంటరిగా మసలుతున్న రోహిదాసు ప్రవర్తన తండ్రిని ఆవేదనకు గురి చేసింది.

ఆనాటి నుండి రోహిదాసులో మానసికంగా మార్పు వచ్చింది. తండ్రికి విశ్రాంతిని ఇచ్చాడు. తాను తండ్రి కులవృత్తిని చేపట్టాడు. నిత్యం రామ నామాన్ని ఉచ్చరిస్తూ చెప్పులు కుట్టేవాడు. వైష్ణవులకు ఉచితంగా పాదరక్షలు కుట్టి సమర్పించుకునేవాడు. రోహిదాసులో వచ్చిన మార్పుకి తల్లిదండ్రులు అమితానందం పొందారు.

ఒకనాడు తన తండ్రి అయిన రఘుకి అనారోగ్యం కలిగింది.



రాజభవనంలో రాత్రి కాపలా వెళ్లలేక తన కుమారుడైన రోహిదాసును వెళ్ళమని ఆజ్ఞాపించాడు. తండ్రి ఆజ్ఞను శిరసావహించి రోహి దాసు రాజభవన కాపలాదారుడుగా వెళ్ళాడు. అర్ధరాత్రి అయింది, రామనామామృత పానచిత్తు డైన రోహిదాసును తమోగుణజనిత నిద్ర దరిచేరదు. భగవానుని గూర్చి స్తోత్రము చేయసాగాడు. అర్ధరాత్రి నిశ్శబ్ద సమయంలో తాను పరవశించి స్తోత్రం చేయడం, రాణి గారికి నిద్ర భంగం అయింది. ఆ విషయమై రాజు గారికి ఫిర్యాదు చేయడం జరిగింది. రాజుగారు రోహిదాసును పిలిపించి విచారించారు. 'తాను నిద్రాభంగం చేయాలని ప్రయత్న పూర్వకంగా భావించి చేసింది కాదని, తాను భక్తి తన్మయత్వంలో అప్రయత్నంగా స్తోత్రాలు చేయడం జరిగిందని, రోహిదాసు రాజుగారికి చెబుతూ, తన తప్పుకు క్షమించవలసింది' అని రాజు గారిని కోరుతాడు. రోహిదాసు వినమ్రతా వచనాలకు రాజుగారి మనసు శాంతిస్తుంది. రాత్రి కీర్తించిన స్తోత్రాలను మళ్లీ గానం చేయమని రాజుగారు కోరగా, రోహిదాసు స్తోత్రాలను పఠించి వాటి భావం కూడా తెలియచెప్తాడు. రోహిదాసు ప్రజ్ఞా విశేషాలకు రాజుగారికి సంతృప్తి కలుగుతుంది. అధమ కులంలో జన్మించిన రోహిదాసుకు ఇంతటి విజ్ఞానము ఎలా కలిగిందా! అని రాజు ఆశ్చర్య పోతాడు. 'రోహిదాసా! నీలో ఇంతటి జ్ఞానము ఎలా ఉదయించింది' అని రాజు ప్రశ్నిస్తాడు.

రోహిదాసు నమస్కరిస్తూ, 'ప్రభూ! నాకేమీ తెలియదు

నిరంతరము భగవన్నామస్మరణ తప్ప మరొకటి నేనెరుగను. నామ మహిమ వర్ణనాతీతము. నామము మృతము కాదు. నామము ఉచ్చరించే కొలది ఆనందం పెరగడమే కానీ, తరగడం అంటూ ఉండదు' అంటూ తన హృదయ పారవశ్యంలో చక్కటి కీర్తనను ఈ విధంగా గానం చేశాడు. "భగవన్నామము నందు ప్రీతి జనింపవలెనే కానీ, జన్మించిన ప్రీతి నశించదు. ఓ ప్రభూ! నీవు చందనము వంటి వాడవు. మేము జలము లాంటివారము. మమ్ములను నీవే సుగంధముతో నింపుచున్నావు.

ప్రభూ! నీవు మేఘము వంటి వాడవు. మేము నిన్ను చూసి నర్తించు నెమళ్ళము. నీవు చంద్రుని వంటి వాడవు. మేము చకోరముల వంటి వారము.

ప్రభూ! నీవు దీపం వంటి వాడవు. మేము వత్తి వంటి వారము. నీ వెలుగుచే మేము రాత్రింబవళ్లు ప్రకాశిస్తాము. ప్రభూ! నీవు ముత్యము వంటి వాడవు. మేము దానినంటి ఉన్న దారము వంటి వారము. బంగారానికి పరిమళము అబ్బినట్లు, నీ వల్లనే మాకొక విలువ ఏర్పడుతున్నది.

ప్రభూ! నీవు స్వామివి. మేము నీ దాసులము. రోహిదాసు యొక్క భక్తి ఇదే" అని అమృత గానం చేశాడు. రోహిదాసు భక్తికి మెచ్చి రాజుగారు సంభావనలు ఇచ్చి సత్కరించారు.

ఒకనాడు ఒక బ్రాహ్మణుడు రోహిదాసు యొక్క గొప్పతనమును విని, అతనిని పరీక్షించి చూడాలి అని, అసూయతో రోహిదాసు ఇంటికి వస్తాడు. అదే సమయానికి రోహిదాసు పూజా మందిరంలో కూర్చొని పూజ చేస్తూ ఉంటాడు. రోహిదాసు యొక్క పూజా విధానమును చూడాలి అని బ్రాహ్మణుడు సంకల్పించి, ఇంటి కిటికీ గుండా లోపలికి చూస్తాడు. రోహిదాసు చర్మంతో తయారు చేసిన ప్రతిమను పూజ చేయడం చూస్తాడు. వెంటనే లోపలికి వెళ్లి ఓయీ! రోహా! జన్మతః నీకు సంక్రమించిన నీచవృత్తిని వదల లేకపోతున్నావు. పరమ పవిత్రుడైన భగవానుని, చర్మప్రతిమగా చేసి పూజించుటయా! ఛీ ఛీ అపచారం. నీవు పాపము చేయుచున్నావు అన్నాడు.

రోహిదాసు బ్రాహ్మణునికి నమస్కరిస్తూ, విప్రోత్తమా! మీరు సర్వజ్ఞులు తమకు తెలియనిదంటూ లేదు. చర్మం ఎలా నీచమైంది? పూజ చేయువానిపై కప్పబడి ఉన్నది కూడా చర్మమే కదా! జింక చర్మమునే ఆసనముగా వేసుకొని జపము, ధ్యానము చేయుచున్నాము కదా! భగవత్ సంకీర్తన లలో ఉపయోగించే మృదంగం చర్మంతో చేసినదే కదా! చర్మంతో చేసిన మృదంగమును చర్మపు చెయ్యి మ్రోగించగా, చర్మపుచెవి వినుచున్నది. అలాంటప్పుడు చర్మం ఎలా నీచమైంది? పోనీ నేను చేసే పూజా విధానము శాస్త్ర సమ్మతము కానిచో, మీరు తెలియచేయండి. ఇకమీదట ఆ విధంగా ఆచరిస్తాను అని అడుగుతాడు.

బ్రాహ్మణుడు రోహిదాసు మాటలకు కోపోద్రిక్తుడు అవుతాడు. ఓయీ! నీ వ్యర్థ ప్రసంగాలను ఆపు. నీచ కులజుడవైన నీకు ఉత్తమ కులస్థుడనైనా నేను పూజ నేర్పుటయా! నీకు ఆ అర్హత లేదు. ఉపనయన సంస్కారం లేని నీ జాతికి అలాంటి అవకాశం లేదు. అని బ్రాహ్మణుడు మండి పడతాడు. 'ద్విజోత్తమా! జన్మతో అందరూ శూద్రులు గానే జన్మిస్తారు. కర్మ చేత విప్రులవుతారు. కర్మ భ్రష్టులైన విప్రులు శూద్రులు కారా? అలాంటప్పుడు అంతఃకరణ శుద్ధి గల శూద్రునకు బ్రాహ్మణత్వము ఎందుకు రాదు? మహాత్మా! ఇవన్నీ అనర్థావేశంతో దురవగాహనతో మనం ఏర్పరచుకున్న సంకుచిత గోడలు. భగవానుని దృష్టిలో అందరూ సమానమే! నాకు ఉపనయన సంస్కారము భగవంతుడే చేసి ఈ జన్మకు పంపించాడు.' అని నమ్రతతో చెబుతాడు రోహిదాసు.

'నీ వాచా వేదాంతానికి ఒక హద్దు ఉన్నట్లు కనిపించడం లేదు. అసత్యానికి మారుపేరులా కనబడుతున్నావు. ఉపనయనము జరిగిందని బొంకుతున్నావు. ఉపనయనము జరిగినట్ల యితే యజ్ఞోపవీతం ఏది? అది కూడా ఉన్నట్లేనా! బహుశా! మా కంటికి కనపడని విధంగా ఉన్నదా? అవునులే భగవంతుడు ఉపనయనం చేశాడు కదా! అందుచేత యజ్ఞోపవీతం మాకు ఎలా కనబడుతుంది?' అని చమత్కరిస్తాడు. వెంటనే రోహిదాసు 'నాకు యజ్ఞోపవీతము కూడా ఉన్నది చూడండి, అంటూ హృదయాన్ని చీల్చి లోపల యజ్ఞోపవీతమును చూపిస్తాడు. బ్రాహ్మణుడు ఆశ్చర్యపడి తన పొరపాటును గ్రహించి, భక్తులు జాతి కుల మత భేదాలకు అతీతులు' అని భావించి రోహిదాసు పాదాలపై పడి క్షమాభిక్ష కోరతాడు.

రోహిదాసుకి వివాహమైంది. పిల్లలు కలిగారు. రోహిదాసు తల్లిదండ్రులు మరణించారు. రోహిదాసు దారిద్ర్యంతో పోరాడవలసి వచ్చింది. హృదయంలో రామ నామాన్ని ధరించి సదా రామనామ స్మరణ చేస్తూ, సంతృప్తితో జీవిస్తున్నాడు. ఒకనాడు భగవానుడు సాధురూపంలో వచ్చి దర్శనం ఇస్తాడు. రోహిదాసు భక్తికి తృప్తి చెంది స్పర్శవేదిని బహూకరిస్తాడు.

'రోహిదాసా! ఇది స్పర్శవేది దీనితో నీ లోహపు వస్తువును స్పృశించినట్లైతే, అది బంగారంగా మారుతుంది. నీమీద ఉన్న ప్రత్యేక ప్రేమతో దీనిని నీకు ఇస్తున్నాను. జాగ్రత్తగా ఉంచు కోవాల్సింది.' అని చెబుతాడు. రోహిదాసు పనిలో నిమగ్నమై ఉండటం చేత 'మహాత్మా! నేను పనిలో ఉన్నాను. ఆ గూటిలో ఉంచండి.' అని చెప్తాడు. భగవానుడు గూటిలో పరుసవేదిని ఉంచి వెళతాడు.

కొంతకాలం అయిన తర్వాత సాధువు మళ్లీ తిరిగి వచ్చి 'రోహిదాసా! నేను ఇచ్చిన స్పర్శవేది ఏమైంది' అని అడుగుతాడు. 'స్వామి మీరు ఉంచిన చోటనే ఉంది చూడండి' అని రోహిదాసు చెబుతాడు. సాధువు చూడగా అది అక్కడే ఉంది. 'రోహిదాసా! నీవు ఈ స్పర్శవేదిని ఉపయోగించ లేదా?' అని సాధువు

అడుగుతాడు. 'మహాత్మా! క్షమించండి అలాంటి విషయాలలో నాకు ఆసక్తి ఉండదు. మానవ జీవితం మూడునాళ్ళు, భోగభాగ్యాలతో తులతూగాలని, సిరిసంపదలతో వెలిగి పోవాలని భావించడం అజ్ఞానం కాదా? తరగని సుఖము, చెదరని ఆనందము భగవన్నామము నందే ఉన్నది. నా జీవితంలో ఒక్క క్షణమైనను వృధా పోకుండా నిరంతరం భగవానుని చరణాల యందు మనసు లగ్నమై ఉండే విధంగా ఆశీర్వదించండి' అని రోహిదాసు ప్రార్థిస్తాడు. రోహిదాసు భక్తికి సాధువు సంతృప్తి చెంది, ఒక సాలగ్రామమును ఇచ్చి దానిని పూజించి తరించమని చెప్పి, తన నిజరూపమగు శంఖు చక్ర గదా పద్మములతో దర్శనమిచ్చి అంతర్ధానమవుతాడు.

రోహిదాసు సూర్యోదయాత్పూర్వమే గంగా నదిలో స్నానమాచరించి, సాలగ్రామమునకు పూజ చేసేవాడు. పూజ పూర్తి కాగానే ఒక బంగారు నాణెము సాలగ్రామమునందు కనిపించేది. రోహి దాసు భగవత్ప్రసాదముగా భావిస్తూ, దానిని విక్రయించి, ఆ వచ్చిన డబ్బుతో పేదలకు అన్న సంతర్పణ, వస్త్రదానము చేసేవాడు. ఇలా నిత్యాన్న దాన శాంతులతో రోహిదాసు తన జన్మను సార్థకం చేసుకున్నాడు.

'రోహిదాసు వద్ద ఒక సాలగ్రామము ఉన్నదని, అది ప్రతినిత్యము ఒక బంగారు నాణెమును ఇస్తూ ఉన్నదని, దాని వలన అన్న వస్త్ర దానాలు చేసి ప్రజలలో కీర్తి ప్రతిష్టలు సంపాదించుచున్నాడు' అని రాజుకు తెలియజేస్తారు మంచిని చూడలేని కర్కశ మానవులు.

రాజు రోహిదాసును పిలిపిస్తాడు. తాను పూజ చేయు సాలగ్రామమును రాజమందిరమునకు చేర్చమని చెబుతాడు. తనకు భగవంతుడు స్వయంగా ఆ సాలగ్రామమును అనుగ్రహించాడు అనియు, అది తనకు ప్రాణ సమానమైనదనియు, ఆ పవిత్ర సాల గ్రామమును తనకు దూరం చేయవద్దని రోహిదాసు రాజు గారిని ఎంతగానో ప్రార్థిస్తాడు. రాజు ఆగ్రహం చెంది బలవంతముగా రోహిదాసు ఇంటిలోని సాలగ్రామమును తీసుకొనిరమ్మని ఆజ్ఞాపిస్తాడు. భటులు రోహిదాసు గృహానికి వెళ్ళి, రోహిదాసు పూజా మందిరంలో ఉన్న సాలగ్రామమును తీసుకొని వస్తారు. రాజు తన పూజా మందిరంలో ఉంచుకుంటాడు. రోహిదాసు పరితపిస్తూ, రామా! సాలగ్రామమును నాకు దూరం చేయగలరేమో గాని, నిన్ను నా హృదయం నుండి దూరం చేయగలరా? అది ఎవరి తరమూ కాదు అని భావిస్తూ ఇల్లు చేరుతాడు. మర్నాడు రాజుగారు పూజా మందిరానికి వెళతారు. సాలగ్రామము పెట్టిన చోట లేదు. అలాగే రోహిదాసు కూడా మర్నాడు పూజా మందిరానికి వెళ్ళి చూసేసరికి, సాలగ్రామము యధాప్రకారము దర్శనమిచ్చింది.

రాజు తన తప్పిదమును గుర్తించి రోహిదాసును క్షమాభిక్ష కోరుతాడు. భగవంతుడికి భక్తుడికి అడ్డు నిలిచే వారెవరున్నారు? అందుచేతనే హైందవాలయాలలో భక్తునికి విశిష్ట స్థానం ఇవ్వబడింది. గర్భాలయంలో స్వామికి ఎదుట భక్తుని విగ్రహము ఉంటుంది. రామ విగ్రహము ఉన్నచోట ఎదురుగా ఆంజనేయస్వామి, శివ సన్నిధిలో నందీశ్వరుడు, విష్ణు సన్నిధిలో గరుత్మంతుడు, విఘ్నేశ్వరాలయంలో మూషికము ఉంటారు. భగవంతుణ్ణి నిరంతరము మోసుకొని తిరిగే భక్తుల పవిత్రతకు చిహ్నంగా వారికి ఆ స్థానం కల్పించడం జరిగింది. ఆ కారణం చేతనే భగవానునికి భక్తునికి మధ్య నడవకూడదు అని అంటారు. దాని అంతర్భావం ఏమిటి? అనగా! భక్తుని దృష్టి సదా భగవంతునిపైనే ఉంటుంది. దానికి అడ్డు నిలవవద్దు అని అర్థము. ఇది కేవలము దేవాలయములోనే కాక నిత్య జీవితములో కూడా ఆచరించ వలయును అని భావము. భక్తులను పరీక్షించుట, అవహేళన చేయుట, వారికి కష్టాలు కలిగించుట చేయకూడదు. అంతకన్నా మించిన పాపము మరొకటి ఉండదు.

"భగవద్భక్తులు ప్రేమ స్వరూపులు, త్యాగ జీవులు, సేవా పరాయణత్వముతో జీవితమును సాగించే ఆదర్శ మూర్తులు. వారి దివ్య దృష్టిలో ప్రతి జీవియు భగవంతుడే! ఏ వ్యక్తి బాధపడిన చూసి భరించలేరు. భగవానుడే బాధల్లో ఉన్నాడనే స్ఫురణ వారికి కలుగుతుంది. తోటి మానవుని సుఖ సంతోషాలను వీక్షించి, తృప్తి చెందే భక్తుని అంతఃకరణ నిరంతరము సేవా దృక్పథంలోనే నడుస్తూ ఉంటుంది. భక్తులు ఇతరుల బాధలను తొలగించువారే కానీ, బాధలను కలిగించువారు కారు. అట్టి పవిత్రాత్ములైన భక్తులను పరీక్షించుట మహాపరాధము. ఆంతరంగిక ఆధ్యాత్మిక సౌరభముతో జీవించే భక్తుల జీవన రాగ విన్యాసములు మనకు అర్థం కావు. అంతమాత్రాన అపార్థం చేసుకొని భక్తులను అవమానించకూడదు. అసహ్యించుకోకూడదు. ఆపదలను అందించకూడదు. అందరిలా కాకుండా అతీతంగా జీవించడం లోనే వారి ఔన్నత్యం దాగి ఉంది. భక్తుల సహచర్య భాగ్యం లభించుట మహద్భాగ్యమని భగవత్ప్రసాదమని భావించి, జీవించి, చరించే జీవులు తప్పక తరించగలరు."

పరమ భాగవతోత్తముడైన రోహిదాసు తన శేష జీవితమును నిత్య సమారాధనలో, నిరంతర జప, సంకీర్తనాదులలో చరితార్థం చేసుకొని, తన ఆదర్శనీయ జీవితము ద్వారా అనుకరింపదగిన అద్భుత చరితాత్ముడుగా భక్తుల హృదయాలలో స్థిరంగా నిలిచిపోయాడు.

తన జీవితమంతయు భగవదారాధనలో గడిపి, అంతిమ సమయంలో భగవాన్నామమును గానము చేయుచు అనంత చైతన్యములో లీనమయ్యాడు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్త్వం

- రాళ్ళబండి శ్రీనివాసన్



నిరాయుధుడై కృష్ణభగవానుడు ఒక్కడే కాలయవనుని కోసం వెళ్లాడు.

**దర్శనీయతమం శ్యామం పీతకౌశేయ వాసనమ్ ।**
**శ్రీవత్సవక్షసం భ్రజత్ కౌస్తభా ముక్తాకంధరమ్ ।**
**పృథుదీర్ఘచతుర్బాహుం నవ కంజారుణేక్షణమ్ ॥**

నీలమేఘశ్యాముడు– పట్టుపీతాంబరధరుడు– విశాల వక్షఃస్థలుడు– శ్రీవత్సచిహ్నధరుడు– కౌస్తుంభాలంకారుడు– చతుర్భుజుడు– కమలపత్రాక్షుడు అయిన కృష్ణుడు దర్శనీయుడైనాడు.

కాలయవనుడు చూసాడు కృష్ణదేవుని. పట్టుకోవాలని వెంటపడ్డాడు. అయితే ఆగకుండా పరిగెత్తుకుంటూ పోతున్నాడు కృష్ణుడు.

కృష్ణ భగవానుడు కాలయవనునికి అందీ అందినట్లు తప్పించుకుని పోతున్నాడు.చివరికి ఒక గుహలోకి దూరాడు. అనుసరించాడు కాలయవనుడు.

ఒకచోట ముసుగులో వున్నవాడు–ఏమీ తెలియనట్లు నిద్ర నటిస్తూ గురుకపెడుతున్నవాడు– కృష్ణుడే అనుకున్నాడు. బలంగా కాలితో తన్నాడు.

అయితే నిదురిస్తున్నది కృష్ణుడు కాదు–అతడు ముచికుందుడు. కనులు తెరిచాడో లేదో– కన్నుల్లో నుంచి అగ్నిజ్వాలలు కమ్ముకున్నాయి. దానితో భస్మమైపోయాడు కాలయవనుడు.

మాంధాత మహారాజు కుమారుడు ముచికుందుడు.దేవాసుర సమరంలో ముచికుందుడు సాయపడి–దేవతలకు విజయాన్ని సాధించిపెట్టాడు.అందుకని ఏదైనా వరం కోరుకోమన్నాడు ఇంద్రుడు.

దేవేంద్రా! నేను యుద్ధంలో బాగా అలసిపోయాను. అందుకు నాకు నిద్ర కావాలని కోరాడు.నీకు ఎవరు నిద్రాభంగం కలిగిస్తారో–వారు భస్మమైపోతారని అనుగ్రహించాడు.

తర్వాత ముచికుందుడు భూలోకానికి వచ్చాడు. ఒక గుహలో ప్రవేశించాడు. నిద్రించాడు.అతనికి నిద్రాభంగం కలిగించినవాడు కాలయవనుడు భస్మమయ్యాడు. ఇక ఎదురుగా కృష్ణ భగవానుని దర్శించాడు ముచికుందుడు.

కాలయవనుడు కాలిబూడిదైపోయాడు. తనకు ఎదురుగా కృష్ణుడు వుండటాన్ని చూసాడు.

శశివో ఇంద్రుడవో విభావసుడవో చంద్రప్రభారాశివో పితామహుడవో చక్రహస్తుండవో ఎవరు నీవు –అడిగాడు ముచికుందుడు.

ముచికుందా! చెప్పాలంటే నా జన్మలు అనంతాలు. అయితే "వాసుదేవ ఇతి వదంతి మాం"–వసుదేవుని పుత్రుడు అని నన్ను పిలుస్తారు.నీ వలననే కాలయవనుడు భస్మమైపోయాడు. అదంతా నా సంకల్పమే. నిన్ను అనుగ్రహించాలని నీతో అలా చేయించాను. ఏదైనా వరం కోరుకోమన్నాడు కృష్ణుడు.

స్వామీ! కృష్ణదేవా! కర్మ జన్మ బంధమైన సంసార కూపంలో మగ్గిపోతున్న విషయసుఖభోగాలు వద్దు. నీ దివ్య పాదసేవ చాలు నాకు–అది అతని కోరిక.

మహారాజా! ముచికుందా! క్షాత్ర తేజంతో వేటాడి ఎన్నో జంతువులను వధించావు. ఆ పాపప్రక్షాళనం చేసుకో. వచ్చే జన్మలో నా సన్నిధిని చేరుకుంటావని అన్నాడు కృష్ణభగవానుడు.

విదర్భ దేశానికి భీష్మకుడు రాజు.అతనికి ఐదుగురు కొడుకులు–ఒక కూతురు. ఆమె పేరు రుక్మిణి.కృష్ణుడే తనకు తగిన భర్తగా భావించింది. అయితే ఆమె పెద్దన్న రుక్మి–శిశుపాలునికి ఇవ్వాలని పట్టుబట్టాడు. కొడుక్కి ఎదురుచెప్పలేక భీష్మకుడు స్వయంవరం ప్రకటించాడు. అపుడు రుక్మిణి అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణునితో కృష్ణునికి ఒక సందేశం పంపింది.

కంసాంతకా! కళ్యాణగుణాకరా! మానినీ చిత్తచోరా! నీవు ఎక్కడ? నేనెక్కడ? సిగ్గు విడిచిపెట్టి చెబుతున్నాను.నా మనసు

నీకు సమర్పించాను. నన్ను కరుణించు. సింహానికి చెందిన వస్తువును నక్క కోరినట్లు–నీ సొమ్ము అయిన నన్ను శిశుపాలుడు లాక్కెళ్లాలని చూస్తున్నాడు.

**అంకిలి చెప్పలేదు చతురంగ బలంబులతోడ ఎల్లి ఓ**
**పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే**
**ఉంకువ చేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్.**

కృష్ణా! అంతఃపురంలో వున్న నన్ను ఏవిధంగా తీసుకుని వెళ్లాలని ఆలోచించకు.పెండ్లి కూతురై నేను మా ఇలవేల్పు అయిన దుర్గాదేవిని పూజించడానికి వస్తాను.ఆలయం ఊరివెలుపల వుంది.నీవు అక్కడికి వచ్చి నన్ను తీసుకుని పో. ఒక వేళ నీకు నేను తగిన దానను కాకపోతే–వచ్చే జన్మలోనైనా నీవే నా పతి యని వ్రతనిష్ఠతో నిన్ను ధ్యానిస్తూ స్మరిస్తూ ప్రాణాలను నీకే సమర్పిస్తాను. నీ పాదసేవకి పనికిరాని జన్మ వృధా.

అగ్నిద్యోతనుడు తెచ్చినట్టి రుక్మిణీ సందేశాన్ని సావధానంగా వినినాడు కృష్ణుడు. ఆ బ్రాహ్మణునితో తన రథం మీద కుండినపురానికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ ఎందరో రాజులు శిశుపాల జరాసంధాదులు వచ్చి వున్నారు.

రుక్మిణీ దేవి దుర్గాదేవి ఆలయానికి బయలుదేరింది. తప్పెట్లు భేరీలు ఇంకా మద్దెల మోతలు–మరింకా సూతుల స్తుతులూ–గాయకుల పాటలూ– సాగగా–అందరూ కలిసి అంబికాదేవీ ఆలయానికి చేరుకున్నారు.రుక్మిణీదేవి అమ్మవారికి మొక్కింది–

**నమ్మితి నా మనంబున సనాతనులైన ఉమామహేశులన్**
**మిమ్ము పురాణ దంపతుల మేలు భజింతు కదమ్మ! మేటి పెద్దమ్మ!**
**దయాంబురాశివి కదమ్మ హరిం పతి చేయుమమ్మ**
**నిన్ నమ్మిన వారికెన్నడు నాశము లేదు కదమ్మ ఈశ్వరీ!**

ఆ విధంగా దుర్గమ్మను ప్రార్థించింది. గుడి బయటికి వచ్చింది రుక్మిణీదేవి.

కనియన్ రుక్మిణీ చంద్రమండల ముఖున్.... జగన్మోహనాకారుడైన కృష్ణుణ్ణి చూసింది. సకల రాజలోకాన్ని లెక్కచేయకుండా వెంటనే రుక్మిణిని తన రథంలోకి ఎక్కించాడు కృష్ణుడు.తర్వాత పాంచజన్యం తీసాడు.పూరించాడు.బలరాముడు తోడు రాగా– తన యాదవ సేనతో వెళ్లిపోయాడు కృష్ణుడు. ఇక అది చూసి శిశుపాలాదులు సహించలేక శరవర్షాన్ని కురిపించారు. అంతే– కృష్ణ బలరాములు విజృంభించారు. పోరులో శత్రు సేనలు మొత్తం చావగా శిశుపాలజరాసంధాదులు వెనక్కి వెళ్లిపోయారు.

ద్వారకా నగరంలో వివాహపు వేడుకలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. రుక్మిణిని కృష్ణుడు పెండ్లాడటం అసాధారణ కార్యమని వివిధ దేశాల రాజులు ఆశ్చర్యపోయారు.

అయితే రుక్మిణి అన్న రుక్మి– కృష్ణుని పరిమార్చుతానని – లేకపోతే రాజ్యంలో అడుగు పెట్టనని ప్రతిజ్ఞ చేసాడు. వెంటనే



కృష్ణుని వెంబడించాడు.

అయితే కృష్ణుడు అతనిని పరాజితుణ్ణి చేసాడు. తన అన్నను చంపడానికి సిద్ధపడిన కృష్ణుని చూసింది రుక్మిణి. భయవిహ్వల అయ్యింది. కృష్ణుని పాదాలపై పడింది. అన్న శరణాగతి చేయకపోయినా–అతని తరఫున నేను శరణాగతి చేస్తున్నాను అంది.

రుక్మిణి కలత చెందడంతో తన ప్రయత్నం విరమించుకున్నాడు కృష్ణుడు. అయితే ఖడ్గాన్ని తీసుకుని – రుక్మి మీసాలు కేశాలు అక్కడికక్కడే గొరిగి వికృతరూపుణ్ణి చేసాడు. బలరాముడు రుక్మి బంధాలు తొలగించాడు.

మరి కొంత కాలానికి కృష్ణభగవానుడు మరో ఏడుగురు కన్యలను వివాహం చేసుకున్నాడు. వాళ్లే – వరుసగా – జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ– అష్టభార్యలతో సుఖంగా వున్నాడు కృష్ణుడు. అయితే సత్యభామ తండ్రి సత్రాజిత్ విషయాన్ని కొంత విచారణ చేయాలి.

అమిత సంపదను మితిమీరి ఆర్జిస్తారు కొందరు. దానిని సమాజ శ్రేయస్సుకు వినియోగించరు. అలాంటివారిలో సత్రాజిత్తు ఒకడు. అతడు ఒక గొప్ప సూర్యోపాసకుడు. సూర్య భగవానుని అనుగ్రహంతో ఒక శమంతకమణిని పొందాడు. ఆ మణి నిరంతరమూ అపారమైన ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది.

ఆ శమంతకమణి ఒక రాజు దగ్గర వుండటం శ్రేయస్కరమని తలచాడు కృష్ణభగవానుడు. ఒక మంత్రాన్ని మనం స్వార్థానికి ఉపయోగించరాదు. నిత్యం పూజించదగిన దివ్య మణిని కంఠహారంగా ధరించాడు సత్రాజిత్తు తమ్ముడు. వేటకై పోయిన అతడి వద్ద మణిని చూసింది ఒకానొక సింహం. దానిని మాంస ఖండంగా తలంచి అతడిని చంపి ఆ మణిని నోట కరచుకొని పోవుచుండగా జాంబవంతుడు సింహాన్ని చంపి ఆ మణిని తన కుమార్తెకు ఇచ్చాడు.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

**ధారావాహికం**

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## విశ్వరూప దర్శనం

శ్రీవారి పాదాలపై బంగారు తొడుగులు, తులసి, పుష్పాలవంటివి లేకుండా; స్వామివారి దివ్యమంగళరూపం ఆపాద మస్తకం కనిపించే ఈ దర్శనాన్ని "విశ్వరూప దర్శనం" అంటారు. ఇలా ఎందుకన్నారంటే –

రాత్రి ఏకాంతసేవకు ముందు చిన్న గంధం ముద్ద భోగశ్రీనివాసుని వక్షస్థలంలోనూ, మరో కొంచెం గంధం మూలమూర్తి పైనున్న అమ్మవారి వద్ద ఉంచుతారు. ఇతర పూజా ద్రవ్యాలు వేరొక పళ్ళెం లోనూ, ఐదు బంగారు పాత్రలలో శుభ్రమైన నీరు కూడా ఉంచుతారు. అంతేకాకుండా స్వామివారి పాదాలకున్న బంగారు తొడుగులు తీసి, రెండు పాదాలపై రెండు గంధం ముద్దలు ఉంచి వాటిపై చిన్న వస్త్రం కప్పుతారు. బ్రహ్మాది దేవతలు నిశిరాత్రి (రాత్రి ఏకాంతసేవకు మరియు మరునాటి వేకువ ఝామున జరిగే సుప్రభాత సేవకు మధ్య) సమయంలో విచ్చేసి శుద్ధోదకం, చందనం ఇతర పూజా ద్రవ్యాలతో స్వామివారిని అర్చించుకోవడం కోసం ఈ ఏర్పాటు. ఇదివరలో ఈ గంధాన్ని, తీర్థాన్ని సుప్రభాత సేవకు విచ్చేసిన భక్తులకు ఇచ్చి, పాద వస్త్రాలను కళ్ళకద్దుకోనిచ్చేవారు. ఇప్పుడు మాత్రం చందన, తీర్థాలు మొదటగా అర్చక స్వాములు స్వీకరించి, తరువాత జియ్యంగారికి, ఏకాంగికి, సన్నిధి గొల్లకు అందజేస్తారు. సన్నిధి గొల్లకు వీటితో పాటుగా నివేదన పళ్ళెం లోని తాంబూలాన్ని కూడా ఇస్తారు. నిశిరాత్రి సమయంలో బ్రహ్మచే పూజింపబడిన స్వామివారి "విశ్వరూపాన్ని" యథాతథంగా, మరునాడు ఉదయం సుప్రభాత సేవకు విచ్చేసిన భక్తులు దర్శించుకుంటారు కావున ఈ దర్శనాన్ని "విశ్వరూప దర్శనం"గా పిలుస్తారు.

### నవనీత హారతి

అప్పుడే తీసిన వెన్న, ఆవుపాలను నివేదించి ఇచ్చే హారతి గావున, సుప్రభాత సేవలో స్వామివారికిచ్చే తొలి హారతిని "నవనీత హారతి"గా వర్ణిస్తారు. స్వామివారికిచ్చే అనేక రకాలైన హారతుల గురించి మరోసారి తెలుసుకుందాం.

అనంతరం జియ్యంగార్, ఏకాంగి, సన్నిధిగొల్ల బంగారు వాకిలి వెలుపలికి వస్తారు. దేవస్థానం పరిచారకులు లోనికి వెళ్ళి శ్రీవారి పాన్పునూ, మంచాన్నీ తీసి ఆనంద నిలయానికి ఉత్తరాన ఉన్న "సబేరా" అనబడే గదిలో ఉంచుతారు.

సుప్రభాతం పఠించిన వేదపండితులు, అన్నమయ్య వంశీయులు, మహంతు, మైసూరు సంస్థానం వారు స్వామివారి సన్నిధికి వెళ్ళి హారతి, తీర్థం, శఠారి, చందనం, వెన్న, ఇతర మర్యాదలు పొందుతారు. తదుపరి స్వామివారి సుప్రభాత సేవకై వేచి ఉన్న భక్తులు వరుస క్రమంలో స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఆనంద నిలయానికి దక్షిణం వైపునున్న ఓ ఎత్తైన అరుగుపైన, అంకురార్పణ మండపం నందు తీర్థం, శఠారులను స్వీకరించి ధన్యులవుతారు.

నిత్యం శ్రీవారికి జరిగే అనేక సేవల్లో తొలిసేవ కావటం,

బంగారు వాకిలిని తెరిచే ఆసక్తికరమైన సాంప్రదాయాన్ని కళ్ళారా వీక్షించగలగటం, బంగారు వాకిలి ముందు దాదాపు ముప్పై నిముషాలు నిలబడి, వీనులవిందైన సుప్రభాత గానాన్ని వేదపండితుల ద్వారా వినగలగటం. అప్పుడే వెలిగించిన ఆవు నెయ్యి దీపాల కాంతిలో స్వామివారి దివ్యమంగళ ''విశ్వరూపాన్ని'' కన్నులారా దర్శించగలగటం వంటి కారణాల వల్ల సుప్రభాత సేవంటే భక్తులకు ఎంతో ప్రీతిపాత్రమైంది. తాత్కాలిక అడ్డంకులన్నీ తొలగి, ఈ సేవాదర్శన భాగ్యం మీకు అతి త్వరలోనే కలగాలని ఆ దేవదేవుణ్ణి కోరుకుంటున్నాం.

## తిరుప్పావై పఠనం

సంవత్సరంలో పదకొండు మాసాల పాటు స్వామివారిని మేలుకొలిపే సుప్రభాత పఠనం, ధనుర్మాసంలో మాత్రం జరగదు. ఆ మాసంలో సుప్రభాతానికి బదులుగా ''తిరుప్పావై'' పఠిస్తారు. పన్నెండుగురు ఆళ్వార్లు రచించిన ''దివ్య ప్రబంధం''లోని ముప్పై పాశురాల మాలికను ''తిరుప్పావై''గా పిలుస్తారు. ''ఆండాళ్ అమ్మవారిగా'' కొలువబడే గోదాదేవి, శ్రీరంగనాథుణ్ణి భర్తగా పొందటం కోసం చెలులతో కలిసి, ముప్పై రోజుల పాటు కఠిన వ్రతమాచరిస్తూ ''తిరుప్పావై'' గానం చేసినట్లు ప్రతీతి.

మూడు వైష్ణవ దివ్యదేశాలలో ఒకటైన (శ్రీరంగం, కంచి – మిగిలిన రెండు క్షేత్రాలు) తిరుమల, ''పుష్పమంటపం''గా పేర్గాంచింది. పుష్పప్రియులైన స్వామివారి నిత్య కైంకర్యాలలో, ఉత్సవాలలో, అలంకరణలో పుష్పాల్ని విరివిగా వినియోగిస్తారు.

సుప్రభాత సేవానంతరం పుష్పాలే ప్రధానంగా శ్రీవారికి నిత్యం జరిగే ''తోమాల సేవ''ను మంగళ, బుధ, గురువారాల్లో మాత్రమే భక్తులు దర్శించగలరు. ఆ మూడు రోజులు ఇది ఆర్జితసేవగా పరిగణించబడుతుంది. మిగిలిన నాలుగు రోజులు ఈ సేవ ఏకాంతంగా జరుగుతుంది. అయితే శుక్రవారం మాత్రం, సుప్రభాత సేవానంతరం అభిషేకం, తదనంతరం తోమాలసేవ జరుగుతాయి.

## తోమాలసేవ

తోమాల సేవ అంటే?

తోమాలసేవ భోగ శ్రీనివాసునికి జరిగే అభిషేకం.

శ్రీనివాసుని దివ్యమంగళ మూర్తికి అనేక పుష్పమాలలతో, తులసిమాలలతో, అనునిత్యం చేసే సేవా కైంకర్యమే ''తోమాలసేవ''. ఈ సేవకు ''తోమాలసేవ'' అనే పేరు రావడం వెనుక అనేక కథనాలున్నాయి.

* తమిళంలో ''తోడుత్తమాలై'' అంటే నారతో కట్టిన మాల అని అర్థం. కాలక్రమంలో అదే 'తోమాల'గా మారి ఉండవచ్చు.
* 'తోళ్' అంటే భుజం అని అర్థం. భుజం నుంచి వ్రేలాడే మాలలు గనుక 'తోమాలలు' అని అంటారు.



* 'తోమాల' అంటే చేతితో కట్టిన పూలదండ అని మరియొక అర్థం కూడా ఉంది.
* అంతేకాకుండా తోమాల అంటే తోటలో నుండి తెచ్చిన పూమాలలు లేదా తులసిమాలలు అనే అర్థం కూడా ఉంది.

దాదాపుగా పైన చెప్పిన అర్థాలన్నీ ఈ సేవకు వర్తిస్తాయి.

ముందు రోజు రాత్రే ఆయా కాలాల్లో లభించే అనేక రకాల, రంగురంగుల, పరిమళ పుష్పాలతో తయారు చేయబడిన పుష్పమాలికలను, విమాన ప్రదక్షిణంలోని యోగనరసింహస్వామి ఆలయం ప్రక్కన ఉన్న శీతల పుష్ప అరలో సిద్ధం చేస్తారు.

## అభిషేక నిమిత్తం ఆకాశగంగ తీర్థం

మూలవిరాట్టుకు నవనీత హారతిని సమర్పించగానే భోగ శ్రీనివాసునికి జరిగే అభిషేకంతో ''తోమాలసేవ'' ప్రారంభమవుతుంది. ఈ అభిషేకానికి, పూర్వం శ్రీవారి నిత్యాభిషేక కైంకర్యంలో తరించిన మహాభక్తుడు తిరుమలనంబి వంశీయులు (వీరిని ''తోళప్పాచార్యులుగా పిలుస్తారు). దేవాలయానికి దాదాపు మైలున్నర దూరాన ఉన్న ఆకాశగంగ తీర్థాన్ని వెండి బిందెలతో, ఛత్ర చామర మంగళవాద్య మర్యాదలతో, తెల్లవారకముందే తీసుకువచ్చేవారు. నడిరేయి చిమ్మచీకట్లలో, రక్షకభటులు వెంటరాగా, అరణ్యమార్గంలో కాలినడకన, తరతరాలుగా ఈ అభిషేక జలాన్ని భుజాలపై మోసుకుంటూ తెస్తున్న తిరుమలనంబి వంశీయులు ధన్యజీవులు. అయితే ఈ మధ్యకాలంలో ఆకాశగంగనుండి అభిషేక జలాన్ని తెచ్చే లాంఛనం కేవలం శుక్రవారం నాడు మూలమూర్తికి జరిపించే శుక్రవారాభిషేకానికి మాత్రమే పరిమితం చేశారు.

ఈ తీర్థాన్ని తెచ్చి, ఆలయానికి ప్రదక్షిణ చేసి, ఆ బిందెలను

సన్నిధిలో ఉంచేవారు.

## భోగ శ్రీనివాసునికి అభిషేకం

అనంతరం అర్చకస్వాములు శ్రీవారికి నమస్కరించి, సుప్రభాత సేవలో మేల్కొల్పబడిన భోగ శ్రీనివాసుణ్ణి వెండి స్నానపీఠంపై వేంచేపు చేయిస్తారు. అర్ఘ్య, పాద్య, ఆచమన, అనుష్ఠాన ఉపచారాలు చేసిన తరువాత, బంగారు బావిలో నిలువ ఉంచబడిన ఆకాశగంగ తీర్థంతో భోగ శ్రీనివాసునికి అభిషేకం చేస్తారు.

తరువాత శ్రీవేంకటేశ్వరస్వామి (మూలవిరాట్టు) వారి నిజపాదాలపై ఉన్న బంగారు తొడుగులకు కూడా అభిషేకం చేస్తారు. వేదపండితులు పురుషసూక్తం పఠిస్తుండగా, అర్చకులు శ్రీవారి సన్నిధిలోని నృసింహ, శ్రీవారి సాలగ్రామాలకు కూడా అభిషేకం చేస్తారు. అనంతరం మూలమూర్తికీ, వక్షస్థల లక్ష్మికీ, శ్రీదేవి – భూదేవి సహిత మలయప్పస్వామికీ, ఉగ్రశ్రీనివాసునికీ, ఇలా సన్నిధిలో ఉన్న పంచబేరాలకు అభిషేకం చేయించినట్లుగా ఆకాశగంగ తీర్థంతో సంప్రోక్షిస్తారు.

అయితే రోహిణీ నక్షత్రం నాడు మాత్రం సన్నిధిలోనే ఉన్న రుక్మిణీ శ్రీకృష్ణులకు కూడా తిరుమంజనం (అభిషేకం) నిర్వహిస్తారు. అలాగే పునర్వసు నక్షత్రం నాడు సీతారామ లక్ష్మణులకూ, శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం నాడు శ్రీదేవీ – భూదేవీ సహిత మలయప్ప స్వామికి కూడా అభిషేకం జరుగుతుంది.

అభిషేకానంతరం భోగ శ్రీనివాసునికి వస్త్రాలంకరణ, తిలక ధారణ చేసి; మిగిలిన ఉత్సవ మూర్తులకు షోడశోపచారములు సమర్పిస్తుండగా జీయర్ గార్లు, వైష్ణవ స్వాములు దివ్యప్రబంధంలోని ఆళ్వార్లు గానం చేసిన 'తిరుప్పళ్ళి ఎళుచ్చి' అనే అరువది పాశురాలను గానం చేస్తారు.

## శ్రీవారికి పుష్పాలంకరణ

ఉత్సవమూర్తులందరికీ అభిషేకాదులు జరిగిన వెనువెంటనే, జియ్యంగారు పూలమాలలు ఉన్నట్టి వెదురుగంపను తలపై పెట్టుకుని, ఛత్ర చామర మర్యాదలతో, పలకగంట – సన్నడోలు మ్రోగుతుండగా, సన్నిధి గొల్ల దివిటీతో దారి చూపుతుండగా, పుష్ప అర నుండి బయలుదేరి ధ్వజస్తంభానికి ప్రదక్షిణ చేసి, వెండి వాకిలి ద్వారా లోనికి వచ్చి, విమాన ప్రదక్షిణ చేసి, బంగారు వాకిలి ద్వారా, శ్రీవారి సన్నిధిలో ఉన్న అర్చకులకు అందజేస్తారు.

అర్చకస్వాములు ఈ మాలలను స్వీకరించి, నీళ్ళతో శుద్ధి పరుస్తారు. ఆ మాలలతో ముందుగా భోగ శ్రీనివాసుణ్ణి అలంకరించి, ఆ తరువాత మూలమూర్తికి కంఠంలోనూ, హృదయంపైనా పుష్పమాలలు వేసి, శంఖు చక్రాలను, కిరీటాన్ని, నందక ఖడ్గాన్ని అలంకరిస్తారు.

ఆ తరువాత భుజాలమీదుగా నాభి వరకు, నడుము వరకు, ఊరువుల వరకు, మోకాళ్ళ వరకు, పాదాల వరకు వ్రేలాడునట్లుగా పొడవాటి పూలదండలను అలంకరిస్తారు. ఈ పుష్పాలంకరణం శ్రీవారి పాదాలతో మొదలవుతుంది. అమలులో ఉన్న ఆచారం ప్రకారం, శ్రీవారికి శిఖామణిని అలంకరించేటప్పుడు తెరవేసి మరలా తీస్తారు.

## మాలలకు పేర్లు

★ శ్రీవారి పాదాలపై అలంకరించే ఒక్కొక్క మూరగల రెండు పుష్పమాలలను తిరువడి దండలు అంటారు.

★ శ్రీవారి కిరీటం మీదుగా రెండు భుజాల వరకు అలంకరింపబడే 8 మూరల పుష్పమాలను శిఖామణి అంటారు.

★ శ్రీవారి భుజాల నుండి ఇరువైపులా పాదాల వరకు వ్రేలాడునట్లుగా అలంకరించే పొడవాటి మాలను సాలగ్రామ మాల అంటారు.

★ శ్రీవారి మెడలో రెండు వరుసలుగా భుజాల మీదికి అలంకరించబడే మూడున్నర మూరల పుష్పహారాన్ని కంఠసరి అంటారు.

★ శ్రీవారి వక్షస్థలంలో ఉన్న శ్రీదేవి–భూదేవిలకు ఒకటిన్నర మూర పొడవుండే రెండు పుష్పమాలికలను వక్షస్థల మాలలు లేదా వక్షస్థల తాయార్ల సరాలు అంటారు.

★ ఒక్కొక్కటి ఒక్కొక్క మూర ఉన్న రెండు దండలను శంఖు చక్రాలకు అలంకరిస్తారు. వీటిని శంఖుమాల, చక్రమాల అంటారు.

★ శ్రీవారి నందక ఖడ్గానికి అలంకరించే రెండు మూరల పుష్పమాలికను కఠారిసరం అంటారు.

★ రెండు మోచేతుల కిందనుండి పాదాల వరకు వ్రేలాడదీసే రెండు పుష్పమాలలను తావళములు అంటారు. వీటిలో ఒకటి 40 అంగుళాలు మరియొకటి 50 అంగుళాల పొడవు ఉంటాయి. వీటిని శ్రీవారికి ఇంగ్లీషు అక్షరం U ఆకారంలో ధరింపచేస్తారు.

## ఉత్సవ మూర్తులకు పుష్పమాలాలంకరణ

శ్రీవైష్ణవ స్వాములు గోదాదేవి కీర్తించిన తిరుప్పావై లోని తిరుప్పళ్ళి యెళుచ్చి, తిరుప్పల్లాండు మొదలైన పాశురాలు శ్రావ్యంగా గానం చేస్తుండగా, అర్చకస్వాములు శ్రీదేవీ–భూదేవీ సమేతుడైన మలయప్పస్వామికీ, ఉగ్రశ్రీనివాసమూర్తికీ, సీతాలక్ష్మణ సమేతుడైన కోదండరామస్వామికీ, రుక్మిణీ సమేతుడైన శ్రీకృష్ణునికీ, చక్రత్తాళ్వార్ కు మరియు సాలగ్రామాలకు పుష్పమాలలు అలంకరిస్తారు. (సశేషం)

# మహాశివుడి యతీశ్వరావతారము

— చిల్లర సీతారామారావు

**శ్లో॥ "నోవేద త్వామీశ సాక్షాద్ధివేదో - నోవా విష్ణోర్నో విధాతాఖిలస్య
నో యోగీంద్రా నేంద్రా ముఖ్యశ్చ దేవా - భక్తో వేదత్వా మత స్త్వాం ప్రపద్యే"**

హే ఈశా! మిమ్ములను సాక్షాత్తూ వేదములు, మహావిష్ణు, సర్వస్రష్ట బ్రహ్మ, యోగీంద్రులు, ఇంద్రాది దేవతా గణములు తెలుసుకొనలేరు. కేవలం భక్తులు మాత్రమే మిమ్ములను తెలుసుకొనగలరు. అందువలన నేను మిమ్ములను శరణు వేడుతున్నాను.

పూర్వకాలంలో అర్బుదాచలము అను ఒక పర్వతము ఉండెడిది. ఆ పర్వత సమీపమున ఒక చిన్న గుడిసె వేసుకుని భిల్ల దంపతులు ఉండేవారు. భిల్లుడి పేరు ఆహుకుడు. భిల్లుని పత్ని పేరు ఆహుక. వాళ్ళిద్దరూ శివభక్తులు. వాళ్ళు నిత్యమూ వేకువ జాముననే లేచి స్నానాదికములు పూర్తి గావించుకుంటారు.పిదప భక్తితో శివుడిని ఆరాధిస్తారు. తర్వాత భిల్లుడు వేట నిమిత్తము అడవి లోనికి వెళ్ళి సాయంత్రం తిరిగి వస్తాడు. ఇలా కొంతకాలం గడిచిపోయింది.

శివుడికి ఆ భిల్ల దంపతులను పరీక్షించాలన్న సంకల్పం కలిగింది. వెంటనే యతి రూపమును దాల్చి, భిల్లుడు ఇంటికి వచ్చు సమయమునకు అతడి గుడిసె దగ్గరకు చేరుకున్నాడు. సాయంకాలం సమయం. రోజూలాగానే భిల్లుడు ఇంటికి తిరిగి వచ్చాడు. యతీశ్వరుడు భిల్లుని చూడగానే, అతడితో ఈ విధముగా అన్నాడు – నేను నా మార్గమున పయనమవుతుండగా సాయంకాలమయింది. చీకట్లు ముసురుకుంటున్నాయి. అయినా పోదామనుకుంటే మార్గమధ్యమున వన్యప్రాణులతో అపాయముంటుంది. కనుక నేను ఇక్కడ ఆగాను. ఈరాత్రి నాకు మీ గృహమున ఆశ్రయము ఇవ్వండి. ప్రాతఃకాలముననే లేచి నేను పయనమై వెళ్ళిపోతాను అన్న యతీశ్వరుని పలుకులకు భిల్లుడు – స్వామీ! మీ రాక మాకు ఎంతో ఆనంద దాయకముగా ఉన్నది. మీరు వచించినది యథార్థము. కాని మీకు మేము ఆశ్రయము ఇవ్వలేమని చెప్పుటకు బాధ పడుతున్నాము. మా గృహము చాలా చిన్నది. ఈ గృహము ఇద్దరికి మాత్రమే సరిపోతుంది. మూడవ వ్యక్తికి చాలా కష్టము. దయచేసి నన్ను అపార్థము చేసుకోకండి అని పలికాడు. యతీశ్వరుడు బదులు ఇవ్వకుండా మౌనముగా ఉండిపోయాడు. నెమ్మదిగా తన మార్గమున తాను పోవడానికి సంసిద్ధుడయినాడు. పరిస్థితిని గమనించిన భిల్లుని భార్య జోక్యం చేసుకుని ఇలా అంది.

**శ్లో ॥ "స్వామిన్నేహి యతేః స్థానం విముఖం కురుమాతిథిమ్
గృహధర్మం నిచార్యత్వ మన్యథా ధర్మ సంక్షయః"**

స్వామీ! ఈయన మన అతిథి. గృహస్థ ధర్మము ననుసరించి ఇతని సేవ చేయడం మన ధర్మం. కనుక అతిథిని గౌరవించండి. అతడికి వసతి కల్పించండి. అతడిని నిరాశ పరచకండి. అతడిని నిరాశ పరిచినట్లయితే గృహస్థ ధర్మము నుండి మీరు చ్యుతులు అవుతారు. నాథా! మీరు, యతీశ్వరులు గుడిసెలో నిద్రించండి. అస్త్ర శస్త్రములను తీసుకుని నేను గుడిసె బయట ఉంటాను. ధర్మయుక్తమైన, మంగళకరమైన భార్య పలుకులు భిల్లుడిని ఆలోచనలలో పడవేశాయి.

**శ్లో ॥ "స్త్రియం బహిశ్చ నిష్కాస్య కథం స్థేయం మాయాగృహే
యతేరన్యత్ర గమనమధర్మ కరమాత్మనః"**

స్త్రీని గృహము బయట నుంచి, గృహము లోపల నేను నిద్రించడము భావ్యము కాదు. ఆశ్రయము అడిగిన అతిథిని వేరొక ఆశ్రయమును చూచుకొని వెళ్ళమని చెప్పడము కూడా భావ్యము కాదు. గృహస్థ ధర్మమును ఆచరించువారికి ఈ రెండూ అనుచితమయినవే. ఆలోచనల నుండి బయటపడిన భిల్లుడు యతీశ్వరునకు ఆశ్రయము కల్పించుదామని



నిర్ణయించుకున్నాడు. భార్యను, యతీశ్వరుడిని గృహములో పరుండమని చెప్పి, అస్త్రములను తీసుకొని బయట నుండసాగాడు.

అర్ధరాత్రి సమయమున క్రూరమృగ జంతువులు అతడి మీద దాడి చేశాయి. భిల్లుడు తన ప్రాణ రక్షణార్థము అస్త్ర శస్త్రములతో వాటితో తలపడసాగాడు. తుదకు వాటికి ఆహారమయ్యాడు. తెల్లవారింది. యతీశ్వరుడు గుడిసె బయటకు వచ్చి భిల్లుడి మృతదేహమును చూచి రోదించసాగాడు. అతడి రోదనలను వినిన భిల్లుడి పత్ని బయటకు వచ్చింది. మృతుడై పడి ఉన్న భర్తను చూచుసరికి అమితమైన దుఃఖము కల్గింది. తన దుఃఖమును దిగమ్రింగుకొని యతితో ఇలా అంది.

**శ్లో ॥ కిమర్థం క్రియతే దుఃఖం భద్రం జాతం యతేఽధునా**
**ధన్యోఽయం కృత కృత్యశ్చ యజ్ఞాతో మృత్యురీ దృశః"**

యతీశ్వరా! మీరు ఎందులకు దుఃఖిస్తున్నారు? ఆయన జన్మ ధన్యమయింది. అతిథి సేవలో వారు కృత కృత్యులయ్యారు. సుఖవంతంగా ఆయన దివికేగారు. యతీశ్వరా! మీరు నాకు చిన్న ఉపకారము చేయాలి. నేను కూడా ఈయన దేహముతో అగ్నికి ఆహుతవుతాను. భస్మమైపోతాను. సతినవుతాను. స్త్రీలకు ఇది సనాతన ధర్మము. కనుక మీరు చితిని పేర్పించండి అన్నది. భిల్లపత్ని మాటలు విన్న యతీశ్వరుడు సహగమనము ఆమెకు తగినదని, అదియే ఆమెకు కళ్యాణదాయకమని భావించి వెంటనే చితిని ఏర్పాటు చేశాడు. భిల్లపత్ని తన కాలము నాటి ఆచారము, ధర్మము ననుసరించి చితిలోనికి దూకటానికి సంసిద్ధమయింది.

**శ్లో ॥ "ఏతస్మిన్నన్తరే సాక్షాత్పురః ప్రాదుర భూచ్ఛివః**
**ధన్యే ధన్య ఇతి ప్రీత్యా ప్రశం సంస్తాం హరోఽబ్రవీత్"**

అదే సమయమునకు ధన్యురాలవు, ధన్యురాలవు అని ప్రశంసిస్తూ శివుడు ప్రత్యక్షమయ్యాడు. భిల్లపత్నితో – అనఘా! మీ అతిథి సేవలకు ఆనందించాను. నీకు వరమును ప్రసాదిస్తాను. నీవు ఏ వరమును అడిగినా కాదనకుండా ఇస్తాను. మీ భక్తి తత్పరతకు వశీభూతుడనయినాను అని పలికాడు. ప్రత్యక్షమైన శివుడిని చూచి భిల్లపత్ని ఆనంధభరితురాలయింది. ఆ ఆనందంలో పరవశించిపోతూ వరమును అడుగుట మరిచిపోయింది. ఆమె పరిస్థితిని గమనించిన శివుడు వరమును కోరుకొమ్మని గుర్తు చేశాడు. పిదప ఇలా అన్నాడు.

**శ్లో ॥ "అయం యతిశ్చ మద్రూపో హంస రూపో భవిష్యతి**
**పరజన్మ నివాం ప్రీత్యా సంయోగం కారయిష్యతి"**

ఆహుకా! మీ భక్తిని పరీక్షించుదామని యతీశ్వరుని రూపము దాల్చినాను. మీ ఆతిథ్యము నన్ను ముగ్ధుడను గావించింది. యతీశ్వర రూపములో మీ ఇద్దరినీ విడదీసిన నేను హంస అవతారము నెత్తి మీ ఇద్దరినీ మరల కలుపుతాను. మరుసటి జన్మమున భిల్లుడు నిషధ నగరమును పరిపాలించు వీరసేన మహారాజుకు తనయుడిగా జన్మించి మహాపరాక్రమవంతుడవుతాడు. అనఘా! నీవు మరుసటి జన్మలో విదర్భ నగరమును పరిపాలించు భీమరాజునకు దమయంతిగా జన్మించి గుణవంతురాలిగా ఖ్యాతి గడిస్తావు. హంసగా అవతరించి నేను మీ ఇద్దరి మధ్య ప్రేమను అంకురింప చేసి దంపతులను గావిస్తాను. దంపతులయిన తరువాత మీ ఇరువురూ చాలాకాలము రాజ్యసుఖములనుభవించి తుదకు యోగీశ్వరులకు కూడా బహు దుర్లభమైన మోక్షమును పొందుతారు అని పలికి శివుడు లింగముగా మారిపోయాడు. శివుడు పెట్టిన పరీక్షకు విచలితుడు కాకుండా ధర్మమునకు కట్టుబడి ఉన్నాడు కనుక ఆ ప్రాంతమున వెలసిన లింగమునకు 'అచలేశ్వర లింగము' అను పేరు వచ్చింది.

ఆహుకుడు (భిల్లుడు) మరుసటి జన్మమున నిషధ నగరమును పరిపాలిస్తున్న వీరసేన మహారాజుకు నలుడను పేరుతో జన్మించాడు. ఆహుక (భిల్లుని పత్ని) విదర్భ నగరమును పరిపాలిస్తున్న భీమసేన మహారాజుకు దమయంతి అను పేరుతో కుమార్తెగా జన్మించింది. శివుడు హంసగా అవతారమెత్తి నల దమయంతుల మధ్య రాయబారము నడిపి వారి మధ్య ప్రేమను అంకురింపచేసి, వారిరువురినీ దంపతులను గావించాడు. సుఖమయమైన జీవితాన్ని ప్రసాదించాడు. శివుడికి ఆతిథ్యమొసగి ఆ జన్మలో విడిపోయిన దంపతులు శివుడి అవతారమైన హంస వల్ల దంపతులై, నల దమయంతులుగా ప్రసిద్ధి చెందారు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
**(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులు తొందరపాటు నిర్ణయములు వలన అధిక ధనవ్యయము చేయగలరు. ప్రయాణ ప్రమాదములు కలిగి ఉన్నారు. శకునం చూసి ప్రయాణములు చేయండి. మాతృపితృ పీడలు కలిగి ఉన్నారు. అంతా దైవముపైన భారం వేసి ముందుకు నడుచుట మంచిది. శివారాధన చేయగలరు.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆకస్మిక ధనరాబడి ఉంటుంది. చాలా చాకచక్యంగా మసలుకొనగలరు. పంతాలకు పట్టింపులకు సమయం కాదు. ఓర్పుతో లౌక్యంగా మాట్లాడగలరు. తొందరపాటు వలన కొన్ని సమస్యలుంటాయి. శ్రీవారి దర్శనం చేసుకోండి.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు తెలియని విధంగా అనారోగ్యములు. శకునం చూసి బయటకు వెళ్ళండి. పడుట దెబ్బలు తగులుటకు అవకాశములు ఉన్నవి. చాలా జాగ్రత్తగా ఉండవలసిన సమయము. గురుపారాయణ శనగల గుగ్గిళ్లు ప్రసాదములు చేసి బాబా దేవాలయములో పంచండి.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అన్ని రంగాలలో ఉన్నవారికి వనరులు అనుకూలంగా ఉన్నవి మీరు చాకచక్యంగా నడుచుకొనగలరు. ఇతరుల మన్ననలు పెరుగును. కాని పొంగి పోరాదు. గర్వ పడరాదు. దుర్గాదేవి ఆరాధన వలన అనుకూలమైన ఆదాయ వనరులు కలిగి ఉంటారు.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఇష్టదేవతలను ప్రతి నిమిషంలో స్మరించగలరు. ప్రతి విషయంలో దైవసంబంధమైన బలం కావాలి. ఆర్థిక పెంపు గురించి ఆలోచన చేయండి. తొందరపాటు తగదు అవసరమైన పెద్దల సలహాలు తీసుకొనగలరు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు దూర ప్రయాణములలో ప్రమాదములు కలిగి ఉన్నారు. వాయిదా వేయండి. తప్పనిసరి అయితే శకునం చూసుకుని రాహుకాలంను జాగ్రత్తగా గమనించండి. భార్యకు అనారోగ్య సూచనలు ఉన్నవి. భార్యాపిల్ల ఆనందంలో ఆరోగ్యము బాగుంటుంది. శివారాధన చేయండి.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంతవరకు జాగ్రత్తలు పాటించగలరు. ఆర్భాటమునకు సమయం కాదు. అప్పులు చేయరాదు. తెలియని విషయములలో తలదూర్చరాదు. మీరు విశ్వాసముతో ఉంటే ప్రమోషన్ తప్పనిసరిగా రాగలదు. గురువును ఆశ్రయించి ఆనందంగా ఉండండి.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు వ్యాపారంలో సామాన్యంగా ఉంటుంది. విందు వినోదములో కొంత జాగ్రత్తలు తీసుకొనగలరు. తొందరపాటు నిర్ణయాలతో కష్టనష్టములు భరించగలరు. ఇంట్లో అఖండ దీపారాధన చేయండి.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశి స్త్రీ పురుషులకు మాటలలో చాకచక్యం మరియు వాక్చాతుర్యం ఉంటుంది. అలంకరణ విషయంలో శ్రద్ధ ఉంచగలరు. ఆకర్షణీయంగా వస్త్రములు ధరించగలరు. ఏదో ఒక కొత్తదనం ఉంటుంది. సరస్వతి లక్ష్మీ కుబేరులకు పూజలు చేయండి.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వ్యక్తిగత సమస్యలకు దూరంగా ఉండండి. ఏ విధమైన ఆటంకములు వచ్చినట్లుగా అనిపించినా భయము వదలి ముందుకు సాగండి. దూర ప్రయాణములు కలసి రాగలవు. పార్వతి పరమేశ్వర పూజలు సంతృప్తిని ఇవ్వగలవు.

## కుంభరాశి

ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలమైన రోజులు. విందు వినోదములు. వివాహ ప్రయత్నములు. గృహోప అలంకార వస్తు వాహనములు. ఆదాయ వనరులు ఏ స్థాయి వారికి ఆ విధంగా ప్రయత్నములు చేయండి. నవగ్రహ ఆరాధనలు జపాలు ప్రదక్షిణలు తైలాభిషేకము వలన సంతృప్తి ఉంటుంది.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలం. వృత్తి వ్యాపారాంలో ఆనందంగా ఉండగలరు. వివాహ ప్రయత్నములు ఫలించగలవు. జాతకములు కలిసినవారితో వివాహం ఆనందంగా ఉంటుంది. సత్యదేవుని వ్రతం చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,

హబ్సీగూడ, హైదరాబాద్-500007,

ఫోన్: 040-27175050

Email: srivenkatesham@gmail.com


**ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.**

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. సూర్యుని జన్మ నక్షత్రం ఏది?
2. శ్రీవారు తన రెండు కాళ్ళను ఎవరి తలపై పెట్టి కలలో అనుగ్రహించారు?
3. తిరుమల క్షేత్ర పాలకుడు ఎవరు?
4. స్వామివారి హారతి నేటికీ ఎవరి వంశం కొనసాగిస్తున్నది?
5. కులశేఖరాళ్వార్లు – ఎవరి అంశతో జన్మించారు?
6. భీష్మునికి స్వచ్ఛంద మరణ వరాన్ని ఇచ్చిందెవరు?
7. తిరుప్పావైలోని 5వ పాశురములో ఏది ముఖ్యమైనది?
8. శ్రీహరి విభవావతారమేది?
9. సక్కుబాయికి మంత్రదీక్షనిచ్చిన గురువు ఎవరు?
10. ఆంజనేయుని జన్మ నక్షత్రం ఏది?
11. వేంకటాద్రి పైన అడుగు పెట్టినంతనే సకల పాపాలు హరించుకుపోయినది ఎవరికి?
12. కంసుడు ఎవరి కొడుకు?
13. శ్రీకృష్ణుని వంశానికి పురోహితుడెవరు?
14. భూమి పైన వాగ్దేవి పేరేమిటి?
15. సరస్వతీమాత కవచం పేరేమిటి?

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________
6. ______________________
7. ______________________
8. ______________________
9. ______________________
10. ______________________
11. ______________________
12. ______________________
13. ______________________
14. ______________________
15. ______________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1.మృదుమన్యుడు అనే రాక్షసుని, 2. ఇంద్రుడు, 3. త్రేతాగ్నులు, 4. కాత్యాయనీ వ్రతం, 5. సంక్రాంతికి, 6. ఇంద్రాణి, 7. కుబ్జకు, 8. పద్మావతి, 9. శ్రీశైలం, 10. వ్యాఘ్రపాదుడు, 11. ధనుర్మాసం, 12. గరుత్మంతుని, 13. చంద్రుడు, 14. లీలావతి, 15. అలుదా నదీ తీరంలో

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## సరైన సమాధానాలు రాసినవారు

1. పి. యశోద
2. జె. ఇందిర
3. చిల్లర సీతారామారావు
4. చింతలపాటి శివశంకరశాస్త్రి
5. యం. కనకవల్లి
6. మహేందర్

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**చింతలపాటి శివశంకర శాస్త్రి**



Postel Registration No:
HSE/879/2025-2027

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122



If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq